

జోడు రమేష్ కుమార్
చీఫ్ బ్యూరో
+91 99592 92159

KADILIMCHE VAARTHA Telugu daily
కదిలించే వార్త
తెలుగు దినపత్రిక

TV6 NATIONAL NEWS CHANNEL

సంపుటి : 05 సంచిక : 340 పేజీలు : 08, వెల రూ. 5రూ/ బుధవారం - 14 - మే - 2025

Ananthapuramu. Vijayawada. Tirupati. Visakhapatnam. tadepalligudem. Guntur. Kurnool. Nellore. Srikakulam. Rajamahendravaram. Kadapa. Ongole. Chittoor. Hyderabad. mahabubnagar. Warangal. Khammam. Nalgonda. Nizamaba

# ఆపరేషన్ సిందూర్'పై 70 దేశాలకు భారత్ బ్రీఫింగ్

- 70 దేశాల దౌత్యాధికారులకు రక్షణ నిఘా సంస్థ డీజీ వివరణ
- లక్ష్యాల ఎంపిక, భారత సైనిక సామర్థ్యం, తప్పుడు ప్రచార ఖండనపై స్పష్టత
- కేంద్ర మంత్రివర్గం, పార్లమెంటరీ కమిటీకి కూడా ఆపరేషన్ వివరాలు




## భారత సైనికులు కొట్టిన దెబ్బకు శత్రు స్థావరాలు

# మట్టిలో కలిసిపోయాయన్న మోదీ

## పాక్ సైన్యానికి నిద్రలేని పరిస్థితి సృష్టించామన్నారు.

- భారత్ మాతా కీ జై అనే నినాదం శత్రువుల చెవుల్లో గింగిరాలు తిరుగుతోందని అన్నారు.
- ఆపరేషన్ సిందూర్ భారత్ ఆత్మవిశ్వాసానికి కొత్త ప్రమాణాలను లిఖించిందన్న మోదీ,
- భారత్ ఇచ్చే సమాధానం ఎలా ఉంటుందో పాక్‌కు అర్థమైందని మోదీ వెల్లడించారు.
- ఉగ్రదాడి జరిగితే నచ్చిన సమయంలో నచ్చినట్లు భారత్ ప్రతీకార దాడి చేస్తుందని మోదీ స్పష్టం



ఢిల్లీ: భారత్ మాతా కీ జై అనేది కేవలం నినాదం కాదని, దేశం కోసం తమ ప్రాణాలను అంకితం చేస్తామని మన సైనికులు చేసే ప్రతిజ్ఞ అని ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. భారత్ మాతా కీ జై అనే నినాదం శత్రువుల చెవుల్లో గింగిరాలు తిరుగుతోందని అన్నారు. భారత సైనికుల ధైర్య సాహసాల కారణంగా ఆపరేషన్ సిందూర్ విజయం ప్రతిధ్వనులు ప్రపంచవ్యాప్తంగా వినబడుతున్నాయని మోదీ చెప్పారు. భారత సైనికులు కొట్టిన దెబ్బకు శత్రు స్థావరాలు మట్టిలో కలిసిపోయాయని మోదీ వ్యాఖ్యానించారు. భారత క్షిపణులు, డ్రోన్లు పాక్ భూభాగంలోకి చొచ్చుకెళ్లి విధ్వంసం సృష్టించాయని, పాక్‌లో ఎక్కడ కూడా ప్రశాంతంగా శ్వాస తీసుకునే అవకాశం లేకుండా చేశామని మోదీ అన్నారు. పాక్ సైన్యానికి నిద్రలేని పరిస్థితి సృష్టించామన్నారు.

## జిల్లాలో 2 రోజులు భారీ వర్షాలు..

# ఆ జిల్లాల్లో మండనున్న ఎండలు..



ఓవైపు వానలు దంచికొడుతుంటూ..

మరోవైపు ఎండలు బంబేలిస్తున్నాయి..

పిడుగులతో కూడిన భారీవర్షాలు, మరికొన్ని చోట్ల ఎండలు భారీ ప్రభావం చూపే అవకాశం ఉందని

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ఎండలు మండాల్సిన సమయంలో భిన్నమైన వాతావరణం కనిపిస్తోంది.. ఓవైపు వానలు దంచికొడుతుంటూ.. మరోవైపు ఎండలు బంబేలిస్తున్నాయి.. ఇక, రానున్న రెండు రోజుల్లోను.. భిన్నమైన వాతావరణ పరిస్థితులు నెలకొనన్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ

## మరిన్ని ఎస్-400లు కావాలి..

## రష్యాకు భారత్ అధికారిక అభ్యర్థన



- ఎస్-400 సామర్థ్యం యుద్ధ క్షేత్రంలోనే రుజువైన నేపథ్యంలో ఈ వ్యవస్థలు
- మరిన్ని కావాలంటూ భారత్ రష్యాను అధికారికంగా కోరినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.
- ఎస్-400లు మోహరించిన ఆదమ్‌పూర్ వైమానిక స్థావరాన్ని కూడా సందర్శించారు.
- 400 కిలోమీటర్ల దూరంలోనే ధ్వంసం చేస్తుంది.

## మన ఖజానా

# పెరగాలి

## అధికారులకు చంద్రబాబు దిశానిర్దేశం

- రాష్ట్ర ఆదాయానికి సీఎం చంద్రబాబు వ్యూహం
- లోతైన అధ్యయనం చేయాలని అధికారులకు స్పష్టీకరణ
- పన్ను ఎగవేతలకు టెక్నాలజీతో చెక్!
- ఎర్రచందనం విక్రయంపై ప్రత్యేక కమిటీ
- నూతన ఎక్సైజ్ విధానం సత్ఫలితాలనిస్తున్నా, మరింత మెరుగుపడాలన్నారు.
- పొరుగు రాష్ట్రాల నుంచి అక్రమ మద్యం రవాణాను కఠినంగా నియంత్రించాలని, మద్యం సరఫరా నుంచి అమ్మకాల వరకు పూర్తి పారదర్శకత




అమరావతి : రాష్ట్ర ఆర్థిక వనరులను గణనీయంగా పెంచేందుకు పటిష్టమైన వ్యూహంతో ముందుకు సాగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు. నేడు సచివాలయంలో

## రాష్టానికి వచ్చేందుకు

## 91 పెద్ద కంపెనీలు సిద్ధంగా ఉన్నాయి



- పరిశ్రమలకు రెడ్ కార్పెట్... ప్రతి సంస్థకు ఒక నోడల్ అధికారి
- నారా లోకేశ్ వినూత్న నిర్ణయం
- వచ్చే ఐదేళ్లలో ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో 5 లక్షల ఉద్యోగాలు
- రాబోయే ఐదేళ్లలో ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో 5 లక్షల ఉద్యోగాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు.

అమరావతి : రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి ఊతమిచ్చేందుకు ఏపీ ప్రభుత్వం నడుం బిగించింది. నూతన పరిశ్రమల స్థాపనకు ముందుకొస్తున్న సంస్థలకు సత్వర అనుమతులు, పూర్తిస్థాయి సహకారం అందించాలని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు.

## హరీష్ రావుకు

## మంత్రి ఉత్తమ్ కౌంటర్



- 43. 10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు.
- ధాన్యం అమ్ముకోవడానికి రైతులు యుద్ధం చేస్తుంటే.. రేవంత్ మాత్రం అందాల పోటీల చుట్టూ తిరుగుతున్నారని

హైదరాబాద్: సీఎం రేవంత్ రెడ్డి ధాన్యం కొనుగోళ్లను వదిలేసి అందాల పోటీల చుట్టూ తిరుగుతున్నారంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు చేసిన వ్యాఖ్యలకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కౌంటరిచ్చారు. ఈ మేరకు ధాన్యం కొనుగోళ్ల లెక్కలను విడుదల చేశారు ఉత్తమ్. ఈ ఏడాది రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసినట్లు ఉత్తమ్ పేర్కొన్నారు. 43. 10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు.

## దేశంలో ఎక్కడా

# ఇలాంటి పథకం లేదు'

- భారతదేశంలో ఇలాంటి పథకం ఎక్కడా లేదు.
- 'పది సంవత్సరాలు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఎలాంటి భృతి, ఉద్యోగ అవకాశాలు కల్పించలేదు.
- తెలంగాణ రాష్ట్ర యువత నిరాశా నిస్పృహల్లో పది ఏండ్లు గడిపింది.
- మిగిలిన ఉద్యోగాల కోసం జాబ్ క్యాలెండర్ ప్రకటించాం.
- కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 52,000 మందికి ఉద్యోగ అవకాశాలు ఇచ్చాం.




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా. రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగ యువకులు వాళ్ల కాళ్ళ మీద వాళ్ళు నిలబడేందుకు స్వయం ఉపాధి అవకాశాన్ని ఎంచుకొని ఎదగడానికి రాజీవ్ యువ వికాసం పథకం వరం లాంటిదన్నారు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు నియోజకవర్గంలోని బయ్యారం టేకులపల్లి మండలాల్లో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేసిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క.. ఈ మేరకు మాట్లాడారు. 'పది సంవత్సరాలు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఎలాంటి భృతి, ఉద్యోగ అవకాశాలు కల్పించలేదు. తెలంగాణ రాష్ట్ర యువత నిరాశా నిస్పృహల్లో పది ఏండ్లు గడిపింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 52,000 మందికి ఉద్యోగ అవకాశాలు ఇచ్చాం.

## పార్టీ మార్పుపై హరీష్ రావు

# సంచలన వ్యాఖ్యలు



- బీఆర్ఎస్ పార్టీలో ఎలాంటి పంచాయితీ లేదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పష్టం చేశారు.
- పార్టీ మారుతానని.. జరుగుతోన్న చిల్లర ప్రచారాన్ని బంద్ చేయాలని సూచించారు.
- కేటీఆర్ నాయకత్వంపై అనేక సార్లు నా అభిప్రాయాన్ని చెప్పానని, మాపార్టీలో ఎలాంటి పంచాయితీ లేదని స్పష్టం చేశారు.

అమరావతి: పార్టీ మార్పుపై వచ్చే ఫేక్ ప్రచారాన్ని నమ్మొద్దని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు కీలక వ్యాఖ్యలు చేశారు. సోషల్ మీడియాలో

## ఆపరేషన్ సిందూర్'పై
# 70 దేశాలకు భారత్ బ్రీఫింగ్

ఢిల్లి: పీఓకే, పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకుని భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'కు సంబంధించిన కీలక వివరాలను అంతర్జాతీయ సమాజానికి భారత్ తెలియజేసింది. ఈ ఆపరేషన్ గురించి రక్షణ నిఘా సంస్థ (డీఐఏ) డైరెక్టర్ జనరల్, లెఫ్టినెంట్ జనరల్ డీఎస్ రాణా సుమారు 70 దేశాలకు చెందిన దౌత్యాధికారులకు సమగ్రంగా వివరించారు. ఢిల్లీలోని రక్షణ మంత్రిత్వ శాఖ కార్యాలయంలో ఈ ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో, 'ఆపరేషన్ సిందూర్' కోసం లక్ష్యాలను ఏ విధంగా ఎంపిక చేశారో, ఈ ఆపరేషన్‌లో ప్రదర్శితమైన భారత సైనిక శక్తిసామర్థ్యాలను లెఫ్టినెంట్ జనరల్ డీఎస్ రాణా దౌత్యవేత్తలకు వివరించారు. భారతదేశానికి వ్యతిరేకంగా కొన్ని శక్తులు చేసిన తప్పుడు ప్రచారాన్ని, దాని వల్ల ప్రాంతీయ స్థిరత్వంపై పడే ప్రభావాన్ని ఆయన స్పష్టంగా తెలియజేశారు. అటువంటి తప్పుడు సమాచారాన్ని భారత్ ఏ విధంగా సమర్థవంతంగా ఎదుర్కొందో కూడా ఆయన వివరించారు. మరోవైపు, 'ఆపరేషన్ సిందూర్' నేపథ్యంలో భవిష్యత్ భద్రతా వ్యూహాలు, సైనిక సన్నద్ధతపై చర్చించేందుకు బుధవారం కేంద్ర మంత్రివర్గం సమావేశం కానుంది. మరోవైపు, ఈ ఆపరేషన్‌కు సంబంధించిన వివరాలను విదేశాంగ వ్యవహారాల పార్లమెంటరీ స్థాయి సంఘ సభ్యులతో కూడా కేంద్ర ప్రభుత్వం పంచుకోనుంది. మే 19వ తేదీన పార్లమెంటరీ కమిటీ ఛైర్మన్ శశిథరూర్ అధ్యక్షతన జరగనున్న సమావేశంలో విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ 'ఆపరేషన్ సిందూర్' వివరాలను సభ్యులకు వెల్లడించనున్నారు.

## పార్టీ మార్పుపై హరీష్ రావు సంచలన వ్యాఖ్యలు

వచ్చిన వార్తలపై డీజీపీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేటీఆర్ నాయకత్వంపై అనేక సార్లు నా అభిప్రాయాన్ని చెప్పానని, మాపార్టీలో ఎలాంటి పంచాయితీ లేదని స్పష్టం చేశారు. తాను పార్టీ మారుతానని జరుగుతోన్న చిల్లర ప్రచారాన్ని బంద్ చేయాలని ఆయన సూచించారు. కేటీఆర్ కు బీఆర్ఎస్ నాయకత్వ భాధ్యలు అప్పగిస్తే స్వాగతిస్తానని, క్రమశిక్షణ గల కార్యకర్తగా కేసీఆర్ ఆదేశాలను తూచా తప్పక పాటిస్తానని క్లారిటీ ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే రేవంత్ సర్కార్‌పై హరీష్ రావు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యం అమ్మకోవటానికి రైతులు కల్లాల్లో యుద్ధం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ధాన్యం రాశులను వదిలేసి.. రేవంత్ అందాల రాశుల చుట్టూ తిరుగుతున్నారని విమర్శలు గుప్పించారు. అందాల పోటీల నిర్వహణపై సీఎం రేవంత్ రెడ్డి బిజీ బిజీగా ఉంటున్నారని.. పాకిస్తాన్‌ను నమ్మి అప్పు ఇస్తున్నారు కానీ.. రేవంత్ రెడ్డిని నమ్మి అప్పు ఇవ్వడం లేదని సెటైర్లు వేశారు. రుణమాఫీ, రైతుబంధుపై సీఎం ఎందుకు రివ్యూ చేయటం లేదని ప్రశ్నించారు. తెలంగాణలో రైతుల మరణాలు కాంగ్రెస్ ప్రభుత్వ హత్యలేనని, చనిపోయిన రైతులకు 25లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయనందుకు తెలంగాణ రైతులకు రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలన్నారు. జూబ్లీహిల్స్ ప్యాలెస్‌లో, ఢిల్లీకి డబ్బులు పంపటంలో రేవంత్ రెడ్డి బిజీగా ఉన్నారని.. 48గంటల్లో కాదు కదా.. నెల రోజులకు కూడా రైతులకు డబ్బులు పడటం లేదని, ఐదు పైసలు కూడా బోనస్ కింద విడుదల చేయలేదని మండిపడ్డారు. పెట్టుబడి సాయం మెల్లగా.. ఏడాది పొడవునా ఇస్తామని భట్టి చెప్పటం సిగ్గుచేటి దూషించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలన్నీ బోగస్ అని నిప్పులు చెరిగారు. పది కిలోల తరుగు తీస్తున్నారని.. సీతక్క నియోజకవర్గంలో జట్టి రాజు ఆత్మహత్యాయత్నం చేశాడన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతుల కష్టాలపై సీఎం రేవంత్ సమీక్ష చేయడని.. రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల్లో ఉండి.. వడదెబ్బతో రైతులు చనిపోతున్నారని ధ్వజమెత్తారు.

## భారత సైనికులు కొట్టిన దెబ్బకు శత్రు స్థావరాలు
# మట్టిలో కలిసిపోయాయన్న మోదీ

భారత వైమానిక స్థావరాలపై దాడులు చేసేందుకు పాక్ నిరంతరం ప్రయత్నించిందని ఐతే సరిహద్దుల ఆవలే మన త్రివిధదళాలు ఆ దాడులను తిప్పికొట్టాయని తెలిపారు. పంజాబ్‌లోని జలంధర్ జిల్లాలో ఉన్న ఆదంపుర్ ఎయిర్‌బేస్‌ను సందర్శించిన ఆయన, సైనికులతో మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్ భారత్ ఆత్మవిశ్వాసానికి కొత్త ప్రమాణాలను లిఖించిందన్న మోదీ, కేవలం 25 నిమిషాల్లో సరిహద్దు ఆవల ఉగ్ర స్థావరాలను కచ్చితంగా గురిచూసి కొట్టామని తెలిపారు. మన క్షిపణి రక్షణ వ్యవస్థ ముందు పాక్ డ్రోన్లు, క్షిపణులు, విమానాలన్నీ తుడిచిపెట్టుకుపోయాయన్నారు. మన త్రివిధదళాలు చూపిన సామర్థ్యం ప్రపంచాన్ని నివ్వెరపరిచిందని తెలిపారు. మళ్లీ ఉగ్రదాడి జరిగితే భారత్ ఇచ్చే సమాధానం ఎలా ఉంటుందో పాక్‌కు అర్థమైందని మోదీ వెల్లడించారు. ఉగ్రదాడి జరిగితే నచ్చిన సమయంలో నచ్చినట్లు భారత్ ప్రతీకార దాడి చేస్తుందని మోదీ స్పష్టం చేశారు. ఉగ్రవాదులు, ఉగ్రవాదానికి మద్దతిచ్చే వారిని వేర్వేరుగా చూడమని అన్నారు. న్యూక్లియర్ బ్లాక్‌మెయిలింగ్‌కు భారత్ ఎట్టిపరిస్థితుల్లనూ తలొగ్గదని అన్నారు. త్రివిధదళాలు ఎవరి బాధ్యత వారు అద్భుతంగా నిర్వహించారని తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌లో మానవశక్తి, యంత్రశక్తి మధ్య అద్భుతమైన సమన్వయంతో పని చేసినట్లు చెప్పారు. అంతకుముందు ఆదంపుర్ ఎయిర్‌బేస్‌లో మోహరించిన ఎస్-400 గగనతల రక్షణ వ్యవస్థ ముందు నిలబడి సెల్యూట్ చేశారు ప్రధాని మోదీ. ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న వాయుసేన సిబ్బందితో ముచ్చటించిన వారిని అభినందించారు. దాదాపు గంటన్నరకుపైగా వైమానిక కేంద్రంలో గడిపిన ప్రధాని మోదీ, ఆపరేషన్ సిందూర్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. తర్వాత వైమానిక దళ సిబ్బందితో కలిసి పెద్దపెట్టున భారత్ మాతాకీ జై, జై జవాన్ నినాదాలు చేశారు.

## దేశంలో ఎక్కడా ఇలాంటి పథకం లేదు'

మిగిలిన ఉద్యోగాల కోసం జాబ్ క్యాలెండర్ ప్రకటించాం. నిరుద్యోగ యువత తలెత్తుకొనేలా రాజీవ్ యువ వికాస పథకాన్ని తీసుకొచ్చాం. భారతదేశంలో ఇలాంటి పథకం ఎక్కడా లేదు. జూన్ రెండవ తేదీ కల్లా యువజన వికాసం పథకం లబ్ధిదారులకు మంజూరు లెటర్లు అందజేస్తాం. అవగాహన లేని కొన్ని సోషల్ మీడియా సిబిల్ స్కోర్ విషయంలో తప్పుడు ప్రచారాన్ని చేస్తున్నాయి. సిబిల్ స్కోర్ కు రాజీవ్ యువ వికాస్ పథకానికి ఎలాంటి సంబంధం లేదు' అని మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

## జిల్లాలో 2 రోజులు భారీ వర్షాలు..
## ఆ జిల్లాల్లో మండనున్న ఎండలు..

మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ వెల్లడించారు. కొన్నిచోట్ల పిడుగులతో కూడిన భారీవర్షాలు, మరికొన్ని చోట్ల ఎండలు భారీ ప్రభావం చూపే అవకాశం ఉందని పేర్కొన్నారు.. ఈ వాతావరణ మార్పుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రైతులు వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు..

### అప్పుడు మాల్దీవులు, ఇప్పుడు టర్కీ.. ఇండియా దెబ్బకు విలవిల..

రేపు అనగా.. బుధవారం 14వ తేదీన రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, వైఎస్సార్ కడప, శ్రీసత్యసాయి, అన్నమయ్య జిల్లాల్లో పలుచోట్ల మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది.. ఇక, శ్రీకాకుళం, పార్వతీపురంమన్యం, విజయనగరం, కోనసీమ, పల్నాడు , గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉండగా.. ఈ సమయంలో గంటకు 50-60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని.. ఈ సమయంలో భారీ హోర్డింగ్స్, చెట్ల క్రింద, శిథిలావస్థలో ఉన్న గోడలు, భవనాలు దగ్గర నిలబడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.. ఇక, గురువారం రోజు అల్లూరి సీతారామరాజు, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, అనంతపురం, శ్రీసత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో పలుచోట్ల మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండగా.. పల్నాడు, ప్రకాశం, నంద్యాల, వైఎస్సార్, కర్నూలు, తిరుపతి జిల్లాల్లో పలుచోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురుస్తాయని తెలిపింది.. మరోవైపు.. రేపు ఉష్ణోగ్రతలు 41-43 డిగ్రీల మధ్య రికార్డు అయ్యే అవకాశం ఉందని.. విజయనగరంలోని మూడు మండలాలు, పార్వతీపురంమన్యంలోని 8 మండలాలు, తూర్పుగోదావరిలోని ఒక మండలం.. మొత్తం 12 మండలాల్లో తీవ్రవడగాలులు వీచే అవకాశం ఉండగా.. మరో 35 మండలాల్లో వడగాలులు ప్రభావం చూపే అవకాశం ఉన్నట్లు తెలిపారు విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్..

## హరీష్ రావుకు మంత్రి ఉత్తమ్ కౌంటర్

ప్రతి విషయంలో తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలని హరీష్ కు ఉత్తమ్ హితవు పలికారు. ఒకసారి హరీష్ లెక్కలు చూసి మాట్లాడితే మంచిదని సూచించారు.

### ధాన్యం రాశులు వదిలేసి.. అందాల రాశుల చుట్టూ..

సీఎం రేవంత్ రెడ్డిపై హరీష్ రావు మరోసారి మండిపడ్డారు. ధాన్యం అమ్ముకోవడానికి రైతులు యుద్ధం చేస్తుంటే.. రేవంత్ మాత్రం అందాల పోటీల చుట్టూ తిరుగుతున్నారని విమర్శించారు. సీఎం రేవంత్ అందాల పోటీల్లో బిజీగా ఉన్నారంటూ సెటైర్లు వేశారు. సీఎం రేవంత్ ధాన్యం రాశులు వదిలేసి అందాల రాశుల చుట్టూ తిరుగుతున్నారని చమత్కరించారు. రైతు సమస్యలపై సమీక్ష చేయడానికి సీఎం రేవంత్‌కు టైమ్ లేదని, రైతు ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలేనని హరీష్ రావు వ్యాఖ్యానించారు.

### ఇందిరమ్మ ఇళ్లపై బీఆర్ఎస్ వ్యాఖ్యలకు కౌంటర్

ఇందిరమ్మ ఇళ్లపై బీఆర్ఎస్ చేసిన వ్యాఖ్యలకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కౌంటరిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ లాగ కాదని, ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు ఇందిరమ్మ ఇండ్ల కోటా ఇస్తామన్నారు పొంగులేటి. ఇక ఏపీలో కలిసిన ప్రజల స్థానికతపై త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు.

## మ్యాంగో మ్యాజిక్

మామిడి పళ్లలో రారాజుగా బీహార్‌కు చెందిన 'మాల్దా' రకం పేరు తెచ్చుకుంది. ఈ పండు తోలు చాలా పలుచగా ఉంటుంది. తోలు తీయగానే పాలలా మామిడి గుజ్జు బయటికి వస్తుంది. అందుకే ఈ పళ్లను దుధియా (పాల) మామిడి అంటారు. మనదేశంలో లభించే ఖరీదైన మామిడి పళ్లలో 'కేసర్' ఒకటి. ఈ పండు తోలుతో పాటు గుజ్జు కూడా లేత కేసరి రంగును పోలి ఉంటుంది. అందుకే ఆ పేరు. అహ్మదాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఈ రకం ఎక్కువగా పండుతుంది. జునాఘడ్ నవాబులు తొలిసారిగా 1931లో ఈ రకం మామిడిని పండించారు. ఆ తరవాత 1934లో వీటికి 'కేసరి' అని నామకరణం చేశారు. మహారాష్ట్రలోని సింద్‌దుర్గ్ జిల్లాలోని దేవ్‌గఢ్‌లో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మామిడి పళ్లను పండిస్తున్నారు. అవే 'ఆల్ఫాన్సో' మామిడి. రంగు, రుచి, వాసనల్లో వీటి తరవాతే ఏవైనా. అందుకే వీటి ధర ఎక్కువ. సింద్‌దుర్గ్‌తో పాటు రాయ్‌గఢ్, రత్నగిరి జిల్లాల్లో కొంకణి తీరంలో ఈ మామిడి పళ్లను విస్తృతంగా పండిస్తారు.

## మరిన్ని ఎస్-400లు కావాలి..
# రష్యాకు భారత్ అధికారిక అభ్యర్థన

మొదటి పేజి తరువాయి



ఢిల్లి: పాక్ దాడుల్ని దీటుగా తిప్పికొట్టిన ఎస్-400 గగనతల రక్షణ వ్యవస్థ మిలిటరీ దళాల ప్రశంసలు పొందుతోంది. ఈ నేపథ్యంలో మరిన్ని ఎస్-400లు కావాలంటూ భారత్ రష్యాకు అధికారికంగా విజ్ఞప్తి చేసినట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇందుకు రష్యా కూడా అంగీకరించే అవకాశం ఉందని సమాచారం. పాక్ ప్రయోగించిన డ్రోన్లు, మిసైల్స్ వంటి వాటిని ఎస్-400 గగనతల రక్షణ వ్యవస్థ దీటుగా ఎదుర్కొన్న విషయం తెలిసిందే. మార్గమధ్యంలోనే పాక్ డ్రోన్స్, మిసైళ్లను ఇది ధ్వంసం చేసింది. అత్యంత కచ్చితత్వంతో, ప్రభావశీలతతో ఈ వ్యవస్థ పనిచేసిందని డిఫెన్స్ వర్గాలు పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలో మరిన్ని ఎస్-400లు కొనుగోలు చేసేందుకు భారత్ నిర్ణయించుకుంది. గగనతల రక్షణ వ్యవస్థను మరింత పటిష్ఠం చేసేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. రష్యా రూపొందించిన ఎస్-400ను భారత్ సుదర్శన్ చక్ర పేరుతో మోహరించిన విషయం తెలిసిందే. మొత్తం ఐదింటిని కొనుగోలు చేసేందుకు 2018లో భారత్, రష్యా మధ్య ఒప్పందం కుదిరింది. పాక్, చైనా నుంచి ముప్పు పొంచి ఉన్న తరుణంలో భారత్ వీటి కొనుగోలుకు మొగ్గు చూపింది. 2021లో తొలి ఎస్-400ను పంజాబ్‌లో మోహరించారు. వచ్చే ఏడాది చివరి నాటికి భారత్‌కు ఈ ఐదు సమకూరే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఎస్-400 ద్వారా నాలుగు రకాల మిసైళ్లను ప్రయోగించి శత్రదేశ డ్రోన్లు, యుద్ధ విమానాలు, క్రూయిజ్, బాలిస్టిక్ మిసైళ్లను ధ్వంసం చేయొచ్చు. ఇందులోని అత్యాధునిక ఫేజ్డ్ అరే రాడార్ ఒకేసారి 100 మిసైళ్ల ప్రయాణమార్గాన్ని గమనిస్తూ దాడులు చేయగలదు. శత్రదేశ మిసైళ్లు, యుద్ధ విమానాలు 600 కిలోమీటర్ల దూరంలో ఉండగానే ఇది గుర్తిస్తుంది. 400 కిలోమీటర్ల దూరంలోనే ధ్వంసం చేస్తుంది. వీటికి మొబైల్ లాంచర్లు కూడా అందుబాటులో ఉండటంతో యుద్ధ క్షేత్రంలో కావాల్సిన చోట రంగంలోకి దింపే అవకాశం కూడా ఉంది. ఎస్-400 ముప్పు ఉండటంతో పాక్ యుద్ధ విమానాలు అనేకం మార్గమధ్యంలోనే వెనక్కు మళ్లాల్సి వచ్చింది. తాజాగా ప్రధాని మోదీ.. ఎస్-400లు మోహరించిన ఆదమ్‌పూర్ వైమానిక స్థావరాన్ని కూడా సందర్శించారు. తద్వారా పాక్ వ్యాపిస్తున్న వందంతులకు చెక్ పెట్టారు.

# రాష్ట్రానికి వచ్చేందుకు 91 పెద్ద కంపెనీలు సిద్ధంగా ఉన్నాయి


మొదటి పేజి తరువాయి



రాష్ట్రంలో రూ.91,839 కోట్ల పెట్టుబడితో, 1,41,407 ఉద్యోగాలను కల్పించేందుకు సుమారు 91 దిగ్గజ సంస్థలు సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు. ఆ కంపెనీలకు అవసరమైన చేయూత అందించడంపై ఇవాళ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఉండవల్లిలోని తన నివాసంలో ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీఎస్ శాఖల ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన మంత్రి లోకేశ్, రాష్ట్రంలో యూనిట్లు ఏర్పాటు చేయడానికి ఆసక్తి చూపుతున్న ప్రతి పెద్ద కంపెనీకి ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమించాలని స్పష్టం చేశారు. దీనివల్ల అనుమతుల ప్రక్రియ వేగవంతమై, సంస్థలు త్వరితగతిన కార్యకలాపాలు ప్రారంభించేందుకు వీలవుతుందని తెలిపారు. రాబోయే ఐదేళ్లలో ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో 5 లక్షల ఉద్యోగాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు. విశాఖపట్నం నగరాన్ని అత్యాధునిక ఐటీ హబ్‌గా తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని, ఐటీ కంపెనీలకు చెల్లించాల్సిన ప్రోత్సాహకాల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. పౌరసేవలను మరింత సులభతరం చేసే దిశగా, 'మన మిత్ర' యాప్‌లో అందుబాటులో ఉన్న 317 సేవలను నెలాఖరు నాటికి 400కు పెంచాలని మంత్రి లోకేశ్ ఆదేశించారు. ధృవపత్రాలకు బ్లాక్‌చెయిన్, క్యూఆర్ కోడ్ సాంకేతికత జోడించాలని, పన్నుల బకాయిల వివరాలను వాట్సాప్ ద్వారా తెలిపేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆర్టీజీఎస్‌లో డేటా పాయింట్లు, కేపీఐలను ఇంటిగ్రేట్ చేసి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల సమాచారాన్ని రియల్ టైమ్‌లో పొందుపరచాలన్నారు. వాతావరణ సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించే వ్యవస్థను పటిష్టం చేయాలని, విశాఖలో జూన్ 9, 10 తేదీల్లో జరిగే ఈ-గవర్నెన్స్ జాతీయ సదస్సుకు విస్తృత ఏర్పాట్లు చేయాలని కోరారు. వివిధ ప్రభుత్వ శాఖల సమాచారాన్ని ఏకీకృతం చేసి, కృత్రిమ మేధ (ఏఐ) జోడించి ఒకే వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తేవాలని, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను సరళతరం చేయాలని మంత్రి సూచించారు. ప్రభుత్వానికి సంబంధించిన అన్ని జీవోలు, యాప్‌లను ఒకే వేదికపైకి తెచ్చి, ప్రజలకు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఐటీ కార్యదర్శి కాటంనేని భాస్కర్, ప్రత్యేక కార్యదర్శి బి.సుందర్, ఈడీబీ సీఈఓ సాయికాంత్ వర్మ తదితరులు పాల్గొన్నారు.


# మన ఖజానా పెరగాలి

మొదటి పేజి తరువాయి



ఆదాయార్జన శాఖలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో, గత మూడు దశాబ్దాల ఆదాయ సరళిని లోతుగా అధ్యయనం చేసి, భవిష్యత్తుకు పటిష్ఠ ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.1,34,208 కోట్ల ఆదాయాన్ని లక్ష్యంగా నిర్దేశించినట్లు సీఎం తెలిపారు. పన్ను ఎగవేతలను సమర్థవంతంగా అరికట్టేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, కృత్రిమ మేధను (ఏఐ) వినియోగించుకోవాలని చంద్రబాబు స్పష్టం చేశారు. అన్ని శాఖల సమాచారంతో 'డేటా లేక్' ఏర్పాటు చేయాలని, ఏఐ ఆధారిత పన్నుల వ్యవస్థను త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. దీని ద్వారా పన్ను చెల్లింపుదారులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు, ఎగవేతలకు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. బంగారం కొనుగోళ్లలో రాష్ట్రం ముందున్నప్పటికీ, పన్నుల రూపంలో ఆశించిన ఆదాయం రాకపోవడంపై దృష్టి సారించాలని సూచించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ఎర్రచందనం విక్రయాలకు, దాని విలువ నిర్ధారణకు ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. వేల కోట్ల విలువైన ఎర్రచందనం రాష్ట్రానికి ఒక వరం లాంటిదని, దీనిని సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఖజానాకు భారీ ఆదాయం సమకూర్చుకోవచ్చని అన్నారు. కమిటీ ద్వారా ఎర్రచందనం నిల్వలు, వాటి విలువపై స్పష్టమైన నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. పొరుగు రాష్ట్రాల నుంచి అక్రమ మద్యం రవాణాను కఠినంగా నియంత్రించాలని, మద్యం సరఫరా నుంచి అమ్మకాల వరకు పూర్తి పారదర్శకత ఉండేలా రియల్ టైమ్ ట్రాకింగ్ వ్యవస్థను పటిష్టం చేయాలని ఆదేశించారు. రవాణా శాఖ ఆదాయం ఇతర దక్షిణాది రాష్ట్రాలతో పోలిస్తే తక్కువగా ఉండటంపై దృష్టి సారించి, ఆదాయ మార్గాలను అన్వేషించాలని కోరారు. నూతన ఎక్సైజ్ విధానం సత్ఫలితాలనిస్తున్నా, మరింత మెరుగుపడాలన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) మే 11 నాటికి కేంద్రం నుంచి రూ.12,717 కోట్లు మాత్రమే వచ్చాయని, ఇది గత ఏడాదితో పోలిస్తే 26 శాతం తక్కువని అధికారులు సీఎంకు వివరించారు. ఆదాయార్జన శాఖలన్నీ నిర్దేశిత లక్ష్యాలను అధిగమించి, రాష్ట్ర ఆర్థిక స్వావలంబనకు కృషి చేయాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు.

# దేశ ప్రజల్లో ఎన్నో ఆశలను రేకెత్తించింది.




పహల్గాం ఉగ్రదాడి తర్వాత.. ఆ ఉగ్రదాడికి కారణమైన, ఉగ్రవాదులు, ఉగ్ర సంస్థలను పెంచిపోషిస్తున్న పాకిస్థాన్‌కు బుద్ధి చెప్పే ఉద్దేశంతో ప్రారంభించిన ఆపరేషన్ సిందూర్ ఉగ్రవాదులందరినీ మట్టుబెడతారని, తద్వారా పహల్గాంలో అమరులైన అమాయక పర్యాటకుల ఆత్మ శాంతిస్తుందని, ఉగ్ర స్థావరాలకు అడ్డాగా మారిన పాకిస్థాన్ నుంచి ఆక్రమిత కశ్మీర్‌ను భారత్ స్వాధీనం చేసుకుంటుందని, తద్వారా భవిష్యత్తులో ఇక అక్కడి నుంచి ఉగ్రవాదుల చొరబాట్లు ఉండవని ప్రజలు భావించారు.

సింధూ నది నీళ్లను ఆపివేసిన తర్వాత పాక్ కరువు కోరల్లో చిక్కుకొని కాళ్ల బేరానికి వస్తుందనే ప్రచారాలనూ దేశ ప్రజలు విశ్వసించారు. 1971లో బంగ్లా ఏర్పాటు చేసినట్టు బలుచిస్థాన్ ఏర్పాటువరకు మోదీ ప్రభుత్వం వెనుకడుగు వేయదని గాఢంగా నమ్మారు. దేశాన్నేలిన గత ప్రభుత్వాలు, పార్టీల చేతికానితనం వల్లె పాకిస్థాన్ రెచ్చిపోతుందని, నెహ్రూ తప్పిదం వల్లనే కశ్మీర్ సమస్య ఏర్పడిందని, ఇప్పుడు మోదీ పాక్‌కు బుద్ధి చెప్తాడని బీజేపీ ప్రచారం చేసింది. దానితో పాటు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఈసారి మోదీ కోసమైనా భారత్‌కు మద్దతు పలుకుతారని ప్రజలు నమ్మారు. అందుకే ఆపరేషన్ సిందూర్‌కు దేశ ప్రజలు మద్దతు తెలిపారు. ప్రతిపక్షాలు సైతం తమ రాజకీయ విభేదాలు, సైద్ధాంతిక వైరుధ్యాలను పక్కనబెట్టి ప్రభుత్వానికి మద్దతుగా నిలిచాయి. వరల్డ్ బ్యాంక్ (ఐఎంఎఫ్) మన అభ్యంతరాన్ని పెడచెవిన పెట్టి పాక్‌కు అప్పు ఇవ్వడం ద్వారా ముందే సంకేతాలిచ్చింది. ఈ విషయంలో మోదీ ప్రభుత్వం దౌత్యపరంగా విఫలమైంది. ఇక ఆపరేషన్ సిందూ ర్ జరిగిన మూడు రోజులు ఇస్లామాబాద్, కరాచీ, లాహెూర్, ఫైసలాబాద్, గుజర్న్‌వాలా, పెశావర్, క్వెట్ట, రావల్పిండి, సియాల్కోట్, సర్గోద, బహావల్‌పూర్ వంటి పాక్‌లోని ప్రధాన పట్టణాలు మన సైన్యం చేసిన దాడులతో అతలాకుతలమయ్యా యి. పాక్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్, ఎయిర్ బేస్ లులంచ్ ప్యాడ్‌లు అన్ని ధ్వంసమయ్యాయి. మన దేశం ఇన్ని విజయాలు సాధించిన తర్వాత అమెరికా ఒత్తిడితో కాల్పుల విరమణకు ఒప్పుకోవడం యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఏ శాంతి ఒప్పందం లేకుండా, ఉగ్రవాదులను అప్పగించకుండానే కాల్పుల విరమణకు ఎందుకు ఒప్పుకున్నారో దేశ ప్రజలకు ప్రధాని మోదీ చెప్పాలి. పక్కలో బల్లెం లాంటి పాకిస్థాన్ పీక పిసికే ఒక సువర్ణావకాశాన్ని అమెరికా ఒత్తిడికి తలొగ్గి మాత్రమే వదులుకున్నామా? అనేది దేశ ప్రజల ముం దున్న అతిపెద్ద ప్రశ్న. 1971లో కూడా పాకిస్థాన్‌కు మద్దతుగా దాడి చేస్తామని అమెరికా బెదిరించింది. ఆ బెదరింపులను లెక్కచేయని ఇందిరా గాంధీ పాకిస్థాన్‌ను రెండు ముక్కలు చేయడాన్ని జనం ఇప్పుడు గుర్తు కు తెచ్చుకుంటున్నారు. ఈ కాల్పుల విరమ ణ కూడా మన దేశ ప్రధాని కాకుండా, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియాలో ప్రకటించడం యావత్ దేశానికే అవమానకరంగా ఉన్నది. ఆధునిక యుగంలో యుద్ధం ఎలా ఉన్నా దౌత్యనీతి, రాజనీతి ద్వారా మాత్రమే శత్రువును మన కాళ్ల దగ్గరికి తీసుకురాగలమని, ప్రజలను మతపరమైన భావోద్వేగాల కు గురిచేసి ఓట్లు దండుకున్నంత సులువుగా ప్రపంచ దేశాలు మనకు అండగా ఉంచుకోలేమని గుర్తెరగాలి. అంతేకాకుండా అమెరికా లాంటి దేశాలు తమ దేశ ప్రయోజనాలు, వ్యాపార ప్రయోజనాలకే పెద్దపీత వేస్తాయి కానీ, ఆలింగనాలకు మిత్రులైపోయి మనకు సహకరిస్తాయనుకోవడం అవివేకమే అవుతుంది. చరిత్రలో మనకంటే ముందు దేశా న్నేలిన ప్రధానులు, ప్రభుత్వాలు కూడా అప్పటి కాలమాన, దేశ అంతర్గత, అంతర్జాతీయ పరిస్థితులను బట్టి నిర్ణయాలు తీసుకున్నారు తప్ప బీజేపీ ప్రచారం చేసినట్టు వారికి ధైర్యం లేక కాదు, రాజనీతిజ్ఞత తెలువక కాదు. గత ప్రభుత్వాలను నిందించడం సులువే కానీ, ప్రభుత్వంలలో ఉండి సంక్షోభాలు ఏర్పడినప్పుడు దేశాన్ని విజయం వైపు నడిపించడం అంత సులువు కాదన్న విషయాన్ని బీజేపీ నాయకులు, శ్రేణులు ఇకనైనా గమనించాలి. ఆపరేషన్ సిందూర్ విషయంలో అమెరికా జోక్యానికి అవకాశం ఇచ్చి మన దేశ అంతర్గత సమస్య అయిన కశ్మీర్ విషయంలో ఇతర దేశాలకు అవకాశం ఇచ్చినట్టయింది.

# సంపాదకీయం

## అనుకున్నది సాధించాం, అప్రమత్తంగా ఉందాం

భారత్ పాకిస్థాన్ తాజా యుద్ధస్థితి ఉభయ దేశాల భావి సంబంధాలను నిర్ణయాత్మకంగా ప్రభావితం చేస్తుందనడంలో సందేహం లేదు. ఏప్రిల్ 22న పహల్గాంలోని బైసరన్ లోయలో పాక్ ప్రేరేపిత ఉగ్రవాద దాడి యావద్భారతీయులను అమితంగా కలచివేసింది. ఆ హతులు అందరూ ఆసేతు హిమాచలంలోని అన్ని ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు. కశ్మీర్‌లో ప్రశాంత పరిస్థితులను భగ్నం చేసి, ఆ కేంద్ర పాలిత ప్రాంత పర్యాటక రంగ ఆధారిత ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేసే కుతంత్రంతో జరిగిన ఉగ్రవాద దాడిపై సమస్త భారతీయుల ఆగ్రహావేశాలు, భావోద్వేగాలలో కేంద్ర ప్రభుత్వమూ పాలుపంచుకున్నది. 2016లో ఉరి, 2019లో పుల్వామా ఉగ్రవాద ఘాతుకాలు సంభవించినప్పుడు భారత్ శక్తిమంతమైన, ప్రభావదాయకమైన ప్రతిచర్యలు చేపట్టింది. భవిష్యత్తులోనూ ఎలాంటి ఉగ్రదాడులకైనా అటువంటి ప్రతిస్పందనలు ఖాయమని ఆ ప్రతి దాడులతో భారత్ స్పష్టం చేసింది. పహల్గాం పాశవికకాండకు మరింత కఠినమైన గుణపాఠాన్ని నేర్పాలని భారత్ దృఢంగా సంకల్పించుకున్నది. ఆ సంకల్పసాధనలో భాగంగా తొలుత భారత్‌లోని పాకిస్థానీ జాతీయుల వీసాలను రద్దు చేసిందిబీ దశాబ్దాలుగా అమల్లో ఉన్న పాకిస్థాన్‌కు ప్రాణాధారమైన సింధునదీజలాల ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేసింది. ఈ నిర్ణయాలతోనే పహల్గాంపై తన ప్రతీకార చర్య ఎంత కఠినంగా ఉండేది భారత్ తేటతెల్లం చేసింది. మే 7 ప్రాతఃకాలంలో ఆపరేషన్ సిందూర్ పేరిట ఎంపిక చేసుకున్న తొమ్మిది ప్రదేశాల (పాకిస్థాన్‌లో నాలుగు, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఐదు)లోని ఉగ్రవాదుల స్థావరాలపై భారత వాయుసేన క్షిపణి దాడులు నిర్వహించింది. పహల్గాం ఊచకోత అనంతరం పాకిస్థాన్ సాయుధ బలగాలు అప్రమత్తంగా ఉన్నప్పటికీ మన సైనిక దళాలు ఎంచుకున్న నిర్దిష్ట లక్ష్యాలను కచ్చితంగా ధ్వంసం చేయడంలో సంపూర్ణంగా సఫలమయ్యాయి. పాకిస్థాన్ పంజాబ్ రాష్ట్రంలోని బహ్వల్‌పూర్ (జైష్ మహమ్మద్ ప్రధాన కార్యాలయమున్న నెలవు), మురిద్కే (లష్కరే తయిబా ప్రధాన స్థావరమున్న ప్రదేశం) పట్టణాలపై జరిగిన ఆ మెరుపుదాడులు ఒక వాస్తవాన్ని తిరుగులేని రీతిలో వెల్లడించాయి. పాకిస్థాన్ ఆధారిత, ప్రేరేపిత ఉగ్రవాదులు ఎక్కడ ఉన్నా సరే వారిని శాశ్వతంగా మట్టుబెట్టి తీరాలన్న భారత్ దృఢసంకల్పాన్ని అవి విశాల ప్రపంచానికి, మరీ ముఖ్యంగా ఇస్లామాబాద్ పాలకులకు ఎటువంటి మినహాయింపులు లేకుండా చాటిచెప్పాయి. తన భూభాగాలపై ఎటువంటి ఉగ్రదాడినైనా యుద్ధ చర్యగా పరిగణించి, అందుకు ప్రతిస్పందనగా పాకిస్థాన్‌లోని ఉగ్రవాద సంస్థల, బృందాల స్థావరాలను లక్ష్యంగా ప్రతిదాడులు జరుపుతామని ఆపరేషన్ సిందూర్‌తో భారత్ స్పష్టం చేసింది. భారత్%-%పాకిస్థాన్ సంబంధాల శబ్ద కోశంలో అదొక ప్రభావదాయక సూత్రంగా ఖాయమయింది. ఎటువంటి ఉగ్రదాడి అయినా యుద్ధచర్యే అన్న విషయాన్ని మోదీ సిద్ధాంతంగా భావించవచ్చు. పాకిస్థాన్ పట్ల మన దౌత్యనీతిలో ఒక కొత్త ఆలోచనకు, కచ్చితమైన ఆచరణకు మోదీ సిద్ధాంతం ప్రాతిపదికగా నిలుస్తుంది. భారత్, పాకిస్థాన్‌ల మధ్య ప్రస్తుత జగడానికి పహల్గాంలో ఉగ్రవాద ఘాతుకమే ప్రధాన కారణం. ఆ దాడికి ప్రతి స్పందనగా మనం చేపట్టిన దాడులు చర్య%-%ప్రతిచర్య క్రమంలో కీలకమైనవి. భారత్ తన ప్రతిచర్యలను జయప్రదంగా నిర్వహించి, పాక్ మద్దతుతో చెలరేగిపోతున్న ఉగ్రవాదుల గర్హనీయమైన మానవతా వ్యతిరేక నేరాలను అంతర్జాతీయ సమాజం దృష్టికి తీసుకువెళ్లడంలో సఫలమవ్వడం ఇస్లామాబాద్ పాలకులకు ఎంతైనా ఆగ్రహం తెప్పించింది. తత్ఫలితంగానే పాక్ సైనిక దళాలు భారత్‌పై తెగబడి దాడులు చేశాయి. కాల్పుల విరమణను సైతం ఉల్లంఘించి పరిస్థితులను మరింత విషమింపజేస్తున్నాయి. పాకిస్థాన్ ప్రేరిత ఉగ్రవాద మూకలు భవిష్యత్తులో పాల్పడే ఎటువంటి దాడులనైనా యుద్ధ చర్యలుగా పరిగణించి అందుకు అదే రీతిలో దీటుగా ప్రతిస్పందించడం ఒక సూత్రంగా ఇప్పుడు స్థిరపడింది. పాకిస్థాన్ మరింత భారీగా నష్టపోయేలా యుద్ధ చర్యలను కొనసాగించాలని ప్రభుత్వ విమర్శకులు పలువురు వాదిస్తున్నారు. అయితే ఆపరేషన్ సిందూర్‌ను నిర్వహించడంలో భారత్ మౌలిక లక్ష్యం తమ భూభాగాలలో ఎటువంటి ఉగ్రదాడినైనా యుద్ధచర్యగా పరిగణించి తీరుతామని నొక్కిచెప్పడమేనన్న విషయాన్ని ఆ విమర్శకులు విస్మరిస్తున్నారు. భారత్ తన లక్ష్యసాధనలో సందేహాతీతంగా జయప్రదమయింది. ఇక యుద్ధ చర్యలకు స్వస్తిచెప్పి మన ఆర్థిక వ్యవస్థ సర్వతోముఖాభివృద్ధి లక్ష్య సాధనపై దృష్టి కేంద్రీకరించాలి. భారత్, పాకిస్థాన్‌ల మధ్య ప్రస్తుత సంఘర్షణను సైనిక వ్యవహారాల నిపుణులు జాగ్రత్తగా అధ్యయనం చేయవలసిన అవసరమున్నది. ఈ 'యుద్ధా'నుభవాల ప్రాతిపదికన మనం సరైన నిర్ణయాలు తీసుకోవాలి. ఆపరేషన్ సిందూర్‌తో భారత్ సైనిక బలాధిక్యత తిరుగులేని రీతిలో రుజువయింది. మన వాయుతల రక్షణ వ్యవస్థలు అన్నీ ప్రశస్తంగా పనిచేశాయి. మన వాయుసేన ఎదురులేని రీతిలో పాక్ వాయుతలంలోకి ప్రవేశించి ఎంపిక చేసుకున్న నిర్దిష్ట లక్ష్యాలను కచ్చితంగా తుదముట్టించడం జరిగింది. ఉగ్రవాదానికి ఊతమిస్తున్న వ్యవస్థలను ధ్వంసం చేయడమే భారత్ అసలు లక్ష్యమని, పాకిస్థాన్‌ను విస్తృతంగా దెబ్బతీయడమే లక్ష్యంగా ఆపరేషన్ సిందూర్‌ను నిర్వహించడం జరిగిందన్న వాస్తవాన్ని మనం విస్మరించకూడదు. త్రివిధ సాయుధ బలగాల మధ్య పటిష్ఠ సమన్వయంతో పాక్‌పై ప్రతిదాడులు జరిగాయి. మన సాయుధ బలగాలకు ఇదొక కొత్త అనుభవం. మన దేశ రక్షకులు ఇంతకు ముందు చూడని, పాల్గొనని వినూత్న యుద్ధ తంత్రమది. ఆపరేషన్ సిందూర్ మన సాయుధ బలగాలకు ఒక శుభశకునం. భావి యుద్ధాలు, త్రివిధ దళాలు విడివిడిగా కాకుండా ఒక ఏకీకృత కమాండ్ ఆధ్వర్యంలో జరిగే సమరాలుగా ఉంటాయి.

# దృఢనిశ్చయం



ప్రధాని నరేంద్ర మోదీ ఎలాంటి శషభిషలూ లేకుండా కుండబద్దలు కొట్టారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తూ వాణిజ్యం అంటే కుదరదని, ఉగ్రవాదానికి ఊతమిస్తూ నీళ్లు కావాలంటే చెల్లదని, ఉగ్రవాదానికి అండదండలందిస్తూ చర్చలంటే అంగీకరించబోమని, అణు బెదిరింపులు తమను భయపెట్టలేవని మోదీ పంపిన సందేశంతోనైనా పాకిస్తాన్ ఇకపై బుద్ధెరిగి ప్రవర్తించాలి. జాతినుద్దేశించి సోమవారం ఆయన చేసిన ప్రసంగం ఆద్యంతమూ కశ్మీర్ విషయంలో పాక్ తీరుతెన్నులపై భారత్ వైఖరిలో వచ్చిన మార్పునకు అద్దం పట్టింది. ఒక కొత్త క్రమం బయల్దేరిందన్న సంకేతాన్నిచ్చింది. ఇకపై ఉగ్రవాదులనూ, వారికి సాయం చేసే ప్రభుత్వాన్నీ వేర్వేరుగా పరిగణించబోమని ఆయన ప్రకటించటం ఒక్క పాకిస్తాన్ మాత్రమే కాదు...ప్రపంచ దేశాలన్నీ గమనించాల్సిన అత్యంత కీలక అంశం. కాల్పుల విరమణ తాత్కాలిక దశేనని, ఉగ్రవాదం శిరసెత్తినప్పుడల్లా 'ఆపరే షన్ సిందూర్' కొనసాగుతూనే వుంటుందని మోదీ చెప్పటం గమనార్హం. ఉగ్రవాదం విషయంలో అమెరికా నిర్లిప్తంగా ఉంటున్నది. 2001లో తమ దేశంలో ఉగ్రవాద దాడులు జరిగినప్పుడు 'ఉగ్ర వాదంపై యుద్ధం' పేరిట ప్రపంచంలో ఎక్కడున్నా ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలిస్తామని ప్రక టించిన అమెరికా... కశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తున్న పాకిస్తాన్‌ను ఎప్పటికప్పుడు వెనకేసు కొస్తోంది. మొన్నటికి మొన్న పాక్‌కు ఐఎంఎఫ్ అప్పు పుట్టడంలో యథోచితంగా సహకరించింది. దాని చీకటి వ్యవహారాలు తెలియనట్టే ప్రవర్తిస్తూ ఎప్పటికప్పుడు నిధులూ, ఆయుధాలూ ఉదారంగా అందిస్తోంది. ఈ నేపథ్యంలోనే 'ఆపరేషన్ సిందూర్' కొనసాగుతుందని మోదీ ప్రకటించాల్సి వచ్చింది. దారుణ ఉదంతాలు జరిగినప్పుడల్లా ఏదో కారణం చూపి పాకిస్తాన్‌ను గట్టెక్కి స్తున్న దేశాలు ఇకముందు దీన్ని గమనించుకోక తప్పదు. ఎంతటి క్లిష్టసమయాల్లోనైనా పట్టువిడుపులు ప్రదర్శించటంలోనే పరిణతి వ్యక్తమవుతుంది. 'ఆపరేషన్ సిందూర్'తో పాకిస్తాన్‌లోని ఉగ్రమూకల స్థావరాలను ధ్వంసం చేయటంలోనూ, అక్కడి సైన్యం ప్రతిఘటనను తిప్పికొట్టడంలోనూ తెగువనూ, సాహసాన్నీ చూపిన భారత్... లక్ష్యసాధన పూర్తికాగానే కాల్పుల విరమణకు కూడా సిద్ధపడి తన పరిణతిని తెలియజెప్పింది. కానీ విఫల రాజ్యం అనే పేరును సార్థకం చేసుకుంటూ కాల్పుల విరమణకు ఒప్పుకున్నట్టే ఒప్పుకుని ఆ వెంటనే ఉల్లంఘించి పాక్ తన నైజాన్ని చాటుకుంది. ఆ దేశంలో రాజకీయ నాయకత్వానికీ, సైన్యానికీ ఎప్పుడూ సరైన సంబంధాలు ఉండవన్నది ప్రపంచానికి తెలిసిన సత్యం. కానీ సైనిక దళాలు సైతం ముఠాలుగా చీలివున్నాయని, వాటిపై ఎవరికీ అదుపులేదని తాజా పరిణామాలు నిరూపించాయి. ఈ నిజాన్ని గ్రహించకుండా, పాకిస్తాన్‌కు చీవాట్లు పెట్టకుండా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అణు యుద్ధాన్ని నివారించామని స్వోత్కర్షకు పోవటం... భారత్, పాక్‌లను ఒకే గాటన కట్టడం ఆశ్చర్య కరం. పాకిస్తాన్ చర్యల పర్యవసానం తమ వరకూ రానేరాదన్న భ్రమేదో ఆయనకున్నట్టుంది. కానీ ఉగ్రవాదాన్ని దుంపనాశనం చేయకపోతే అది ఏ దేశాన్నీ విడవకుండా మింగేస్తుందని ట్రంప్ గ్రహించటం అవసరం. ఉగ్రముఠాలను ప్రోత్సహించి ఊచకోతలను సాగిస్తున్న దేశాన్ని ఎవరైనా ఎలా ఉపేక్షించగలరు? దాని దగ్గర అణ్వాయుధాలున్నాయనీ, అది ముప్పు కలిగిస్తుందనీ... కనుక నోర్మూసుకు పడివుండాలనీ ట్రంప్ చెప్పదల్చుకున్నారా? వాణిజ్యాన్ని ఆపేస్తానని బెదిరించటంవల్ల రెండు దేశాలూ దారికొచ్చి కాల్పుల విరమణకు ఒప్పుకున్నాయని ఆయన అనటం కూడా అత్యంత అభ్యంతరకరమైంది. ఇలాంటి తర్కంతో ప్రోత్సహిస్తున్నదెవరినో గమనించుకుంటున్నారా? తాను ప్రపంచ దేశాలతో అధిక సుంకాల పేరిట యుద్ధం సాగిస్తున్నారు. గాజాలో ఇజ్రాయెల్‌ను నియంత్రించటం లేదు. అక్కడి మారణకాండను ఆపటం లేదు. మరి భారత్ పాక్ విషయంలో ఇంత ఆత్రుత దేనికో? ఎవరూ కోరకుండానే కశ్మీర్ సమస్యలో వేలెడతానని ఆయన తనకు తానుగా ఎలా చెప్పుకుంటారు? 2019లో సైతం ట్రంప్ ఇవే తరహా మాటలు మాట్లాడారు. ఆ తర్వాత జ్ఞానో దయమై ఆ సమస్యను రెండు దేశాలూ చర్చించి పరిష్కరించుకుంటాయని స్వరం మార్చారు. మళ్లీ ఇప్పుడేమైంది? తాజా ఘర్షణలకు మూలం ఎక్కడున్నదో ఆయన గ్రహించలేకపోయారని ట్రంప్ మాటలు గమనిస్తే తెలుస్తుంది. పహల్గామ్‌లో 26మంది పర్యాటకుల్ని పొట్టనబెట్టుకున్న ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ 'ఆపరేషన్ సిందూర్'ని ప్రారంభించింది. పాక్‌లోని 24చోట్ల ఉగ్రముఠాల స్థావ రాలను ధ్వంసం చేసింది. వందమంది ఉగ్రవాదుల్ని మట్టుబెట్టింది. కశ్మీర్‌లో ఉగ్రవాదులు చేసిన దాడికిది ప్రతీకారమే తప్ప కశ్మీర్ సమస్య పరిష్కారాన్ని ఉద్దేశించి మొదలెట్టిన దాడులు కాదు. అమెరికాకు చిత్తశుద్ధి ఉంటే ఉగ్రవాదులకు ప్రోత్సాహం అందించినంతకాలమూ తమ వైపుగా ఎలాంటి సాయమూ అందబోదని పాకిస్తాన్‌కు చెప్పాలి. ఆ దేశంతో సంబంధ బాంధవ్యాలు కొన సాగించే దేశాలపై కూడా ఆంక్షలుంటాయని ప్రకటించాలి. కానీ అందుకు విరుద్ధంగా ఆ దేశం కారణంగా నష్టపోతున్న భారత్‌నూ, దాన్నీ ఒకే గాటన కట్టడం ఎలాంటి సందేశం పంపుతుంది? ఇరు దేశాల మధ్యా చర్చలంటూ ఉంటే అది కేవలం పాక్ ఆక్రమిత కశ్మీర్‌పైనా, ఉగ్రవాదుల అప్పగింతపైనా మాత్రమే ఉంటాయని తన సందేశంలో మోదీ చెప్పటం ప్రశంసించదగ్గది. అమెరికా పోకడలు గమనిస్తే వర్తమాన ప్రపంచంలో ఎలాంటి న్యాయం అమలవుతున్నదో స్పష్టంగానే అర్థమవుతుంది. దశాబ్దాలుగా చీకాకు పెడుతున్న ఉగ్రవాద సమస్యపై మోదీ దృఢ నిశ్చయాన్ని ప్రకటించటం ఈ తరహా న్యాయాన్ని ప్రశ్నించటమే!

# కగార్‌పై కొత్త ప్రతిపాదనలు



'ఆపరేషన్ కగార్' కాల్పుల విరమణను కోరుతూ మావోయిస్టు పార్టీ ఇటీవల కేంద్ర ప్రభుత్వానికి చేసిన ప్రతిపాదనకు భిన్నంగా ఇప్పుడు కొన్ని కొత్త ప్రతిపాదనలు ముందుకువచ్చాయి. 'శాంతి చర్చల కో ఆర్డినేషన్ కమిటీ' పేరిట వచ్చిన ఆ ప్రతిపాదనలో గమనార్హమైన విశేషం ఒకటున్నది. శాంతిచర్చలు జరగవలసింది తమకు, ప్రభుత్వానికి మధ్య అన్నది మావోయిస్టుల వైఖరి కాగా, వారితో మాత్రమే కాదని, ఆదివాసీలతో, పౌరహక్కుల వారితో కూడానని ఈ కమిటీ కోరుతున్నది. ఈ మాటల అర్థ తాత్పర్యాల్లోకి వెళ్తే మనకు అనేకం కన్పిస్తాయి. ఆ చర్చలోకి వెళ్లేముందు కొన్ని మాటలు చెప్పుకోవాలి. కమిటీ వారు తమ లేఖను కేంద్ర ప్రభుత్వానికి గాక కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేకు రాశారు. కాల్పుల విరమణ కోసం కేంద్రాన్ని ఒత్తిడి చేయాలని, ఈ విషయం 'ఇండియా' కూటమిలోని పార్టీల దృష్టికి కూడా తీసుకువెళ్లాలని కోరారు. ఈ మేరకు ఖర్గే ఏమి చేయగలరో వేచి చూడవలసి ఉంటుంది. కమిటీ లేఖలో కాల్పుల విరమణ, శాంతి చర్చల ప్రస్తావనలు మాత్రమే లేవు. 'దశాబ్దాలుగా ఆ ప్రాంతాల్లో కొనసాగుతున్న దోపిడీ, భూముల స్వాధీనం, ప్రజా సమస్యల పట్ల వ్యవస్థల నిర్లక్ష్యం, తదితర కారణాల వల్ల ఈ విపత్కర పరిస్థితి తలెత్తటం' అనే ముఖ్యమైన మాట ఉన్నది. అదేవిధంగా, 'ఆదివాసీల రాజ్యాంగ హక్కుల కోసం పోరాడుతూ జైలుపాలైన ఆదివాసీ నేతలు, ఇతర హక్కుల నేతల' గురించి కూడా పేర్కొన్నారు. నక్సలిజం విషయం ఆషామాషీ వ్యవహారం కాదు. అందుకు గల కారణాలు, చరిత్ర చాలా ఉన్నాయి. అది తేలికగా తేలేది కాదు. కేవలం కాల్పులు, వాటి విరమణలకు పరిమితమైనది కాదు. ఇదంతా రాయటం ఎందుకంటే, ఆదివాసీ ప్రాంతాల్లో 'దశాబ్దాలుగా' జరుగుతున్నదంటున్న దానిలో ఆరంభ పాత్ర, దీర్ఘకాలపు పాత్ర మల్లికార్జున ఖర్గే పార్టీది. అందువల్ల కమిటీ వారు సమస్యను ఆ పార్టీ దృష్టికి తీసుకుపోరాదని అనటం లేదు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష పాత్ర తప్పదు. కానీ, కాంగ్రెస్ పార్టీ ఒకవైపు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి కాల్పుల విరమణకు ప్రయత్నిస్తూనే, మరొకవైపు అసలు నక్సలిజానికి కారణాలు? తాము పాలించిన దశాబ్దాల కాలంలో వాటి పరిష్కారానికి చేసిన ప్రయత్నాలు? వాటి నికర ఫలితాలు? ఆ ఉద్యమం అణచివేతకు స్వయంగా తాము తీసుకున్న చర్యలు 'ఆపరేషన్ కగార్'కు ఏ విధంగా భిన్నమైనవి? నక్సలిజం సమస్య పరిష్కారానికి తమతో పాటు తమ 'ఇండియా' కూటమి మిత్రుల సమగ్రమైన విధానం ఏమిటి? దానిని తాము పాలిస్తున్న రాష్ట్రాలలో అమలుపరచగలరా? ఒకవేళ భవిష్యత్తులో కేంద్రంలో అధికారానికి వచ్చినట్టయితే ఆ విధానం కొనసాగించగలరా? ప్రస్తుతానికి మోదీ ప్రభుత్వానికి ఆ కోణం నుంచి చేయగల ప్రతిపాదనలేమిటి? అనేవి కూడా చర్చించి ఒక విధానం రూపొందించి, ఆదివాసీలకు, తక్కిన దేశానికి వివరించటం అవసరం. అప్పుడు, కాంగ్రెస్ పార్టీ వెనుకటి రికార్డు ఎట్లున్నా, భవిష్యత్తు గురించి, వారి విధానాలపై, నిజాయితీపై దేశం చర్చించి అర్థం చేసుకునేందుకు, వారిని నమ్మాలో లేదో తేల్చుకునేందుకు వీలు కలుగుతుంది. లేనట్టయితే, ఏఐసీసీ అధ్యక్షుడు అనేకానేక ఇతర విషయాలలో వలెనే ఈ కమిటీ అంశంలో నూ కేంద్ర ప్రభుత్వానికి ఒక మొక్కుబడి లేఖ రా సి చేతులు దులుపుకోవటం అవుతుంది. ఇంత కూ కమిటీ వారు ఆయనకు నేరుగా కాక బహిరంగ లేఖ రాసినందున, అది ఆయన పట్టించుకునేది లేనిదీ తెలియదు. లేక, కమిటీ వారు ఆ లేఖ ను తనకు నేరుగా కూడా పంపుతారేమో తెలియ దు. అదెట్లా జరిగినా, పైన అనుకున్నట్టు, కాంగ్రెస్ నాయకత్వం ప్రభుత్వ నాయకత్వానికి లేఖ రాస్తూనే, పైన పేర్కొన్న విధానపరమైన స్పష్టతలు ఇవ్వటం అవసరం. లేనట్టయితే, తాము రాష్ట్రాల లో, కేంద్రంలో పాలించిన ప్రతిసారీ ఆదివాసీల పీడన, అణచివేత కొనసాగినట్టు, ముమ్ముందు కూ డా ఆ పనిచేయబోరన్న కనీసపు ఆశాభావమైనా ఆదివాసీలకు, తక్కిన సమాజానికి కలుగబోదు.కాల్పుల విరమణ, శాంతి చర్చల ప్రయత్నాలలో కొట్టవచ్చినట్టు కనిపిస్తున్న కొరత ఒకటున్నది. ఇందులో స్వయంగా ఆదివాసీ సంఘాలు, ప్రజా ప్రతినిధులు, ఇతర ప్రముఖుల పేర్లు కనిపించటం లేదు. వారి కోసం కృషిచేసే మైదాన ప్రాంతాల వారు మాత్రం అనేకులున్నారు. ప్రస్తుత కో ఆర్డినేషన్ కమిటీ ఆదివాసీ గ్రూపులు, ఆదివాసీ నేతలు అంటూ మాట్లాడటం బాగున్నది గాని, ఆ లేఖ సంతకందార్లలో ఆదివాసీలు కనిపించరు. ఇతరత్రా స్వయంగా ఆదివాసీలు కొన్ని చిన్న బృందాలుగా ఏర్పడి ఈ చర్చలలో పాల్గొంటున్నారు. అది ఆహ్వానించదగినది. కానీ, అవి ప్రాచుర్యం లేని చిన్న గ్రూపులు అయినందున ఎవరి దృష్టికి రావటం లేదు. మావోయిస్టు పార్టీ తనదే సర్వాధిపత్యం అనుకుంటుంది గనుక, ఆదివాసీలను అనుచరులుగా మాత్రమే చూస్తుంది గనుక, తమ అనుబంధ పౌరహక్కుల సంస్థలలోనూ వారిని ముందుకు తీసుకురాకపోవటాన్ని అర్థం చేసుకోవచ్చు. కానీ, మైదాన ప్రాంత మేధావులు కూడా ప్రస్తుత కో ఆర్డినేషన్ కమిటీ తరహాలో వారికి చోటు కల్పించరు. కాల్పుల విరమణ, శాంతి చర్చల ప్రయత్నాలలో కొట్టవచ్చినట్టు కనిపిస్తున్న కొరత ఒకటున్నది. ఇందులో స్వయంగా ఆదివాసీ సంఘాలు, ప్రజా ప్రతినిధులు, ఇతర ప్రముఖుల పేర్లు కనిపించటం లేదు. మరొక స్థాయిలో మాట్లాడాలంటే, ఆదివాసీ సమాజాలకు చెందిన ప్రజాప్రతినిధులు, విద్యావంతులు, ఎంతో కొంత సంపన్నులు అయినవారి సంఖ్య తక్కువేమీ కాదు. నక్సలిజం, దాని అణచివేతలు మొదలై సాగుతున్న ఐదున్నర దశాబ్దాల కాలంలో తమ సమాజాన్ని కాపాడుకునేందుకు వారు చేసినదేమిటనేది వేరే విషాద చరిత్ర. అదే స్థితి 'ఆపరేషన్ కగార్' సందర్భంలోనూ కనిపిస్తున్నది. ఎప్పుడూ వినిపించని ఆదివాసుల గొంతు ఇప్పుడూ వినిపించటం లేదు. ఎవరూ వినిపించనివ్వటం లేదు. అందరికీ వారు ఒక ఇంధనం మాత్రమే. ఇంతకూ మావోయిస్టు పార్టీ కాల్పుల విరమణను కోరుతున్నది ఎందుకోసం? ప్రస్తుతం తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్నందున ఈ గండం గడిచి గట్టెక్కేందుకా లేక, ఒకవేళ మోదీ ప్రభుత్వం నిజంగానే కాల్పులు విరమించి చర్చలకు ఆహ్వానిస్తే భవిష్యత్తుకు సంబంధించి అజెండా ఏమైనా ఉన్నదా? తమ అజెండా రాజ్యాంగపరమైన పరిపాలన, సంస్కరణల పరిధిలో ఉండి అందుకు ప్రభుత్వం అంగీకరిస్తే ఉద్యమ విరమణగా ముగుస్తుందా? ఆయుధాలను వదలటమవుతుందా? ప్రజాస్వామ్య వ్యవస్థలో ఆయుధాలకు తావులేదన్న వాదన ప్రభుత్వం నుంచి వస్తే ఏం చేస్తారు? అట్లాగాక, తమ అజెండాలో ప్రస్తుత రాజ్యాంగాన్నీ, వ్యవస్థనూ అంగీకరించబోము, కనుక ఆయుధ విరమణ ఉండదు, కాల్పుల విరమణ మాత్రమే అన్నది అజెండా అవుతుందా? ప్రస్తుతం తమ వైపు నుంచి ఆరు నెలలు ప్రకటించింది కాల్పుల విరమణే గాని ఆయుధాలు పక్కనపెట్టడం కాదు, విసర్జించటమూ కాదు. అటువంటి స్థితిలో, ప్రస్తుతం పూర్తి పైచేయిగా ఉన్న ప్రభుత్వం కాల్పుల విరమణకు ఎందుకు అంగీకరిస్తుందసలు? పోరాట విరమణ జరుగదు, కాల్పుల విరమణ మాత్రమే అంటే అమిత్ షా ఒప్పుకొంటారా? రాజ్యాంగం, చట్టాల అమలు గురించి మాట్లాడటం ఒక పరిధి విషయం. అది ఎవరు ఎంతైనా మాట్లాడవచ్చు. కానీ రాజ్యాంగాన్ని, వ్యవస్థను నిరాకరించటమనే సిద్ధాంతం మౌలికంగా భిన్నమైనది. ఆ విషయమై ఏమి మాట్లాడుతారు? మేము నిరాకరిస్తాము, మీరు మాత్రం కట్టుబడండి అంటూ చేసే సూత్రీకరణలు మేధోపరంగా బాగానే ఉంటాయి. కాని వారే అనే 'బూర్జువా, దోపిడీ వ్యవస్థ' అందుకు అంగీకరిస్తుందనుకోవటం, ఆ ప్రకారం రకరకాల చతురమైన తార్కిక వాదనలు చేయటం పూర్తి అవాస్తవికమైన బలహీనత. ముందు కాల్పులు విరమించండి, రాజ్యాంగ విషయాలు, ఇతర విషయాలు తర్వాత కూర్చుని మాట్లాడుకోవచ్చుననటం తమ అమాయకత్వమైనా కావాలి, హోంమంత్రి అమిత్ షా అమాయకుడని భావించటమైనా కావాలి. పైగా ప్రభుత్వంతో తాము సమాన స్కంధ స్థితిలో ఉన్నామనే అవాస్తవిక, స్వీయ భ్రమాత్మక ధోరణి కూడా మావోయిస్టుల ప్రకటనలలో కనిపిస్తున్నది. అటువంటి టేబుల్ కేంద్రం– నాగాల చర్చల వంటి సందర్భాలలో చూశాం. రాజశేఖరరెడ్డి ప్రభుత్వ కాలంలో చూశాం. ప్రస్తుతం పరిస్థితి మోదీ పాలనలో పలు విధాలుగా మారింది. పార్టీ కూడా అనేక విధాలుగా బలహీనపడింది. కనుక సమాన స్కంధత లేదు. మరొకవైపు ఆదివాసీల సమస్య తీవ్రత మారలేదు.

# సిందూర్ నిలిపివేతపై సందేహాలెన్నో

పహల్గాం ఉగ్రదాడి తర్వాత.. ఆ ఉగ్రదాడికి కారణమైన, ఉగ్రవాదులు, ఉగ్ర సంస్థలను పెంచిపోషిస్తున్న పాకిస్థాన్‌కు బుద్ధి చెప్పే ఉద్దేశంతో ప్రారంభించిన ఆపరేషన్ సిందూర్ దేశ ప్రజల్లో ఎన్నో ఆశలను రేకెత్తించింది. ఉగ్రవాదులందరినీ మట్టుబెడతారని, తద్వారా పహల్గాంలో అమరులైన అమాయక పర్యాటకుల ఆత్మ శాంతిస్తుందని, ఉగ్ర స్థావరాలకు అడ్డాగా మారిన పాకిస్థాన్ నుంచి ఆక్రమిత కశ్మీర్‌ను భారత్ స్వాధీనం చేసుకుంటుందని, తద్వారా భవిష్యత్తులో ఇక అక్కడి నుంచి ఉగ్రవాదుల చొరబాట్లు ఉండవని ప్రజలు భావించారు సింధూ నది నీళ్లను ఆపివేసిన తర్వాత పాక్ కరువు కోరల్లో చిక్కుకొని కాళ్ల బేరానికి వస్తుందనే ప్రచారాలనూ దేశ ప్రజలు విశ్వసించారు. 1971లో బంగ్లా ఏర్పాటు చేసినట్టు బలుచిస్థాన్ ఏర్పాటువరకు మోదీ ప్రభుత్వం వెనుకడుగు వేయదని గాఢంగా నమ్మారు. దేశాన్నేలిన గత ప్రభుత్వాలు, పార్టీల చేతికానితనం వల్లే పాకిస్థాన్ రెచ్చిపోతుందని, నెహ్రూ తప్పిదం వల్లనే కశ్మీర్ సమస్య ఏర్పడిందని, ఇప్పుడు మోదీ పాక్‌కు బుద్ధి చెప్తాడని బీజేపీ ప్రచారం చేసింది. దానితో పాటు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఈసారి మోదీ కోసమైనా భారత్‌కు మద్దతు పలుకుతారని ప్రజలు నమ్మారు. అందుకే ఆపరేషన్ సిందూర్‌కు దేశ ప్రజలు మద్దతు తెలిపారు. ప్రతిపక్షాలు సైతం తమ రాజకీయ విభేదాలు, సైద్ధాంతిక వైరుధ్యాలను పక్కనబెట్టి ప్రభుత్వానికి మద్దతుగా నిలిచాయి. వరల్డ్ బ్యాంక్ (ఐఎంఎఫ్) మన అభ్యంతరాన్ని పెడచెవిన పెట్టి పాక్‌కు అప్పు ఇవ్వడం ద్వారా ముందే సంకేతాలిచ్చింది. ఈ విషయంలో మోదీ ప్రభుత్వం దౌత్యపరంగా విఫలమైంది. ఇక ఆపరేషన్ సిందూ ర్ జరిగిన మూడు రోజులు ఇస్లామాబాద్, కరాచీ, లాహోర్,




ఫైసలాబాద్, గుజర్న్‌వాలా, పెశావర్, క్వెట్ట, రావల్పిండి, సియాల్కోట్, సర్గోద, బహావల్‌పూర్ వంటి పాక్‌లోని ప్రధాన పట్టణాలు మన సైన్యం చేసిన దాడులతో అతలాకుతలమయ్యా యి. పాక్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్, ఎయిర్ బేస్ లులంచ్ ప్యాడ్‌లు అన్ని ధ్వంసమయ్యాయి. మన దేశం ఇన్ని విజయాలు సాధించిన తర్వాత అమెరికా ఒత్తిడితో కాల్పుల విరమణకు ఒప్పుకోవడం యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఏ శాంతి ఒప్పందం లేకుండా, ఉగ్రవాదులను అప్పగించకుండానే కాల్పుల విరమణకు ఎందుకు ఒప్పుకున్నారో దేశ ప్రజలకు ప్రధాని మోదీ చెప్పాలి. పక్కలో బల్లెం లాంటి పాకిస్థాన్ పీక పిసికే ఒక సువర్ణావకాశాన్ని అమెరికా ఒత్తిడికి తలొగ్గి మాత్రమే వదులుకున్నామా? అనేది దేశ ప్రజల ముం దున్న అతిపెద్ద ప్రశ్న. 1971లో కూడా పాకిస్థాన్‌కు మద్దతుగా దాడి చేస్తామని అమెరికా బెదిరించింది. ఆ బెదిరింపులను లెక్కచేయని ఇందిరా గాంధీ పాకిస్థాన్‌ను రెండు ముక్కలు చేయడాన్ని జనం ఇప్పుడు గుర్తు కు తెచ్చుకుంటున్నారు. ఈ కాల్పుల విరమ ణ కూడా మన దేశ ప్రధాని కాకుండా, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియాలో ప్రకటించడం యావత్ దేశానికే అవమానకరంగా ఉన్నది. ఆధునిక యుగంలో యుద్ధం ఎలా ఉన్నా దౌత్యనీతి, రాజనీతి ద్వారా మాత్రమే శత్రువును మన కాళ్ల దగ్గరికి తీసుకురాగలమని, ప్రజలను మతపరమైన భావోద్వేగాల కు గురిచేసి ఓట్లు దండుకున్నంత సులువుగా ప్రపంచ దేశాలు మనకు అండగా ఉంచుకోలేమని గుర్తెరగాలి. అంతేకాకుండా అమెరికా లాంటి దేశాలు తమ దేశ ప్రయోజనాలు, వ్యాపార ప్రయోజనాలకే పెద్దపీట వేస్తాయి కానీ, ఆలింగనాలకు మిత్రులైపోయి మనకు సహకరిస్తాయనుకోవడం అవివేకమే అవుతుంది. చరిత్రలో మనకంటే ముందు దేశా న్నేలిన ప్రధానులు, ప్రభుత్వాలు కూడా అప్పటి కాలమాన, దేశ అంతర్గత, అంతర్జాతీయ పరిస్థితులను బట్టి నిర్ణయాలు తీసుకున్నారు తప్ప బీజేపీ ప్రచారం చేసినట్టు వారికి ధైర్యం లేక కాదు, రాజనీతిజ్ఞత తెలువక కాదు. గత ప్రభుత్వాలను నిందించడం సులువే కానీ, ప్రభుత్వంలో ఉండి సంక్షోభాలు ఏర్పడినప్పుడు దేశాన్ని విజయం వైపు నడిపించడం అంత సులువు కాదన్న విషయాన్ని బీజేపీ నాయకులు, శ్రేణులు ఇకనైనా గమనించాలి. ఆపరేషన్ సిందూర్ విషయంలో అమెరికా జోక్యానికి అవకాశం ఇచ్చి మన దేశ అంతర్గత సమస్య అయిన కశ్మీర్ విషయంలో ఇతర దేశాలకు అవకాశం ఇచ్చినట్టయింది.

## వర్షాలకు దెబ్బతిన్న అరటి

# రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

రైతుకు ప్రభుత్వం ఎకరాకు 50,000 ఇవ్వాలి

పులివెందుల కాంగ్రెస్ ఇన్చార్జ్ ధ్రువ కుమార్ రెడ్డి, పులివెందుల మండల అధ్యక్షుడు అనిల్ కుమార్ రెడ్డి



పులివెందుల (**కదిలించే వార్త**) **మే 13:** పులివెందుల మండలం పరిధిలోని ఎర్రబల్లి, కొత్తపల్లి గ్రామాలలో సోమవారం అర్ధరాత్రి కురిసిన వర్షాలకు ఈదురుగాలులకు దెబ్బతిన్న అరటి పంటలను పులివెందుల నియోజకవర్గ ఇన్చార్జ్ ధ్రువ కుమార్ రెడ్డి, పులివెందుల మండల అధ్యక్షుడు అనిల్ కుమార్ రెడ్డి లు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అకాల వర్షాలకు దెబ్బతిన్న అరటి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వారన్నారు. అరటిదెబ్బతిన్న ప్రతి రైతుకు ఎకరాకు 50 వేల రూపాయలు ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొత్తపల్లి పంచాయతీలోని రైతు రామాంజనేయులు యాదవ్ మూడో ఎకరాల అరటి తోట పూర్తిగా దెబ్బతినిందని దాదాపు అతను 3 లక్షల రూపాయలు ఖర్చు చేశారని వారన్నారు. అరటిపంట దెబ్బతిన్న రైతు రామాంజనేయుల తో వారు మాట్లాడి పంటకు పెట్టుబడి ఎంత అయిందని వివరాలు కనుక్కున్నారు. రైతులకు పంట చేతికి వచ్చే టయానికి ఇప్పటికి మూడోసారి ఇలా జరగడమని వారన్నారు. హెక్టార్కు 30000 ఇస్తే రైతులకు సరిపోదని, ఎకరాకు 50 వేల రూపాయలు ఇవ్వాలన్నారు. ఒక నెల ఉంటే రైతుల చేతికి పూర్తి పంట వచ్చే సమయానికి ఇలా జరగడం చాలా బాధాకరమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులను ఆదుకోవాలని అన్నారు. అనంతరం వారు శరవాణి ద్వారా తాసిల్దార్ తో మాట్లాడి దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరి రెడ్డి, శ్రీనివాసరెడ్డి, విజయ్, వినయ్, సాయి, సప్తగిరి రెడ్డి, కొమ్మ రాజ్ కుమార్ రెడ్డి, తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## బాలికలు మహిళల ఉజ్వల భవిష్యత్ కోసమే కిశోరి వికాసం



పులివెందుల (**కదిలించే వార్త**) **మే 13:** కిశోర బాలికల వేసవి శిక్షణ శిబిరం లో భాగంగా మంగళవారం నల్లపురెడ్డిపల్లి అంగన్వాడీ కేంద్రంలో సిడిపిఓ లత ఆధ్వర్యంలో కిషోర్ బాలికలకు వారి యొక్క హక్కుల గురించి మరియు ఫోక్సో చట్టం గురించి అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానంగా పిల్లలకు ఉన్న నాలుగు హక్కుల గురించి జీవించే హక్కు సంరక్షణ హక్కు వారికి కావలసినవి నిర్ణయాలు తీసుకునే హక్కు భావోద్వేగ,మానసిక,శారీరక వికాసం చెందే హక్కు వీటి గురించి కిశోర బాలికలకు వివరంగా చెప్పడం జరిగింది. అలాగే అక్రమ రవాణా చైల్డ్ లేబర్ బానిసత్వం వెట్టి చాకిరి మొదలగు విషయాల గురించి చెప్పారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ మాబున్ని అంగన్వాడి కార్యకర్తలు విజయభారతి తదితరులు పాల్గొన్నారు.

## కరెంటు చార్జీలు పెంచి ప్రజల నడ్డి విరుస్తున్న ప్రభుత్వం

పులివెందుల కాంగ్రెస్ ఇన్ ఛార్జ్ మూలంరెడ్డి ధ్రువకుమార్ రెడ్డి



పులివెందుల (**కదిలించే వార్త**) **మే 13:** రాష్ట్ర ప్రభుత్వం కరెంటు చార్జీలు పెంచి ప్రజల నడ్డి విరుస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ పులివెందుల సమన్వయ కర్త ధ్రువ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి నెల అధికంగా కరెంటు బిల్లులను వేసి ప్రభుత్వం ప్రజల నుండి వసూలు చేస్తున్నదని చెప్పారు. రకరకాల పేర్లతో కరెంటు బిల్లుల్లో ఫీజులను వసూలు చేయడం దుర్మగమని చెప్పారు. ఎన్నికలకు ముందు విద్యుత్తు చార్జీలు పెంచమని చెప్పి అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యుత్ చార్జీలను పెంచడం జరిగిందని చెప్పారు. విద్యుత్ చార్జీలను చూస్తేనే ప్రజలకు షాక్ కొట్టుతున్నదని చెప్పారు. రకరకాల పేర్లతో వేస్తున్న విద్యుత్తు చార్జీలను తొలగించి ప్రజలకు ఆర్థిక భారం లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. ప్రజలపై ఎక్కువగా కరెంటు భారం పడుతున్నదని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నేరవేర్చాలని డిమాండ్ చేశారు.

# అకాల వర్షం దెబ్బతిన్న అరటిపంట

### రైతన్న పై మరోసారి ప్రకృతి కన్నెర్ర


### ఈదర గాలులకు నేలకొరిగిన అరటి చెట్లు



పులివెందుల (**కదిలించే వార్త**) **మే 13:** ప్రకృతి వై పరీత్యం కారణంగా అన్నదాతకు మరొకసారి నష్టం వా టిల్లింది. పులివెందుల నియోజకవర్గంలో కొన్ని నెలల క్రితం ఈదురుగాలులకు అరటి చెట్లు నేలకొరిగిన విషయం మరవకముందే సోమవారం మరొకసారి అరటి రైతన్న పై ప్రకృతి కన్నెర్ర చేసింది. మండలంలోని ఈ కొత్త పల్లె, నల్లపురెడ్డి పల్లె, మొట్నూతల పల్లె, ఎర్రబల్లి, బ్రాహ్మణపల్లె తదితర గ్రామంలో సోమవారం రాత్రి వీచిన ఈదురుగాలులకు భారీ వర్షానికి అరటి చెట్లు నేలకొరిగాయి.వేలకు వేలు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంట చేతికి వచ్చే సమయానికి అకాల వర్షాలు ఈదురుగాలు రావడంతో పంట నేల కొరగడంతో చేసిన అప్పులు ఎలా తీరుతాయి రా దేవుడా అని రైతులు బాధ వర్ణనాతీతంగా మారింది. పంట చేతికొచ్చే టయానికి ఈ విధంగా జరిగితే రైతన్నలకు ఆత్మహత్యలే శరణ్యమని రైతన్నలు లబోదిబో అంటున్నారు. ప్రభుత్వం రైతన్నలను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

### పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

### మాజీ పట్టణ అధ్యక్షుడు వెంకట్రాంరెడ్డి



సోమవారం రాత్రి కురిసినఅకాల వర్షానికి ఈదురుగాలులకు దెబ్బతిన్న అరటి రైతుల వివరాలను అధికారులచే సేకరిస్తున్నామని మాజీ పట్టణ అధ్యక్షుడు వెంకట్రాంరెడ్డి తెలియజేస్తూ పంట నష్టపోయిన ప్రతి రైతు వివరాలను మంగళవారం ఉదయం నుంచి పొలాలలో తిరుగుతూ సేకరిస్తున్నారన్నారు. వారు సేకరించిన రైతుల పేర్లను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి, వారిని ఆదుకునేందుకు కృషి చేస్తామన్నారు. పంట నష్టపోయిన అరటి రైతుల వివరాలను పులివెందుల నియోజకవర్గం ఇంచార్జ్ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి, వారి పేర్లను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు అందజేస్తామన్నారు.

## నేసే మౌనిక మరణించి

## ఆమె చూపు సంజీవినిలా అంధులకు వెలుగు



పులివెందుల (**కదిలించే వార్త**) **మే 13:** వీరపు నాయని పల్లి మండలం పాయసం పల్లి గ్రామానికి చెందిన నేసే మౌనిక (18 సంవత్సరాలు) మంగళవారం మరణించడం తో ఆమె తల్లి లక్ష్మీదేవి, తండ్రి ల్యాబ్ టెక్నీషియన్ సురేష్, చెల్లెలు స్వరూప, జేజి లక్షుమ్మ, పెదనాన్న లు వెంకటరమణ, రామక్రిష్ణ, మనోహర్, పెద్దమ్మ లు నేత్రదానానికి అంగీకరిస్తూ జిల్లా అంధత్వ నివారణ సంస్థ మరియు స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షులు రాజు లకు సమాచారం ఇవ్వడం తో నేత్ర సేకరణ కేంద్రం టెక్నీషియన్ హరీష్ తో కలిసి మృతురాలి గ్రామానికి వెళ్లి పార్థివ దేహం నుండి కార్నియా లను సేకరించడం జరిగింది. ఈ సందర్భంగా స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు మాట్లాడుతూ మనిషి



మరణానంతరం మట్టిలో కలిసి పోయే నేత్రాలు అంధుల జీవితాల్లో చూపు ఇచ్చి సంజీవిని లా వెలుగు లు ప్రసాదించే నేత్రదాన బృహత్కార్యం కోసం 9966509364 లేదా 7093204537 లకు సమాచారం ఇచ్చి నేత్రదాన కార్యక్రమాన్ని ప్రతి కుటుంబం ముందుకు రావాలన్నారు. ఈ సందర్భంగా పుట్టెడు దుఃఖంలోను నేత్రదానానికి అంగీకరించిన కుటుంబ సభ్యులకు పులివెందుల పట్టణం లోని నగరిగుట్ట పట్టణ ప్రాథమిక వైద్యశాల వైద్యులు డాక్టర్ స్నేహ ప్రత్యూష మరియు సిబ్బంది, బంధువులు, సన్నిహితులు సేవా సమితి బృందం కృతజ్ఞత అభినందనలు తెలిపారు.

# పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి

ప్రతిరోజు ఉదయం 6 గంటల నుంచే డోర్ టు డోర్ తడి, పొడి చెత్త సేకరణ పనులు జరగాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.

అనంతపురం నగరంలోని నిర్మలానంద నగర్ లో పారిశుద్ధ్య పనులను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్.









అనంతపురం, (**కదిలించే వార్త**) **మే 13:** అనంతపురం నగరంలోని నిర్మలానంద నగర్ పరిధిలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను మంగళవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. ప్రతిరోజు ఉదయం 6 గంటల నుండి డోర్ టు డోర్ తడి, పొడి చెత్త సేకరణ జరగాలని ఆదేశించారు. అలాగే కమర్షియల్ ఏరియా నందు ప్రతిరోజు చెత్తను తొలగించే విధంగా చూడాలని, నగరంలోని శానిటేషన్ సెక్రటరీలు సెట్స్ ( వాకి టాకీ) ఉపయోగించాలని, ప్రతి 350 ఇండ్లకు చెత్తను సేకరించుటకు ఒకమైక్రో పాకెట్ అటెండర్, 2 వర్కర్లు ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ పారిశుద్ధ తనిఖీల్లో భాగంగా ప్లాస్టిక్ చెత్త తొలగించుటకు ఏ విధమైన చర్యలు తీసుకుంటున్నారు, వార్డులో ఎంతమంది శానిటేషన్ వర్కర్లు పనిచేస్తున్నరు, గృహాల నందు చెత్తను సేకరించుటకు ఏ సమయం నుండి ఏ సమయం లోపల గృహాలలో చెత్తను సేకరించుటకు సానిటేషన్ వర్కర్లు అందుబాటులో ఉంటున్నారు, దుకాణదారులు ప్లాస్టిక్ మరియు చెత్తను దుకాణం ఎదుట రోడ్డుపై వేసిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు, తదితర విషయాలను వార్డు సెక్రటరీ, ఎమ్హెచ్ఓ, మున్సిపల్ కమిషనర్లను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతపురం నగరంలోని దుకాణదారులకు తడి చెత్త, పొడి చెత్తకు వేరువేరుగా ఉండేటట్లు దుకాణం వద్ద డస్ట్ బిన్ లను ఏర్పాటు చేయాలని, అలాగే షాపుకు వచ్చు వినియోగదారులు వాటిని ఉపయోగించుకోవాలన్నారు. అలా కాకుండా షాపు ఎదురుగా చెత్తను వేసినచో దుకాణదారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఆ విధంగా షాపు యజమానులకు తెలియజేయాలని మున్సిపల్ అధికారులకు ఆదేశించారు. ఆ విధంగా ఏర్పాటు చేసుకోవాలని అక్కడే ఉన్న దుకాణదారునికి తెలియజేశారు. ఇది మొదటిసారి కావడంతో మీకు తెలియజేయడం జరుగుతున్నదని, ఇలాగే రాబోయే రోజుల్లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని అక్కడ ఉన్న దుకాణదారునికి తెలియజేశారు. అలాగే దుకాణదారులు దుకాణానికి పరిసర ప్రాంతాలలో ప్లాస్టిక్ ఇతరత్రా చెత్తాచెదారం లేకుండా చూసుకోవాలని దుకాణదారునికి తెలియజేశారు. సచివాలయం వారీగా ఎన్ని గృహాలు ఉన్నాయి, అందులో ఎంతమంది శానిటేషన్ వర్కర్స్ ఉన్నారు, నివేదికలు వెంటనే తయారుచేసి ఇవ్వాలని, శానిటేషన్ వర్కర్లు తక్కువ ఉన్నచోట కొత్తవారిని నియమించేందుకు మున్సిపల్ సమావేశం నందు నిర్ణయం తీసుకొని నివేదకలు సమర్పించాలని దానిపై సిడిఎంఏ గారితో మాట్లాడి త్వరితగతిన ఏర్పాటు చేసినందుకు కృషి చేస్తామన్నారు. అలాగే నిర్మలానంద నగర్ కాలనీలో నివాసం ఉంటున్న రేఖ అనే మహిళ ఇంటికి చెత్తను సేకరించేందుకు శానిటేషన్ వర్కర్లు ప్రతిరోజు వస్తున్నారా, ఏ టైంకి వస్తారని అడిగారు. దానికి సమాధానంగా ప్రతిరోజు వస్తారని, ఎనిమిది నుండి తొమ్మిది గంటల మధ్యలో రావడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కి ఆమె తెలియజేశారు. అలాగే మీరందరూ తడి చెత్త, పొడి చెత్తను వేరువేరుగా ఉంచాలని వారికి తెలిపారు. అలాగే ఒక ట్రాక్టర్ ఒక రోజుకు దాదాపు 1,200 ఇండ్ల వరకు తడి, పొడి చెత్తను సేకరించి డంపింగ్ యార్డ్ కు తరలించడం జరుగుతుందని కమిషనర్ జిల్లా కలెక్టర్ కు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శానిటేషన్ పనులు చేస్తున్న వర్కర్ కు చేతికి గాయం కావడం గమనించి వారికి మందులు వేసుకోవాలని సూచించి అలాగే శానిటేషన్ పనులు చేస్తున్న వారికి గ్లౌజస్ ఇవ్వాలని జిల్లా కలెక్టర్ మున్సిపల్ అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనంతపురం మున్సిపల్ కమిషనర్ బాలస్వామి, ఎస్సీ కార్పొరేషన్ చంద్రశేఖర్, మున్సిపల్ మెడికల్ ఆఫీసర్ బిఎల్ నరసింహ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ షకీల్, శానిటేషన్ సెక్రటరీ తోసిఫ్ శర్మస్, తదితరులు పాల్గొన్నారు.

# నాగయ్య పల్లె చెరువులో మట్టి మాఫియా

-అక్రమంగా మట్టి మొరం తరలింపు!

-చోద్యం చూస్తున్న రెవిన్యూ, ఇరిగేషన్,పోలీస్ అధికారులు!

-డిబిఎఫ్ ఆధ్వర్యంలో మట్టి దొంగలపై ఫిర్యాదు!

-అక్రమార్కులపై చర్య తీసుకోవాలని డిబిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ డిమాండ్!

-వెంటనే స్పందించిన అధికారులు పనులు నిలిపివేత,అక్రమ రోడ్డు నిర్మాణం తొలగింపు!






ఆత్మకూర్/(**కదిలించే వార్త**) **మే 13:** మే 13/ (హనుమకొండ) ఆత్మకూర్ మండలంలోని నాగయ్య పల్లె గ్రామానికి చెందిన నాగయ్య చెరువులో గత కొన్ని రోజులుగా ప్రైవేటు వ్యక్తులు మట్టి దొంగలుగా అవతారం ఎత్తి ఎలాంటి అనుమతులు లేకుండా చెరువుమట్టిని,మోరాన్ని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్న వారిపై చర్య తీసుకోవాలని దళిత బహుజన ఫ్రంట్(డిబీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చుంచు రాజేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు డిబీఎఫ్ ఆధ్వర్యంలో గత మూడు రోజుల క్రితం రెవెన్యూ, ఇరిగేషన్,పోలీస్ శాఖల అధికారులకు వినతిపత్రం సమర్పించినప్పటికీ అధికారులు స్పందించకపోవడంతో డిబీఎఫ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు నాగయ్య చెరువు వద్ద ధర్నా చేసి జెసిపిని మట్టి తవ్వకాన్ని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా డిబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ స్థానిక తహసిల్దార్ జగన్మోహన్ రెడ్డి, సిఐ సర్కిల్ ఇన్స్పెక్టర్ సంతోష్ కుమార్,ఇరిగేషన్ ఏఈ జ్యోతి రాణి లకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఘటన స్థలికి చేరుకున్న తాసిల్దార్ జగన్మోహన్ రెడ్డి, ఎస్సై తిరుపతి,ఆర్ఐ జ్యోతి, ఇరిగేషన్ సిబ్బంది రాజ, రెవిన్యూ సిబ్బంది తాళ్ల రవి తదితరులు చెరువు తవ్వకపు మట్టి పనులను ఆపి వేయించారు. మత్తడికి అడ్డుగా పోసిన రోడ్డును తొలగించి అక్రమార్కులపై చర్య తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ మాదాసి సురేష్, యువజన కాంగ్రెస్ జిల్లా నాయకుడు గుండాల క్రాంతి,గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రమణారెడ్డి, ఉపాధ్యక్షుడు గుండాల నగేష్,మాజీ ఉపసర్పంచ్ పోగుల సుగునాకర్, డిబీఎఫ్ నాయకులు గిన్నారపు ప్రసంగి,మాదాసి రాజు,గిన్నారపు మస్తాన్,మాదాసి సూరయ్య,మాదాసి బిక్షపతి, గుండాల లక్ష్మి,మాదాసి కొమరమ్మ,మాదాసి సరోజన తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీలో వీధి వ్యాపారుల కమిటీ ఏర్పాటు



పులివెందుల (**కదిలించే వార్త**) **మే 13:** పులివెందుల పురపాలక సంఘ పరిధిలో ఉండే వీధి వ్యాపారులను గుర్తించి సర్వే చేయుటకు పులివెందుల మున్సిపాలిటీలో వీధి వ్యాపారుల కమిటీ ఏర్పాటు చేయడం జరిగినది అందులో భాగంగా పులివెందులపు రపాలక కార్యాలయంలోని సభా భవనం నందు మంగళవారం మున్సిపల్ కమిషనర్ రాముడు అధ్యక్షతన సమావేశం నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధి వ్యాపారులను సర్వే చేసి యాప్ నందు నమోదు చేయుటకు రేపటి నుండి అనగా 13.5 20 25 తేదీ నుండి 18 5 20 25 వరకు సర్వే కార్యక్రమము నిర్వహిం చబడును. కావున పట్టణ పరిధిలోని వీధి వ్యాపారులు సర్వే కొరకు వచ్చు మున్సిపల్ సిబ్బందితో సహకరించి వారు కోరిన సమాచారమును అందించ వలసినదిగా, సహకరిం చవలసిందిగా కోరడమైనది. మరియుమెప్మా సిబ్బందితో ప్లానింగ్ సెక్రటరీ మరియు వెల్ఫేర్ సెక్రటరీలతో మరియు ఆర్పి లతో కలిసి టీములు ఏర్పాటు చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ అజయ్ కుమార్ సి ఎం ఎం హరి, సి ఓ లు రామాంజనేయులు నాగలక్ష్మి మరియు వెల్ఫేర్ సెక్రటరీలు, ప్లానింగ్ సెక్రటరీలు ఆర్పీలు పాల్గొన్నారు



## ఎంపీ రవిచంద్ర మాతృమూర్తి

## వెంకటనర్సమ్మకు11వ వర్ధంతి ఘన నివాళులు





వరంగల్ (**కదిలించే వార్త**) **మే 13:** రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మాతృమూర్తి వెంకటనర్సమ్మకు తన కుటుంబ సభ్యులతో కలిసి ఘనంగా నివాళులర్పించారు. వెంకటనర్సమ్మ 11వ వర్ధంతి (తద్దినం) సందర్భంగా స్వగ్రామం ఇనుగుర్తిలో మంగళవారం ఆమె కుమారులు కిషన్, దేవేందర్, రవిచంద్ర, వెంకటేశ్వర్లు ప్రత్యేక పూజలు చేసి పిండ ప్రధానం చేశారు. ఈ సందర్భంగా వద్దిరాజు సోదరులు తమ తల్లిదండ్రులు నారాయణ - వెంకటన ర్సమ్మల జ్ఞాపకార్థం నెలకొల్పిన స్మృతివనాన్ని సందర్శించి కుటుంబ సభ్యులతో కలిసి వారి విగ్రహాలకు పూలు జల్లి,కొబ్బరికాయలు కొట్టి ఘనంగా నివాళులర్పించారు, గత స్మృతులను నెమరు వేసుకున్నారు. స్మృతి వనాన్ని వద్దిరాజు కమలమ్మ,వద్దిరాజు కిషన్-శశిరేఖ, వద్దిరాజు దేవేందర్ -ఇందిర, వద్దిరాజు రవిచంద్ర -విజయలక్ష్మీ, వద్దిరాజు వెంకటేశ్వర్లు-ఉమామహేశ్వరి, వద్దిరాజు మోహన్ -వాసవి, వద్దిరాజు వెంకటేశ్వర్లు(పోలీస్) -పద్మ, వద్దిరాజు శ్రీనివాస్, వద్దిరాజు నాగరాజు, వద్దిరాజు శ్రీనివాస్ (గడ్డి), శీలం సత్యనారాయణ -లక్ష్మీ, సంగిశెట్టి సోమయ్య, సంగిశెట్టి శంకర్, సంగిశెట్టి ప్రభాకర్,ఆకుల గాంధీ, ఆకుతోట ఆదినారాయణ, వనం నాగయ్య తదితరులు సందర్శించి నారాయణ-వెంకటనర్సమ్మ విగ్రహాలకు పూలుజల్లి ఘనంగా నివాళులర్పించారు. తమ తల్లి తద్దినం (వర్ధంతి) సందర్భంగా వద్దిరాజు సోదరులు పలువురు బ్రాహ్మణులకు నిత్యావసర సరుకులు, కొంత నగదు అందజేసి గౌరవించారు, సుమారు 1,000మంది పేదలకు అన్నదానం చేశారు.

## ఆటో డ్రైవర్లకు ప్రమాదా బీమా సౌకర్యం కల్పించాలి




వరంగల్ (**కదిలించే వార్త**) **మే 13:** ఆటో కార్మికుల వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని వరంగల్ చార్ బౌళి ప్రాంతంలోని నోబుల్ ఫంక్షన్ హాల్లో రౌండ్ టేబుల్ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి తాడు సంఘం నుండి రవి, ఏఐటియుసి గన్నారపు రమేష్, ఆటో అండ్ ట్రాలీ వర్కర్స్ యూనియన్ నుండి ఎండి మహబూబ్ పాషా, సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మలోత్ సాగర్, ముక్కెర రామస్వామి పాల్గొని మాట్లాడుతూ మే 20న జరిగే దేశవ్యాప్త సమ్మెకు వరంగల్ జిల్లా ఆటో కార్మికులు సమ్మెలో భాగస్వాములు అవుతామని ప్రతి అడ్డ వద్దకు పోయి సమ్మె ప్రాధాన్యత తెలియజేసి సమ్మెను విజయవంతం చేయడం కోసం పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. రవాణా రంగాన్ని కార్పొరేట్ శక్తులకు దారా దత్తం చేయడం కోసం బిజెపి ప్రభుత్వం ప్రయత్నం కొనసాగుతుందని అన్నారు ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును వర్తింపజేయాలని తక్షణమే నాలుగు లేబర్ కోడ్స్ ఎత్తివేయాలని మహాలక్ష్మి స్కీం ద్వారా నష్టపోతున్న ఆటో డ్రైవర్లకు నెలకు 4500 రూపాయలు పెన్షన్ సౌకర్యాలని ప్రమాద బీమా సౌకర్యం 10 లక్షల రూపాయలు కల్పించాలని ఈఎస్ఐపిఎఫ్ సౌకర్యాలు కూడా రవాణా కార్మికులకు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20న సార్వత్రిక సమ్మెలో తెలంగాణ జేఏసీ ఆటో కార్మికులందరూ పాల్గొంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో సలీం షేక్ మదర్, షేక్ లతీఫ్, ఎండి గఫూర్ ఎండి. హంజత్, సుమంత్, శ్రీనివాస్, .ఎస్ డి . యాకు పాషా, కనుక స్వామి దేవేందర్,.జానీ, ఎండి హమీద్. ఎస్ కే. దస్తగీర్ ఇమ్రాన్. వెంకట్ నారాయణ యాదవ్ వహీద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## ఈటెల దిష్టిబొమ్మను దగ్ధం

## చేసిన యూత్ కాంగ్రెస్ నాయకులు



హుజూరాబాద్(**కదిలించే వార్త**) **మే 13:** హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా యూత్ కాంగ్రెస్ హుజరాబాద్ మండల అధ్యక్షుడు పంజాల అరవింద్ ఆధ్వర్యంలో ఈటెల రాజేందర్ దిష్టిబొమ్మ ను దగ్ధం చేశారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన మల్కాజ్ గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటెల రాజేందర్ తెలంగాణ వచ్చిన తొలి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రిగా నిర్వహించిన బాధ్యతల వల్ల నేడు అనుభవిస్తున్న తెలంగాణ ప్రజల గోస వారికే చెందుతుందని, కేసీఆర్ పై యుద్ధం చేస్తానని చెప్పి ఆలయ భూములను ఆక్రమించిన కేసులో ఎక్కడ జైల్లోకి వెళ్లాల్సి వస్తుందో అని భారతీయ జనతా పార్టీ లోకి మారి బాగా మాసిన బురద బట్టలు వాషింగ్ మిషన్ లో వేస్తే ఎలా తెల్లబడతాయో బిజెపి పార్టీలోకి మారిన తర్వాత నేను అలానే ఉన్నాను అని భ్రమ పడుతున్న నాపైన ఎటువంటి అవినీతి మరకలేదు అని నేడు రాష్ట్ర అభివృద్ధికి గడిచిన కొన్ని సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి బడ్జెట్ కేటాయింపుల్లో గుండు సున్నా ప్రవేశపెడుతోంది తెలంగాణ ప్రజలు గమనిస్తున్న తీరును వారు ప్రజలను ఎలా మభ్య పెట్టాలో తెలియక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బురదజల్లే వ్యాఖ్యలు చేయడం మానుకొని తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం ప్రభుత్వం ఇవ్వ వలసిన నిధులపై గట్టిగా మాట్లాడి దమ్ము ధైర్యం ఉంటే నిధులు తీసుకురావాలని డిమాండ్ చేస్తూ మరొక మారు ముఖ్యమంత్రి పై గాని రాష్ట్ర మంత్రులపై గాని అనుచిత వ్యాఖ్యలు చేసినట్లయితే మా యూత్ కాంగ్రెస్ నాయకులు మిమ్మల్ని రోడ్ల మీద తిరగకుండా చేస్తామని హెచ్చరిస్తున్నామని అన్నారు. ఇట్టి కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పంజాల అరవింద్ యూత్ మండల ఉపాధ్యక్షుడు మేకల రాజ్ కుమార్, చల్లురి విష్ణు వర్ధన్, సంపంగి అరుణ్, ప్రధాన కార్యదర్శి పంజాల రాజు యూత్ కాంగ్రెస్ నాయకులు గోస్కుల మధుకర్ బన్నీ, సంపత్, ఏనుగుల బన్నీ, కృష్ణంరాజు, సాయి, అజయ్, ప్రదీప్, జాన్సన్, సాయి, హర్ష,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు



కదిలించే వార్త తెలుగు దినపత్రిక
బుధవారం- 14 - మే - 2025

# బిజెపి తిరంగా యాత్ర హాస్యాస్పదం

## బిభద్రతా వైఫల్యానికి గాను దేశ ప్రజలకు బిజెపి క్షమాపణ చెప్పాలి

### బిడాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



వేంపల్లె, (**కదిలించే వార్త**) **మే 13:** ఆపరేషన్ సిందూర్ విజయవంతం అయ్యేటందుకు మోడీ నాయకత్వ పటిమ అని చెప్పేందుకు తిరంగా యాత్రను మే 13 నుండి 23 వరకు నిర్వహించాలని బిజెపి నిర్ణయించడం హాస్యాస్పదం. తిరంగా యాత్రకు ముందు బిజెపి నాయకులు దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలి. గత నెల 22 వ తేదీన పహల్గాం పర్యాటక కేంద్రం వద్ద భద్రతా సిబ్బంది వుండి వుంటే ఉగ్ర వాదులు అమాయక పర్యాటకుల పై దాడి చేసేవారు కాదు, 26 మంది పర్యాటకులు చనిపోయి వుండేవారు కాదు, వారి భార్యల నుదుటి సిందూరం పోయి వుండేది కాదు, ఆపరేషన్ సిందూర్ అవసరం వుండేది కాదు.కేంద్ర ప్రభుత్వం కూడా అఖిల పక్ష సమావేశం లో భద్రతా వైఫల్యాన్ని ఒప్పుకుంది. భద్రతా వైఫల్యానికి గాను బిజెపి దేశ ప్రజలకు,పహల్గాం ఉగ్రవాద దాడిలో మరణించిన 26 మంది కుటుంబ సభ్యులకు, ఆపరేషన్ సిందూరు లో చనిపోయిన మురళీ నాయక్ తో సహా మిగతా సైనికుల కుటుంబాలకు క్షమాపణ చెప్పాలి. పహల్గాం దాడిలో పాల్గొన్న ఉగ్రవాదులు ఎవరు?ఎంతమంది? పట్టుకున్నారా?మట్టుపెట్టారా? దాడి జరిగి 22 రోజులైనా పై వివరాలు దేశ ప్రజలకు తెలియడం లేదు. దీనిపై కేంద్ర ప్రభుత్వం ప్రజలకు స్పష్టత ఇవ్వాలి. పహల్గాం దాడులు,ఆపరేషన్ సిందూర్ తదితర అంశాలపై చర్చించేందుకు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయాలి. ఆపరేషన్ సిందూర్ విజయవంతం అయ్యేందుకు ప్రధాన కారణం బ్రహ్మోస్ సూపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణి. మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు 2005 లో భారత నావికా దళంలో, 2007 లో భారత సైన్యం లో బ్రహ్మోస్ ను చేర్చడం గమనార్హం.

# మైనారిటీ బోర్డ్ ఆస్తుల సంరక్షణ కోసం కలిసి పోరాడుదాం..

## నల్ల చట్టాలకు వ్యతిరేకంగా

## నిరసన ఉద్యమాలు చేపడతాం..

## రాజ్యాంగం ఇచ్చిన ప్రాథమిక హక్కులను

## కాపాడుకునే బాధ్యత అందరిదీ... ..



పులివెందుల (**కదిలించే వార్త**) **మే 13:** పులివెందుల పట్టణంలోని పార్నపల్లి రోడ్డు సమీపంలో ఉన్న రాయల్ ఫంక్షన్ హాల్ నందు ఆల్ ఇండియా పర్సనల్ లా బోర్డ్ ఆధ్వర్యంలో వక్ఫ్ పరిరక్షణ జేఏసీ ఏర్పాటుకు రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో ముస్లిం మైనారిటీ పెద్దలు, క్రిస్టియన్ మైనారిటీ మత పెద్దలు మరియు బడుగు బలహీన వర్గాల సంఘ నాయకులు సమావేశం అవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజుల కాలంలో ఇనాముగా ఇచ్చిన మతపరమైన ఆస్తులు ప్రళయం వరకు సంబంధిత మతపరమైన శాఖల ఆధీనంలో పరిరక్షించబడాలి అని పేర్కొన్నారు. ముస్లిం మైనార్టీ ఆస్తుల సంరక్షణ వక్ఫ్ బోర్డ్ పరిధిలో ఇప్పటివరకు పర్యవేక్షించబడుతున్నాయి. అయితే బిజెపి ప్రభుత్వం మతాల మధ్య చిచ్చు పెడుతూ విద్వేషాలను పెంచుతూ రెచ్చగొట్టే పనులు చేస్తూ ప్రాథమిక హక్కులను హరిస్తూ నల్ల చట్టాలను అమలు చేస్తున్న ధోరణి ప్రజాస్వామ్య దేశంలో ఐక్యత భావాలను హరిస్తున్నదని పేర్కొన్నారు. ప్రస్తుతం బిజెపి ప్రభుత్వం వక్ఫ్ బోర్డ్ ఆస్తులను ప్రభుత్వ ఆధీనంలో కి తీసుకురావడానికి పార్లమెంటులో బిల్లును ప్రవేశపెట్టింది దీని ద్వారా లక్షల కోట్లు విలువచేసే ఆస్తులను స్వాధీనపరుచుకొని నెమ్మదిగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థను శాసిస్తున్న కార్పొరేట్ రంగానికి ముట్టపెట్టడం ఖాయమని అన్నారు. ప్రస్తుతం వక్ఫ్బోర్డ్ ఆస్తులు తర్వాత చర్చికి సంబంధించిన ఆస్తులు ఆ తర్వాత దేవాదాయ శాఖకు సంబంధించిన మాన్యాలను కూడా బిజెపి ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకెళ్లే దిశలో ఆలోచన విధానం ఉందని వారు పేర్కొన్నారు . డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఏర్పాటుచేసిన రాజ్యాంగంలో నీ ప్రాథమిక హక్కులను హరించే విధంగా బిజెపి ప్రభుత్వం నల్ల చట్టాలను ఏర్పాటు చేసి బిల్లులను ప్రవేశపెట్టుతుంటే ప్రజలు ఊరుకునే పరిస్థితిలో లేరని భారీ ఎత్తున ఉద్యమాలు, ర్యాలీలు, సమావేశాల ద్వారా తమ నిరసన వ్యక్తపరుస్తూ ప్రభుత్వం చేస్తున్న తప్పులను ప్రజల గుండెల్లోకి తీసుకెళ్తామని పేర్కొన్నారు. ఏ ప్రభుత్వమైనా రాజ్యాంగ పరిరక్షణకు కట్టుబడి ఉండాలని సూచించారు. ఐక్యత భావాలను పెంచే విధంగా ఉండాలి తప్ప విభజించు పాలించు అన్న ధోరణిలో ఉండకూడదు తద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థ పూర్తిగా దెబ్బతింటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బర్డ్ రాష్ట్ర కమిటీ మెంబర్ ఇషాక్ మౌలానా, జిల్లా జేఏసీ నాయకులు హుసేన్ బాషా (బాబు), మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, హాయ్ గంగాధర్ రెడ్డి,అఖిలపక్ష సంఘ నాయకులు వెంకటరమణ, %ఎజాఎ% గఫూర్, చర్చ్ పాస్టర్స్ మృత్యుంజయుడు, ఆనంద్ రావు, రైతు కవి కొండారెడ్డి, బడుగు బలహీన వర్గాల నాయకులు, ముస్లిం మత పెద్దలు మసీదు ముత్తవలీలు ధర్మపండితులు అబ్దుల్లా మౌలాన,నూరుల్లాహ్ షబ్బీర్ ఖయుం, ఖాదర్‌బాషా, షఫీ, జిలాన్, నూర్ భాషా సంఘ నాయకులు ఓ రసూల్, బాబు, సర్వలి, తదితరులు పాల్గొన్నారు.

# మహిళల ఆర్థికా అభివృద్ధి కై మహిళా డెయిరీ ఏర్పాటు

## ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి





పరకాల (**కదిలించే వార్త**) **మే 13:**పరకాల నియోజక వర్గంలోని దామెరలో మహిళలు ఆర్థికాభివృద్ధిని సాధించేందుకు మహిళా డెయిరీని ఏర్పాటు చేస్తున్నట్లు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్ మహిళా సొసైటీలో పరకాల నియోజకవర్గం లోని మహిళా రైతులకు శిక్షణ కార్యక్రమానికి హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు పి. ప్రావీణ్య, డాక్టర్ సత్య శారద, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారులతో కలిసి పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముల్కనూర్ సొసైటీ ద్వారా పాడి రంగంలో మహిళలు ఏ విధంగా అభివృద్ధి సాధిస్తున్నారనే వివరాలను నిర్వాహకులను ఎమ్మెల్యే, కలెక్టర్లు అడిగి తెలుసుకున్నారు. మహిళా రైతులకు అందిస్తున్న శిక్షణ కార్యక్రమాలను గురించి సొసైటీ నిర్వాహకులు ఎమ్మెల్యే, కలెక్టర్లకు వివరించారు. అనంతరం మాట్లాడుతూ మహిళా డెయిరీ గురించి తెలుపుతూ 6 మండలాలలోని మహిళా రైతులతో డెయిరీని ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఇందుకు గాను 53 కో - ఆపరేటివ్ సంఘాలను రిజిస్ట్రేషన్ చేయించినట్లు పేర్కొన్నారు. ఏర్పాటు చేయనున్న డెయిరీని నిర్వహించే విధంగా పాల డెయిరీని గత కొన్నేళ్లుగా స్ఫూర్తిదాయకంగా, విజయవంతంగా నిర్వహిస్తున్న ముల్కనూరు డెయిరీ ద్వారా శిక్షణ ఇస్తునట్లు పేర్కొన్నారు. త్వరలో దామెర మండలంలో డెయిరీ ఏర్పాటు చేస్తునట్టు తెలిపారు. మహిళా రైతుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న పాల డెయిరీ ద్వారా కల్తీ లేని స్వచ్ఛమైన పాలు సరఫరా చేయడం, మహిళలని వ్యాపార రంగంలో ముందుకు తీసుకెళ్ళాలనే లక్ష్యంతో ముందు కెళ్తున్నట్లు చెప్పారు. డెయిరీ ఏర్పాటు ద్వారా మహిళల ఉపాధి కల్పనకు సాధ్యమవుతుందని తెలిపారు. 6 మండలాలలో పాడి పశువుల సర్వే, పాల దిగుబడుల సర్వే పూర్తయినట్టు తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల గ్రామీణ అభివృద్ధి అధికారులు మేన శ్రీను, కౌసల్య దేవి, ఇతర అధికారులు, మహిళా రైతులు పాల్గొన్నారు.

# వాటర్ ఫాల్స్ లో సెక్యూరిటీ

# దందాలు రోజురోజుకి ఎక్కువవుతున్నాయి

## ఫారెస్ట్ అధికారులు కు సమాచారం ఇవ్వాలనుకున్న ఫోను ఎత్తకపోవడం

## వల్ల వాళ్లకి ముడుపులు అందుతున్నాయా అని సమాచారం




వరదయ్య పాలెం (**కదిలించే వార్త**) **మే 13:** తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గం ప్రముఖ టూరిస్ట్ ప్లేస్ ఉబ్బుల మడుగు అని పిల్చుకునికొనే జలపాతం సుందర మయమైన వాటర్ ఫాల్స్ లో విధులు నిర్వహిస్తున్న కొంతమంది ఫారెస్ట్ అధికారులు లంచాలకు పాలు మారుతున్నారు.వెంటనే ఉన్నత అధికారులు దీని గుర్తించి అక్కడే నిర్వహిస్తున్న బీట్ అధికారులు ను సస్పెండ్ చేయాలని టూరిస్ట్ ప్రజలు, అలాగే నివసిస్తున్న ప్రజలు కోరుతున్నారు.

# హజ్ యాత్రకు వెళ్లే ప్రయాణికు లు

# సురక్షంగా చేరుకోవాలని ప్రార్థనలు



పులివెందుల (**కదిలించే వార్త**) **మే 13:** ఆంధ్రప్రదేశ్ నుండి 395 మంది ముస్లిం సోదరులు హజ్ యాత్రకు బెంగళూరు విమానాశ్రాయం నుండి వెళ్లే సందర్భంగా ప్రభుత్వ మైనార్టీ సలహా దారులు గౌ షరీఫ్ ఏపీ హజ్ కమిటీ చెర్మెన్ హస్సన్ భాషా , రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ షేక్. మహబూబ్ భాషా ఏపీ హజ్ కమిటీ డైరెక్టర్లు కలసి మంగళవారం పట్టణంలోని పార్నపల్లి రోడ్డు సమీపంలో ఉన్న రాయల్ ఫంక్షన్ హాల్ లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగాప్రయాణ సౌకర్యాలు వారి అల్పాహార విషయాలు అన్ని క్షుణ్ణంగా పరిశీలించి మధ్యాహ్నం భోజన వసతి సందర్భంగా వారితో పాటు కలిసి అల్పాహారం కలిసి భుజించారు. అనంతరం మక్కా యాత్రకు వెళ్లే ముస్లిం సోదరులు అల్లాహ్ దీవెనలతో సురక్షితంగా మక్కా చేరాలని సలహా దారులు షరీఫ్ మత పెద్దలు హజ్ కమిటీ సభ్యులతో కలిసి హజ్ భవనం నందు ఉన్న మాజిద్ లో ప్రార్థన చేసి ప్రయాణికులకు ప్రయాణంలో తినే తిను బండరాలను పంపిణీ చేసారు. అనంతరం బెంగళూర్ హజ్ భవనం నుండి బెంగళూరు ఎయిర్ పోర్ట్ వరకు తీసుకువెళ్ళు బస్సు లను సాయంత్రం వేల 6 గంటలకు జెండా ఊపి ప్రారంభించారు .

# ఎస్సీ రైతులకు న్యాయం చేయండి......

## మండల డిప్యూటీ తాహసిల్దార్ కు వినతి పత్రం ఇచ్చిన ఎస్సి ఎస్టి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు.....



సింగనమల (**కదిలించే వార్త**) **మే 13:** సింగనమల మండలం నిదనవాడ గ్రామంలో 1999లో 15 మంది ఎస్సీ రైతులకు సర్వే నెం 213,214, ఒక్కొక్కరికి రెండు ఎకరాలు చొప్పున ప్రభుత్వం డీ ఫారం పట్టా మంజూరు చేశారు,అప్పటినుంచి దళిత రైతులు సాగు చేసుకుంటూ బ్యాంకు రుణాలు పొంది జీవనోపాధి పొందుతున్నారు. రీ సర్వే పేరుతో సర్వే నంబర్లు మార్పు జరిగి ఎస్సీలకు సంబంధించిన భూమి యొక్క సర్వే నంబర్లు కొత్త నెంబర్లు కావడంతో ఆ భూమిని మిగులు భూమిగా అధికారులు చూపించడం జరిగింది. ఈ భూమిని సర్వే చేయించి సబ్ డివిజన్ ద్వారా ఎస్సీ రైతులకు ఆన్లైన్ నందు వాళ్ల పేర్లు నమోదు చేయాలని ఈరోజు డిప్యూటీ తాసిల్దార్ ప్రకాష్ రావు జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు నేరిమెట్ల ఎల్లన్న, లోలూరు కుల్లాయప్ప.ఎమ్మెస్ ఎఫ్ నాయకులు నగేష్. రమేష్. గ్రామ రైతులు మునీంద్ర. లక్ష్మీనారాయణ. కుళ్లాయి స్వామి. నాగప్ప తదితరులు పాల్గొన్నారు. ఎస్సీ రైతులకు న్యాయం చేయాలని అదే విధంగా వాళ్ళ పేర్లు ఆన్లైన్ నందు పొందుపరచాలని డిప్యూటీ తాసిల్దార్ దృష్టికి కమిటీ సభ్యులు తీసుకువెళ్లారు. భవిష్యత్తులో ఈ విషయంపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను తొందరలో పరిష్కరిస్తామని నాయకులు తెలిపారు.

# అదుపుతప్పి లారీ బోల్తా



పులివెందుల (**కదిలించే వార్త**) **మే 13:** పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని నలపరెడ్డిపల్లి క్రాస్ రింగ్ రోడ్డు వద్ద అదుపుతప్పి లారీ బోల్తా పడిన సంఘటన చోటు చేసుకోవడం జరిగింది. వివరాలకు వెళితే మంగళూరు నుండి ఐసిఎల్ కు ఎర్ర మట్టిని తీసుకెళ్తున్న 18 టైర్ల లారీ ప్రమాదవశాత్తు బోల్తా పడింది. డ్రైవర్ కు స్వల్ప గాయాలు కావడంతో స్థానికులు వెంటనే 108 కి ఫోన్ చేసి అంబులెన్స్ లో వైద్య చికిత్సల కోసం ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని చేస్తున్నట్లు లారీ బోల్తా పడిన సంఘటన విషయాలపై విచారణ చేస్తున్నామని తెలిపారు

# సిబిఎస్ఈ ఫలితాల్లో శ్రీసిటీ విద్యా సంస్థల విజయకేతనం



శ్రీసిటీ (**కదిలించే వార్త**) **మే 13:** మంగళవారం వెలువడిన సిబిఎస్ఈ పరీక్షా ఫలితాల్లో శ్రీసిటీలోని చిన్మయా, అకార్డ్ విద్యాసంస్థలు వందశాతం ఉత్తీర్ణత సాధించాయి.చిన్మయా విద్యాలయ నుంచి పది పరీక్షలలో ఉత్తీర్ణత సాధించిన 57 మంది విద్యార్థులలో 16 మంది డిస్టింక్షన్, 29 మంది ఫస్ట్ క్లాస్, 12 మంది సెకండ్ క్లాస్ పొందారు. వీరిలో ఎస్.కవినాయ (93%), కె.జోష్నవి (88.8%), ప్రశాంత్ రాజ్ (87.2%) మార్కులతో టాప్ స్కోరర్లుగా నిలిచారు. పన్నెండవ తరగతి పరీక్షలలో 18 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు కాగా, ఆరుగురు డిస్టింక్షన్, మిగిలిన వారు ఫస్ట్ క్లాస్ మార్కులు సాధించారు. వీరిలో కె.లోకేష్, ఎ.లోకేష్ రెడ్డి, ఎస్.చరణ్ వరుసగా 93%, 83.4%, 82.4% మార్కులతో టాపర్లుగా నిలిచారు. చిన్మయా విద్యాలయకు సంబంధించి వరుసగా 9వ సారి పదవ తరగతి ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ కె.భువనేశ్వరి తెలిపారు. అలాగే పన్నెండు తరగతి పరీక్షలలో ఇది రెండవ బ్యాచ్ కాగా, ఇందులోనూ 100 శాతం ఫలితాలతో అద్భుతమైన ఫలితాలు పాఠశాలకు దక్కిందన్నారు.అకార్డ్ స్కూల్ కు సంబంధించి వరుసగా రెండవ ఏడాది పదవ తరగతి పరీక్షల్లో 100% ఉత్తీర్ణత పొందారు. ఉత్తీర్ణులైన 29 మందిలో 11 మంది డిస్టింక్షన్, 9 మంది ఫస్ట్ క్లాస్, 6 మంది సెకండ్ క్లాస్, ముగ్గురు థర్డ్ క్లాస్ పొందారు. ఆర్.ఏ.ఆమేక 92.6%, కళాత్మిక తులసి 92.4%, తాతా లోహిత 89% మార్కులతో టాపర్లుగా నిలిచారని ప్రిన్సిపాల్ బృందా ప్రకటించారు.మంచి ఫలితాలు సాదించినందుకు విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన ప్రకటనలో అభినందనలు తెలిపారు.

# ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న

# వృద్ధురాలి మేడలో గొలుసు మాయం




బుక్కరాయసముద్రం (**కదిలించే వార్త**) **మే 13:** బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో ఆర్టీసీ బస్సులో రత్నమ్మ అనే వృద్ధ మహిళ అనంతపురం నుండి కునుకుంట్ల గ్రామానికి ప్రయాణం చేస్తున్న సమయంలో ఐదు తులాల బంగారం గొలుసు మాయం బుక్కరాయసముద్రం పోలీస్ స్టేషన్ వద్ద బస్సు ఆపి ప్రయాణికులను తనిఖీలు చేసిన పోలీసులు బోరున విలపిస్తున్న వృద్ధురాలు

# శ్రీరామ రెడ్డి తాగునీటి కార్మికులతో

# ఫలించని అధికారుల చర్చలు

## పెండింగ్ వేతనాలు, పిఎఫ్ చెల్లిస్తేనే వీధుల్లో వస్తామన్న కార్మికులు



కూడేరు (**కదిలించే వార్త**) **మే 13:** పీఏబీఆర్ డ్యామ్ వద్ద ఉన్న శ్రీరామరెడ్డి తాగునీటి ప్రాజెక్టు లో పని చేస్తున్న కార్మికులు పెండింగ్ వేతనాలు, పిఎఫ్ కోసం గత నెల 6న సమ్మెలోకి వెళ్లారు. మంగళవారం శ్రీరాంరెడ్డి తాగునీటి ప్రాజెక్టు వద్ద అనంతపురం ఆర్ డి ఓ కేశవ నాయుడు ,ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్ కార్మికులతో చర్చలు జరిపారు కార్మికులకు మద్దతుగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు నిలిచారు. ఈ సందర్భంగా అధికారులు ఈనెల 17వ తేదీన మూడు నెలల జీతం, 30వ తేదీన పిఎఫ్ చెల్లిస్తామని విధుల్లోకి చేరాలని కార్మికులకు సూచించారు .దీంతో కార్మికులు అందుకు అంగీకరించలేదు. మరో మూడు రోజులు సమ్మెలోనే ఉంటాం. ఆరు నెలల పెండింగ్ వేతనం, పిఎఫ్ చెల్లిస్తేనే విధుల్లోకి చేరుతామని తెగేసి చెప్పారు. 38 రోజులుగా కార్మికులు సమ్మె చేస్తున్నారు. జీతాలు అందక వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కార్మికుల కష్టాలు ఉన్నతాధికారులకు కనిపించవా అని ఓబులు ప్రశ్నించారు. ఇప్పటికే పలుమార్లు హామీలు ఇచ్చారు. కానీ నిలుపుకోలేక పోయారు. కార్మికుల డిమాండ్లు పరిష్కరించిన తర్వాతే విధుల్లోకి వస్తారని ఓబులు స్పష్టం చేశారు. దీంతో చర్చలు విఫలమయ్యాయి .అధికారులు చేసేదేమీ లేక వెళ్లిపోయారు. కార్యక్రమంలో తహసిల్దార్ మహబూబ్ బాషా, శ్రీరామ్ రెడ్డి తాగునీటి ప్రాజెక్టు జిల్లా యూనియన్ అధ్యక్షుడు ఎర్రిస్వామి , కార్మికులు రామాంజనేయులు, కొండారెడ్డి ,నాగరాజు, వన్నూరు స్వామి తదితరులు పాల్గొన్నారు.



# మనబడి - మనందరి బాధ్యత



నల్లబెల్లి (**కదిలించే వార్త**) **మే 13:** మనబడి మన అందరి బాధ్యత, అంటూ నల్లబెల్లి మండల కేంద్రంలోని కొండాయిల్ పల్లి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ఉడుత రాజేందర్ మాట్లాడుతూ, 5 నుండి 14 సంవత్సరాల విద్యార్థుల,తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాల యొక్క ఆవశ్యకతను ప్రభుత్వ పాఠశాలలో ఉన్న మౌలిక వసతులను తెలిపి విద్యార్థులకు ఎంతో భవిష్యత్తు ఉందంటూ అత్యంత అనుభవం, అర్హత,సమర్థత, కలిగిన ఉపాధ్యాయులతో ఇంగ్లీష్ మీడియం విద్య,బోధన , ఒత్తిడి లేని విద్య, స్పోర్ట్స్, ఉచిత పుస్తకాలు, రెండు జతల యూనిఫామ్, విశాలమైన తరగతి గదులు, ఆటస్థలం ఉందంటూ విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉడుత రాజేందర్, పరిక రవికుమార్ గ్రామస్తులు పాల్గొన్నారు.

# కాంట్రాక్టు గెస్ట్ ప్యాకల్టీకి 110 జీవో అమలు చేయాలి



వేంపల్లె,.(**కదిలించే వార్త**) **మే 13:** ఆర్జీయూకేటీ పరిధిలోని అన్ని ట్రిపుల్ ఐటీల్లో కాంట్రాక్టు గెస్ట్ ప్యాకల్టీగా పని చేస్తున్న ఉద్యోగులకు 110 జీవోను అమలు చేయాలని కాంట్రాక్టు గెస్ట్ ఫ్యాకల్టీ అసోసియేషన్ అధ్యక్షుడు నజీర్ హుసేన్ కోరారు. మంగళవారం మండలంలోని ఆర్జీయూకేటీ పరిధిలోని ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమార స్వామి గుప్తాను కాంట్రాక్టు గెస్ట్ ఫ్యాకల్టీ ఉద్యోగులు 110 జీవోను అమలు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంట్రాక్టు గెస్ట్ ఫ్యాకల్టీ అసోసియేషన్ అధ్యక్షుడు నజీర్ హుసేన్ మాట్లాడుతూ ఆర్జీయూకేటీ పరిధిలోని ట్రిపుల్ ఐటీల్లో 2018 నుండి పని చేస్తున్న కాంట్రాక్టు గెస్ట్ ప్యాకల్టీకి జీవో 110 అమలు చేయక పోవడం వలన జీతాలు తక్కువగా వస్తున్నట్లు చెప్పారు. 110 జీవోను అమలు చేసి 2018 నుండి ఇప్పటి వరకు కాంట్రాక్టు గెస్ట్ ప్యాకల్టీలకు సర్వీసు కలపాలని కోరారు. అలాగే సర్వీసు బట్టి రావాల్సిన రూ 40 వేలు జీతాలను ఇవ్వాలని కోరారు. కాంట్రాక్టు గెస్ట్ ప్యాకల్టీల సమస్యను పరిష్కరించాలని ఎన్నో సార్లు వినతి పత్రాలు ఇచ్చిన అధికారులు పట్టించుకోక పోవడం దారుణమని అన్నారు. తమ సమస్యలను పరిష్కరించుకొనేందుకు జూన్ 11,12,13 తేదిల్లో ఆయా ట్రిపుల్ ఐటీ క్యాంపస్ ల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇడుపులపాయ, ఒంగోలు, నూజివీడు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో పని చేస్తున్న కాంట్రాక్టు గెస్ట్ ఫ్యాకల్టీలు అందరూ కలిసి నూజివీడు ట్రిపుల్ ఐటీలో సమ్మె నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమ్మె నోటిసును ఇడుపులపాయ డైరెక్టర్ కు అందజేసినట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో కాంట్రాక్టు గెస్ట్ ఫ్యాకల్టీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ సుజల స్రవంతి ఆర్ ఓ వాటర్ ప్లాంట్ ను

# ప్రారంభించినమారెడ్డి జయభరత్ రెడ్డి




సింహాద్రిపురం (**కదిలించే వార్త**) **మే 13:** సింహాద్రిపురం గ్రామపంచాయతీలోని నిడిల్ల గ్రామంలో ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకంను ప్రారంభించిన తొండూరు మండల పరిశీలకుడు, సీనియర్ నేత మారెడ్డి జయభరత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం " దాహం తో వున్నవారికి దాహాన్ని తీర్చడం ఒక మంచి పద్ధతి ప్రతి పేదవానికి మరియు త్రాగు నీరు సరిగా అందనటువంటి ప్రతి ప్రాంతానికి వారి దాహాన్ని తీర్చడానికి అమలు చేసిన ఈ పథకం ప్రతి ఒక్కరికి ఉపయోగపడుతుంది అందుకు కారణం రాష్ట్రానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కావడం అదేవిధంగా కూటమి ప్రభుత్వం ప్రజల కోసం .. ఇలా ఎన్నో పథకాలు ప్రవేశపెడుతున్నారు ప్రజల కోసం పని చేస్తున్న ప్రజా ప్రభుత్వం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సింహాద్రిపురం మండల టీడీపీ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

# బ్రహ్మంగారిమఠంలోని శ్రీ వెంకటేశ్వర

# డిగ్రీ కళాశాల గుర్తింపు రద్దు చేయాలి

## అఖిల భారత విద్యార్థి బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాల జయవర్ధన్



కడప (**కదిలించే వార్త**) **మే 13:** యోగి వేమన యూనివర్సిటీ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న బ్రహ్మంగారి మఠం లోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల గుర్తింపు రద్దు చేయాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్ (ఏ.ఐ.ఎస్.బి) ఆధ్వర్యంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ పద్మ గారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి బ్లాక్ (ఏ.ఐ.ఎస్.బి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాల జయవర్ధన్, జిల్లా కన్వీనర్ సగిలి రాజేంద్రప్రసాద్ లు మాట్లాడుతూ బ్రహ్మంగారి మఠం లోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల యూనివర్సిటీ నిబంధనలకు విరుద్ధంగా ఒక చోట అనుమతి ఉంటే మరొక చోట తరగతులు నిర్వహిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు. కళాశాల యాజమాన్యం విద్యార్థులకు విజయవాడ ఆర్టీసీ బస్సు షెల్టర్, అన్నదాన సత్రంలో తరగతులు నిర్వహిస్తూ అటు యూనివర్సిటీ అధికారులను ఇటు విద్యార్థులను మోసం చేస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తున్నారు అని వారు తెలిపారు. బ్రహ్మంగారి మఠంలోని అన్నదాన సత్రంలో ఎలాంటి మౌలిక వసతులు కల్పించకుండా విద్యార్థుల నుంచి వేల రూపాయలు ఫీజులు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు. బ్రహ్మంగారి వారోత్సవంలో భాగంగా సర్పములో అన్నదానం నిర్వహిస్తుంటే మరోవైపు విద్యార్థులు అక్కడే పరీక్షలు రాయాల్సిన పరిస్థితి ఏర్పడింది అని వారు తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి మౌలిక వసతులు కల్పించకుండా, అధికారులను మోసం చేస్తూ సత్రంలో తరగతులు నిర్వహిస్తున్నటువంటి కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోని కళాశాల గుర్తింపు రద్దు చేయాలని కళాశాలలో సెల్ఫ్ సెంటర్ రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు.

## నూతన ప్రిన్సిపల్ గా బాధ్యతలు చేపట్టిన జ్ఞానేశ్వరి



కడప (కదిలించే వార్త) మే 13: ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలురు కడప నూతన ప్రిన్సిపల్ గా కర్నూల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలికల నందు భౌతిక శాస్త్ర అధ్యాపకులుగా పనిచేస్తున్న టీ. జ్ఞానేశ్వరి కడప బాయ్స్ కళాశాలకు ప్రిన్సిపల్ ప్రమోషన్ పై రావడం జరిగినది, ఈరోజు బాయ్స్ కళాశాలలో బాధ్యతలు చేపట్టిన ప్రిన్సిపల్ ని కళాశాల అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది ఆమెకు ఘన స్వాగతం పలికి పుష్పగుచ్ఛలిచ్చి అభినందించడం జరిగినది, ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల అభివృద్ధి కోసం పర్సంటేజ్ పెంచి విద్యార్థుల యొక్క అభివృద్ధి కోసం అహర్నిశల కళాశాల కోసం అధ్యాపకుల సాయి సహకారాలతో ముందుకు తీసుకువెళ్తానని ఆమె చెప్పడం జరిగినది, ఈ కార్యక్రమంలో కళాశాల మాజీ ప్రిన్సిపల్ హబీబుల్లా జూనియర్ అధ్యాపకుల సంఘం మాజీ జిల్లా కార్యదర్శి చెప్పలి రాజారావు, అధ్యాపకులు, అధ్యాపకేతర, సిబ్బంది పాల్గొన్నారు.

## ఏపీఎస్ఆర్టీసీ లో పనిచేస్తున్న ఉద్యోగులు కార్మికులను న్యాయమైన సమస్యలను పరిష్కరించాలి

### చలో కడప ఆర్ఎం డిపి టి ఓ



కడప (కదిలించే వార్త) మే 13: ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించేందుకు సత్వర చర్యలు చేపట్టాలని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీ.శివారెడ్డి డిమాండ్ చేశారు.రాష్ట్ర వ్యాప్తంగా పిలుపులో భాగంగా ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ కడప రీజియన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు ఛలో డీపీటీఓ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆర్ఎం కార్యాలయం ఎదుట ఉద్యోగులు, కార్మికులు బైఠాయించి తమ సమస్యల పరిష్కరించాలని కోరుతూ నినదించారు. మంగళవారం ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు శివారెడ్డి,కడప డిపో కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ ఆమోద యోగ్యమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 40%-%50 డిమాండ్లతో ఎండీకి వినతిపత్రాన్ని సమర్పించామన్నారు. ఈ క్రమంలో అంచెలంచెలుగా వివిధ ఆందోళన కార్యక్రమాలు చేపట్టామన్నారు. తామేమి గొంతెమ్మ కోర్కెలు కొరడం లేదని, ఆమోదయోగ్యమైన సమస్యలను మాత్రమే ప్రస్తావిస్తున్నామన్నారు. గతంలో టీడీపీ హయాంలో నేషనల్ మజ్దూర్యూనియన్ 1/19 సర్క్యులర్‌ను కార్మికులందరికీ ఉపయోగపడే విధంగా తీసుకురావడం జరిగిందన్నారు. అయితే నాటి నుంచి నేటి వరకు ఆ సర్కులర్ అమలుకు నోచుకోవడం లేదన్నారు. వైద్య సేవలకు సంబంధించి ఉద్యోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.కొత్త బస్సులు కొనుగోలు, సిబ్బంది నియమాకం, ఎలక్ట్రికల్ బస్సులు ఏపీఎస్ ఆర్టీసీ స్వయంగా కొనుగోలు చేయాలని కోరుతున్నా పట్టించుకునే నాధుడే లేదన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం తమ సమస్యలను పరిష్కరించేలా సత్వర చర్యలు చేపట్టాలని, అవసరమైతే సమ్మెలోకి వెళ్లేందుకైనా సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ,రాష్ట్ర కార్యదర్శి భద్రావతమ్మ, కడప రీజినల్ కార్యదర్శి సుధాకర్, రీజినల్ ప్రెసిడెంట్ నాగముని, అసిస్టెంట్ సెక్రటరీలు సుబ్బారావు, నాగరాజుతోపాటు అన్ని డిపోల అధ్యక్ష కార్యదర్శులు, గ్యారేజ్ అధ్యక్ష కార్యదర్శులు, సీసీఎస్ డెలిగేట్లు భారీ సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.




## పలముదిర చోళయ్ చిత్రంలో కడప జనసేన నాయకులు ప్రత్యేక పూజలు



కడప (కదిలించే వార్త) మే 13: కడప జిల్లా జనసేన నాయకులు జీవి. రమణ గారి ఆధ్వర్యంలో తమిళనాడు లోని పలముదిర చోళయ్ క్షేత్రంలో కడప జనసేన నాయకులతో ఆపరేషన్ సిందూర్ ద్వారా విజయం సాధించిన సైనికులకు, దేశ నాయకత్వానికి దైవ బలం ఉండాలని ప్రత్యేక పూజలు చేశారు. రైల్వే కోడూరు ఎమ్మెల్యే ఆరువ శ్రీధర్ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర పర్యవేక్షణలో తమిళ నాడు లోని పలముదిర చోళయ్ జనసేన శ్రేణులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే జనసేన అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సువిశాల దృక్పథంతో ఇచ్చిన పిలుపును అనుసరించి ఈ కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. ఆయనకు మా అందరి తరపున ధన్యవాదాలు తెలుపుతున్నమన్నారు.

## తప్పు అధికారులు చేసి శిక్ష మాకు వేస్తారా

### కరెంటు కట్ చేయించిన పంచాయతీ కార్యదర్శి



ఆత్మకూర్/ (కదిలించే వార్త) మే 13: మే/ 13/ఆత్మకూరు మండలం కటాక్షపూర్ గ్రామంలో నీళ్లు కరెంటు కట్ చేయించిన పంచాయతీ గ్రామంలో గల డబుల్ బెడ్ రూమ్ ఇళ్లల్లో నివాసముంటున్న వారు గ్రామపంచాయతీ రికార్డులో నమోదు చేసుకోలేదని ఇంటి పనులు కట్టడం లేదని రెండు రోజులగా వీధి దీపాలు కట్ చేసినట్లు కాలనీలోని ఉన్న బోరు వద్ద స్టార్టర్ ను గ్రామపంచాయతీ సిబ్బంది తీసుకెళ్లినట్టు కాలనీవాసులు తెలిపారు.గత ప్రభుత్వంలో అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్ రూములు ఇచ్చారు వాటిని గ్రామ పంచాయితీ రికార్డులో ఎక్కించకుండా నల్ల పన్ను నీటి పన్ను కట్టడం లేదని కరెంటు కట్ చేయించి నల్ల నీళ్లు నిలిపివేసిన గ్రామపంచాయతీ కార్యదర్శి తీరుపై గ్రామ ప్రజలు మండిపడుతున్నారు.

## వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్

### గోరంట్ల మండలం కల్లితండాలో పర్యటించారు.






గోరంట్ల (కదిలించే వార్త) మే 13: 'ఆపరేషన్ సిందూర్'లో భాగంగా జమ్ముకశ్మీర్‌లో శత్రుమూకలను తుదముట్టిస్తూ వీరమరణం పొందిన జవాన్ ముడావత్ మురళీ నాయక్ కుటుంబ సభ్యులను వైయస్ జగన్ పరామర్శించారు.

## ఏపీ రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు చైర్మెన్ గా టిడిపి జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్

### ఘనంగా సత్కరించిన గౌస్ మోద్దిన్




అనంతపురం అర్బన్,(కదిలించే వార్త) మే 13: తెలుగుదేశం పార్టీ విధేయులకు ఎప్పుడు అండగా ఉంటుందని మరోసారి రుజువైందని మాజీ గ్రంథాలయ చైర్మన్, టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిరాయితీ గౌస్ మోద్దిన్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ కార్మిక సంక్షేమ శాఖ బోర్డు చైర్మన్ గా తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు శ్రీ వెంకట శివుడు యాదవ్ ఎన్నికపై గౌస్ మోద్దిన్ హర్షం వ్యక్తం చేశారు. నేడు టిడిపి జిల్లా పార్టీ కార్యాలయం నందు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గాజుల ఆదెన్న మరియు టిడిపి నాయకులతో కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గౌస్ మోద్దిన్ మాట్లాడుతూ వెంకట శివుడు యాదవ్ గత 20 సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీలో ఉన్నారన్నారు. గుంతకల్ కు చెందిన వెంకట శివుడు యాదవ్ టిడిపి పార్టీలో సామాన్య కార్యకర్త స్థాయి నుండి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో జిల్లా అధ్యక్షుడు స్థాయికి ఎదిగారన్నారు. 2024 ఎన్నికల సమయంలో జిల్లా అధ్యక్షుడుగా నియమిపబడ్డ వెంకట శివుడు యాదవ్ జిల్లాలో అందర్నీ సమన్వయం చేసుకుంటూ పార్టీ గెలుపుకు కృషి చేశారన్నారు. వెంకట శివుడు యాదవ్ విధేయతకు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్మిక సంక్షేమ శాఖ బోర్డు చైర్మెన్ ప్రకటించడం హర్షించదగ్గ విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బుల్లె రామకృష్ణ, పప్పూరు లక్ష్మీనారాయణ, బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ విద్యార్థి తల్లితండ్రులతో ఫీజు చెల్లించుకోని ఇంటర్ బోర్డుకు ఫీజు చెల్లించకుండా నిర్లక్ష్యంగా ఉన్న శ్రీ విజన్ కాలేజీ ను సీజ్ చేయాలి

ప్రభుత్వం సప్లై ఫీజు 650 నిర్ణయిస్తే శ్రీ విజన్ కళాశాల యాజమాన్యాలు 1500 రూపాయలు వసూలు

సంవత్సరం పాటు విద్యార్థినీ విద్యాభ్యాసం వృధా

ఇదే విద్యార్థి 5000 రూపాయలు ఫీజు పెండింగ్ ఉంటే ఇంటికి పంపించకుండా నిలబెట్టిన శ్రీ విజన్ యాజమాన్యాలు

కానీ సప్లై ఫీజు కట్టకుండా నిర్లక్ష్యం

ఏఐఎస్ఎఫ్ ఎస్ఎఫ్ఐ బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ విద్యార్థి సమైక్య మరియు విద్యార్థిని తల్లితండ్రులతో కలిసి ఆర్ఐఓ కార్యాలయం వద్ద ధర్నా





అనంతపురం (కదిలించే వార్త) మే 13: అనంతపురం అర్బన్:శ్రీ విజన్ కళాశాల యాజమాన్యాల నిర్లక్ష్యం వల్ల ఇంటర్ రెండవ సంవత్సరం పూర్తి చేసుకున్న తీర్థన అనే విద్యార్థి ఒక సంవత్సరం వృధా కళాశాల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ ఎస్ఎఫ్ఐ బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ విద్యార్థి సమైక్య మరియు విద్యార్థి తల్లిదండ్రులతో కలిసి ధర్నా కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయిస్వామి ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్ బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ విద్యార్థి సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్ యాదవ్ మాట్లాడుతూ ఇంటర్ సెకండియర్ పూర్తిచేసుకున్న కీర్తన అనే విద్యార్థి మొదటి సంవత్సరంలో మార్క్స్ 1%ఖ% సబ్జెక్ట్ పెండింగ్ ఉండడం వలన 22వ తేదీ విద్యార్థి తండ్రి కళాశాల యాజమాన్యులు శంకరయ్య గారికి ఫోన్ పే ద్వారా 1500 రూపాయలు చెల్లించారు కానీ కళాశాల యాజమాన్యాలు నిర్లక్ష్యం వలన తీర్థన అనే విద్యార్థి ఫీజు ఇంటర్ బోర్డుకు చెల్లించకుండా నిర్లక్ష్యం వహించారని మండిపడ్డారు. ఇంటర్ పరీక్ష ఫీజు 650 రూపాయలు అయితే కానీ కళాశాల యాజమాన్యులు విద్యార్థినితో 1500 రూపాయలు వసూలు చేశారని తెలిపారు.. ఇప్పుడు విద్యార్థిని సంవత్సరం పాటు తన చదువును కళాశాల యాజమాన్యుల నిర్లక్ష్యం వల్లనే వృధా చేసుకోవలసి వస్తుందని పేర్కొన్నారు.. విద్యార్థిని ప్రస్తుతం ఎంసెట్ కోచింగ్ కూడా తీసుకుంటా ఉంది ఈ సబ్జెక్టు పాస్ అయ్యి బీటెక్లో మంచి సీటు సంపాదించాలని కోరుకున్న కోరికలు అడియాశలయ్యాయని తెలిపారు... ఇదే తీర్థన అనే విద్యార్థినికి సెకండ్ ఇయర్ పూర్తిచేసుకుని 5 వేల రూపాయలు పెండింగ్ ఉంటే శ్రీ విజన్ కళాశాల యాజమాన్యులు ఇంటికి పంపించకుండా 5000 కడితేనే పంపిస్తామని తెలిపారు ఫీజు కట్టించుకునే దాని మీద ఉన్న శ్రద్ధ విద్యార్థుల పరీక్షల ఫీజు కట్టడంలో లేదా అని మండిపడ్డారు విద్యార్థినికి న్యాయం చేయాలని తెలిపారు.తక్షణమే శ్రీ విజన్ కళాశాలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు.. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్షులు మంజునాథ్ చందు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గిరి అజయ్ ఏఐఎస్ఎఫ్ నగర కోశాధికారి సహాయ కార్యదర్శి సమీర్ ఆశిష్ సుఫియాన్ బాబు నరేష్ కేదుర్ అరవింద్ ఎస్ఎఫ్ఐ సాయి తదితరులు పాల్గొన్నారు.

## చట్ట సభలలో బీసీ లకు రిజర్వేషన్లు, విద్య, ఉద్యోగాలలో 43%శాతం రిజర్వేషన్ల కోసం మహానాడు లో తీర్మానం చేయాలని టీడీపీ పార్టీకి,

ప్లీనరిలో తీర్మానం చేయాలని వైస్సార్సీపీ పార్టీకి,

డా. పోతుల నాగరాజు విజ్ఞప్తి.




అనంతపురం (కదిలించే వార్త) మే 13: జనాభా దామాషా ప్రకారం అన్ని రంగాలలో రిజర్వేషన్ల ను అమలు చేయాలని, దేశంలో అన్ని రాజకీయ పార్టీ లకు, ఎన్డీఏ కూటమి కి, ఇండియా కూటమి కి విన్నపం చేస్తూ, జనాభా లెక్కలలో కులం ప్రాతిపదికన జనాభా లెక్కలను సేకరించాలని కేంద్ర క్యాబినెట్ తీసుకొన్న నిర్ణయంను స్వాగతీస్తూ, ఈ డిమాండ్ కోసం గళం ఇప్పిన రాహుల్ గాంధీ కి, దేశం లోని అన్ని రాజకీయ పార్టీ ల అధినేతలకు, కుల, ప్రజాసంఘాల కు కృతజ్ఞతలు తెలుపుతూ, కేంద్రం లో ప్రధాన భాగస్వామ్యం వహిస్తున్న తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేస్తున్నాము. ఈ సందర్భంగా అన్ని రాజకీయ పార్టీ లకు రిజర్వేషన్ల పరిరక్షణ సమితి )రిజర్వేషన్ల ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఫౌండర్ డా. పోతుల నాగరాజు విన్నపం చేయడం ఏమిటంటే దేశం లో సామాజిక న్యాయం అమలు జరగాలి అంటే జనాభా నిష్పత్తి ప్రకారం అన్ని రంగాలలో వాటా దక్కినపుడే సాధ్యం అవుతుంది. ఇప్పటికే చట్ట సభలలో లకు రిజర్వేషన్ అమలు అవుతుంది, కానీ సామాజిక పరిస్థితి ఒకే విధంగా ఉన్న %దీజ% లకు ఎలాంటి చట్ట బద్దమైన, రాజ్యాంగ బద్దమైన రిజర్వేషన్ రాజకీయాలలో అమలు కాలేదు, 56%శాతం ఉన్న బీసీల ప్రతినిధ్యం చట్ట సభలలోనూ, న్యాయ వ్యవస్థ లోను లేకుంటే ఎలా ఈ వర్గం అభివృద్ధి చెందుతుంది అని పాలక వర్గాలను ప్రశ్నిస్తూ, ఈ రంగం రిజర్వేషన్ కోసం రాజ్యాంగ సవరణ చేపట్టి, పార్లమెంట్ లో చట్టం చేయాలని కోరుకుంటూ, ఆ డిమాండ్ సాధన కోసం దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు కృషి చేయాలని విజ్ఞప్తి చేస్తూ, విద్య, ఉద్యోగాలలో, స్థానిక సంస్థ లలో, చట్ట సభ లలోనూ ఒకే విధమైన రిజర్వేషన్ అమలు 43%శాతం అమలు కోసం కృషి చేయాలని, ఈ డిమాండ్ సాధన కోసం పార్లమెంట్ లోను, అసెంబ్లీ లలోనూ మాట్లాడాలని బహుజన ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేస్తూ, ఆవిధమైన కార్యాచరణ కోసం ఆగష్టు లో బహుజన ప్రజాప్రతినిధులను సన్మానించే కార్యక్రమంను అనంతపురం జిల్లా కేంద్రంలో చేపట్టడం జరుగుతుంది అని రిజర్వేషన్ వర్గాల ఉద్యోగులను, న్యాయవాదులను, డాక్టర్లను, ఇంజినీర్ లను విద్యా వంతు లను భాగస్వామ్యం కావాలని పిలుపు నిస్తూ చట్ట సభ లలో రిజర్వేషన్ల సాధన, జనాభా నిష్పత్తి ప్రకారం అన్ని రంగాలలో వాటా కోసము, ఇవే ప్రధాన అజెండాగా తీసుకొని నిరంతరం కార్యక్రమాలు, ఉద్యమాలు చేపట్టాలని మరియు నాయకులు తీర్మానించడం జరిగింది. విలేకరుల సమావేశం లో నాయకులు చిరుతల విఠల్ గౌడ్, జాతీయ నాయకులు జి. నాగభూషణ, రాష్ట్ర కన్వీనర్,ఆర్. నారాయణ నాయక్, రాయలసీమ కన్వీనర్ నాగభూషణ, రాష్ట్ర నాయకులు ఎర్రి స్వామి, వరద రాజులు, ఆర్ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## క్రైస్తవ హక్కుల రక్షణ సమితి పాస్టర్స్ అండ్ లీడర్స్ సదస్సు విజయవంతం

ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ బిషప్ డాక్టర్ జన్ను యిర్మీయా



హనుమకొండ (కదిలించే వార్త) మే 13: క్రైస్తవ హక్కుల రక్షణ సమితి ఆధ్వర్యంలో మంగళవారం హసన్ పర్తి కల్వరి ప్రార్థన మందిరంలో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పాస్టర్ సింగారపు రాజు, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జ్ రెవ. విలియం కేరి అధ్యక్షతన వరంగల్ ఉమ్మడి జిల్లా పాస్టర్స్ అండ్ లీడర్స్ కాన్ఫరెన్స్ అంగరంగ వైభవంగా జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య ప్రసంగికులుగా పాస్టర్ జోసఫ్ క్రైస్తవ హక్కుల రక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బిషప్ డాక్టర్ జన్ను యిర్మీయా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఇంటర్నేషనల్ కో ఆర్డినేటర్ రెవ ఎలీషా, ఇంటర్నేషనల్ ప్రధాన కార్యదర్శి బ్రదర్ ల్యాదేల్ల రమేష్ పాల్, ఇంటర్నేషనల్ ట్రెజరర్ బ్రదర్ మాట్ల రాజు, నేషనల్ చీఫ్ అడ్వైజర్ రెవ అశోక్ పాల్, అడ్వైజర్ స్థానిక సంఘ కాపరి రెవ.ఆర్.వి. రత్నం, నేషనల్ ఉపాధ్యక్షుడు రెవ.డాక్టర్ జన్ను ప్రభాకర్, రెవ జన్ను ఏసన్న, నేషనల్ ఉపాధ్యక్షుడు వరంగల్ జిల్లా అధ్యక్షుడు రెవ డా జూపాక యాకోబు, అడ్వైజర్ బ్రదర్ జె.ఆర్ సాల్మన్, రెవ.జన్ను ఏసు పాదం, రెవ.ఇసంపల్లి శ్రీనివాస్ నేషనల్ జాయింట్ సెక్రెటరీ.రెవ సుదర్శన్, కల్చరల్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ బ్రదర్ జన్ను జోషి బొయజ్, ప్రచార కార్యదర్శి నేషనల్ రెవ రవి పాల్, పాస్టర్ సిహెచ్ కృపాల్, తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రెవ.బెన్ని, రెవ.రాజు కుమార్, నేషనల్ ప్రచార కార్యదర్శి రెవ కోట జాషువా, బ్రదర్ గుంటుకు రమేష్ రెవ. దేవదాసు, ఉమ్మడి వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రచార కార్యదర్శి పాస్టర్ జన్ను ఆరోగ్యం, ప్రచార కార్యదర్శి పాస్టర్ యెహోషువ, ప్రచార కార్యదర్శి పాస్టర్ ఐజయ్య భూపాల్ పల్లి జిల్లా అధ్యక్షుడు బ్రదర్ రాజేష్, ఆరు జిల్లాల నాయకులు పాస్టర్స్ లీడర్స్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఇంత విజయవంతం చేసి ఆశీర్వదించి, దేవుని మహిమ కలుగును గాక సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక వందనాలను వ్యవస్థాపకులు ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ బిషప్ డాక్టర్ జన్ను యిర్మీయా తెలిపారు.

## కర్ణాటక లోని కుక్కే సుబ్రహ్మణ్యం స్వామి దేవాలయం నందు పూజలు నిర్వహించిన జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ చిలకం మధుసూదన రెడ్డి



అనంతపురం (కదిలించే వార్త) మే 13: జనసేన పార్టీ అధ్యక్షులు మన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు మన సైనికులకు మద్దతు గా ఈ రోజు.మన దేశం టెర్రరిస్ట్ పాకిస్తాన్ మీద చేస్తున్న ఆపరేషన్ సింధూర్. ధర్మ యుద్ధంలో మన సైనికులకు భగవంతుని ఆశీస్సులు, దైవబలం మెండుగా ఉండాలని కోరుకుంటూ అనంతపురం జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు.అహుడా ఛైర్మన్ శ్రీ %ు.జ%.వరుణ్ ఆధ్వర్యంలో పవిత్ర పుణ్యక్షేత్రం కర్ణాటక లోని కుక్కే సుబ్రహ్మణ్యం స్వామి దేవాలయం నందు పూజలు నిర్వహించటం జరిగింది.ఈ కార్యక్రమం లో జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ చిలకం మధుసూదన రెడ్డి గారు .జనసేన పార్టీ రాష్ట్ర కార్యక్రమాల నిర్వహణ కార్యదర్శి.శ్రీ భవానీ రవి కుమార్ గారు.జిల్లా ఉపాధ్యక్షులు శ్రీ జయరామి రెడ్డి గారు.శ్రీ అంకె ఈశ్వర్ గారు.శింగనమల ఇంచార్జి శ్రీ సాకే మురళీ కృష్ణ గారు.జిల్లా కార్యదర్శి శ్రీ చొప్పా.చంద్ర శేఖర్ గారు.బుక్కరాయసముద్రం మండల కన్వీనర్ శ్రీ ఎర్రి స్వామిగారు.సింగనమండల కన్వీనర్ తోటి ఓబిలేసు గారు.. మరియు జిల్లా లోని నియోజకవర్గాల ఇంచార్జి లు.జిల్లాకమిటీ సభ్యులు.జిల్లాలోని ముఖ్య నాయకులు.కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేశారు.

## పివికెకె ఐటి లో వర్చూసా కంపెనీ ద్వారా 66 మంది విద్యార్థులకు ఉద్యోగాలు 29 మంది పివికెకె విద్యార్థులు ఎంపిక



అనంతపురం,(కదిలించే వార్త) మే 13: అనంతపురంలోని ప్రముఖ సంస్థ పివికెకె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ లో ఇటీవల నిర్వహించిన ప్రత్యేక ఆఫ్ క్యాంపస్ రిక్రూట్మెంట్ డ్రైవ్ లో 66 మంది విద్యార్థులు ఎంపిక అయ్యారు. వీరిలో 29 మంది పివికెకె ఐటి కళాశాల విద్యార్థులు ఉండటం గర్వకారణంగా ఉందని కళాశాల ప్రిన్సిపాల్ డా. బండి రమేష్ బాబు తెలిపారు. ఈ నియామక డ్రైవ్ మే 12వ తేదీన నిర్వహించబడింది. ఏపీఐటీఏ ఆధ్వర్యంలో, దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఐటీ కంపెనీ కంపెనీ ఈ డ్రైవ్ నిర్వహించింది. కంపెనీ ఉద్యోగ నియామక ప్రక్రియలో భాగంగా, ప్రీ-ప్లేస్మెంట్ టాక్, కమ్యూనికేషన్ రౌండ్, ఆపరేషన్ రౌండ్, హెచ్ఆర్ ఇంటర్వ్యూ వంటి దశల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేశారు. ఈ రిక్రూట్మెంట్ డ్రైవ్ లో 2024, 2025 సంవత్సరాల్లో పట్టభద్రులయ్యే , డిగ్రీ, విద్యార్థులు పాల్గొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు హోదాలో, వార్షిక వేతనం రూ. 3 లక్షల వరకు అందనున్నది. ఉద్యోగం వర్క్ ఫ్రం హోమ్ ) అయినప్పటికీ, బేస్ లొకేషన్ హైదరాబాద్ గా ఉండనుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా, ప్లేస్మెంట్ డీన్ డా. భాను కిరణ్ మాట్లాడుతూ, ఈ అవకాశం విద్యార్థులకు కెరీర్ పరంగా మంచి ఆరంభం అవుతుందన్నారు. కాగా, మొత్తం డ్రైవ్ లో వివిధ కళాశాలల నుంచి 400 మంది విద్యార్థులు హాజరయ్యారని, వారిలో 66 మంది ఎంపిక కావడం గర్వకారణమన్నారు. కళాశాల చైర్మన్ డా. పల్లె కిషోర్ మాట్లాడుతూ, ఇటువంటి అవకాశాలు విద్యార్థులకు మరింత ప్రోత్సాహం కలిగిస్తాయని, పివికెకె విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఎంపిక కావడం శుభసంకేతమన్నారు.

## అనంత అభివృద్ధికి మనందరం పనిచేద్దాం




అనంతపురం(కదిలించే వార్త) మే 13: మే 13 ఎలక్షన్ జరిగే అప్పుడే వన్ ఇయర్ అయింది దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాదన్న 23 వేల 23 ఓట్లతో విజయం సాధించడం అనంత అభివృద్ధికి అన్నతో పాటు మనందరం పనిచేద్దాం జై తెలుగుదేశం జై జై తెలుగుదేశం దగ్గుపాటి ప్రసాదన్న నాయకత్వం వర్ధిల్లాలి జై తెలుగుదేశం జై జై తెలుగుదేశం.

## జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశాలతో వాహనాల తనిఖీ

ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా చెక్ చేసి రోడ్డు భద్రత ఉల్లంఘనలపై చర్యలు చేపట్టిన ఆయా పోలీసులు






అనంతపురం (కదిలించే వార్త) మే 13: జిల్లా ఎస్పీ ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు వాహనాల తనిఖీలు చేపట్టి రోడ్డు భద్రత పై అవగాహన కల్పించారు. ద్విచక్రవాహనం నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచిస్తున్నారు. కార్ల డ్రైవర్లు సీటు బెల్టు వేసుకోవాలన్నారు. సెల్ ఫోన్ డ్రైవింగ్, డ్రంకన్ డ్రైవింగులకు దూరంగా ఉండాలన్నారు. పరిమితికి మించి ప్రయాణీకులను ఆటోలలో తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. రహదారి భద్రత నియమాల ఉల్లంఘనలపై పోలీసులు చర్యలు చేపట్టారు.

## రామగిరి ఎంపీపీ ఎన్నిక విషయంలో వైసీపీకి గట్టి స్ట్రోక్ ఇచ్చిన వైసీపీ ఎంపీటీసీలు



రామగిరి (కదిలించే వార్త) మే 13: ఈనెల 15న ఎంపీపీ ఎన్నికకు నోటిఫికేషన్.. 19వ తేదీ ఎన్నికలు జరిగే అవకాశం ఈ క్రమంలో వైసీపీకి షాక్ ఇచ్చిన సొంత పార్టీ ఎంపీటీసీలు పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ సమక్షంలో టీడీపీలో చేరిన ముగ్గురు ఎంపీటీసీలు పేరూరు-1 ఎంపీటీసీ కరెన్న పేరూరు-2 ఎంపీటీసీ భారతి, మాదాపురం ఎంపీటీసీ సంపత్ లు తెలుగుదేశం పార్టీలో చేరిక వెంకటాపురంలో వారికి కండువాలు వేసి ఆహ్వానించిన ఎమ్మెల్యే సునీత, శ్రీరామ్ తెలుగుదేశం పార్టీ అభివృద్ధి పట్ల ఆకర్షితులై పార్టీలో చేరినట్లు ప్రకటన 2నెలల క్రితం ఎంపీటీసీలను బలవంతంగా క్యాంపులకు తరలించిన ప్రకాష్ రెడ్డి ఎంపీపీ ఎన్నికలకు హాజరుకాకుండా డ్రామాలు నడిపిన ప్రకాష్ రెడ్డి ఎంపీపీ ఎన్నిక జరిగితే ఓటమి భయంతో విద్వేషాలు సృష్టించిన ప్రకాష్ రెడ్డి దాని ఫలితంగానే అనుకోని సంఘటనలు జరిగాయన్న టిడిపి నాయకులు

## మృతి చెందిన భాస్కర్ రెడ్డి

# భౌతికాయానికి పూలమాలవేసి

## మాజీమంత్రి రఘునాథ్ రెడ్డి



పుట్టపర్తి (కదిలించే వార్త) మే 13: తనకల్లు మండలం పరకుల వాండ్లపల్లి లో మాజీ జెడ్పీచైర్మెన్ దేశాయి రెడ్డప్ప రెడ్డి సోదరుడు దేశాయి భాస్కర్ రెడ్డి మృతి చెందారు. ఈ విషయమును తెలుసుకున్న మాజీమంత్రి రఘునాథ్ రెడ్డి హుటా హుటిన ఆ గ్రామానికి విచ్చేసి మృతి చెందిన భాస్కర్ రెడ్డి భౌతికాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

# కగార్‌పై కొత్త ప్రతిపాదనలు



'ఆపరేషన్ కగార్' కాల్పుల విరమణను కోరుతూ మావోయిస్టు పార్టీ ఇటీవల కేంద్ర ప్రభుత్వానికి చేసిన ప్రతిపాదనకు భిన్నంగా ఇప్పుడు కొన్ని కొత్త ప్రతిపాదనలు ముందుకువచ్చాయి. 'శాంతి చర్చల కో ఆర్డినేషన్ కమిటీ' పేరిట వచ్చిన ఈ ప్రతిపాదనలో గమనార్హమైన విశేషం ఒకటున్నది. శాంతిచర్చలు జరగవలసింది తమకు, ప్రభుత్వానికి మధ్య అన్నది మావోయిస్టుల వైఖరి కాగా, వారితో మాత్రమే కాదని, ఆదివాసీలతో, పౌరహక్కుల వారితో కూడా జరగాలని ఈ కమిటీ కోరుతున్నది. ఈ మాటల అర్థ తాత్పర్యాల్లోకి వెళ్లే ముందు కొన్ని మాటలు చెప్పుకోవాలి. కమిటీ వారు తమ లేఖను కేంద్ర ప్రభుత్వానికి గాక కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేకు రాశారు. కాల్పుల విరమణ కోసం కేంద్రాన్ని ఒత్తిడి చేయాలని, ఈ విషయం 'ఇండియా' కూటమిలోని పార్టీల దృష్టికి కూడా తీసుకువెళ్లాలని కోరారు. ఈ మేరకు ఖర్గే ఏమి చేయగలిగింది వేచి చూడవలసి ఉంటుంది. కమిటీ లేఖలో కాల్పుల విరమణ, శాంతి చర్చల ప్రస్తావనలు మాత్రమే లేవు. 'దశాబ్దాలుగా ఆ ప్రాంతాల్లో కొనసాగుతున్న దోపిడీ, భూముల స్వాధీనం, ప్రజా సమస్యల పట్ల వ్యవస్థల నిర్లక్ష్యం, తదితర కారణాల వల్ల ఈ విపత్కర పరిస్థితి తలెత్తింది' అనే ముఖ్యమైన మాట ఉన్నది. అదేవిధంగా, 'ఆదివాసీల రాజ్యాంగ హక్కుల కోసం పోరాడుతూ జైలుపాలైన ఆదివాసీ నేతలు, ఇతర హక్కుల నేతల' గురించి కూడా పేర్కొన్నారు. నక్సలిజం విషయం ఆషామాషీ వ్యవహారం కాదు. అందుకు గల కారణాలు, చరిత్ర చాలా ఉన్నాయి. అది తేలికగా తేలేది కాదు. కేవలం కాల్పులు, వాటి విరమణలకు పరిమితమైనది కాదు. ఇదంతా రాయటం ఎందుకంటే, ఆదివాసీ ప్రాంతాల్లో 'దశాబ్దాలుగా' జరుగుతున్నదంటున్న దానిలో ఆరంభ పాత్ర, దీర్ఘకాలపు పాత్ర మల్లికార్జున ఖర్గే పార్టీది. అందువల్ల కమిటీ వారు సమస్యను ఆ పార్టీ దృష్టికి తీసుకుపోరాదని అనటం లేదు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష పాత్ర తప్పదు. కానీ, కాంగ్రెస్ పార్టీ ఒకవైపు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి కాల్పుల విరమణకు ప్రయత్నిస్తూనే, మరొకవైపు అసలు నక్సలిజానికి కారణాలు? తాము పాలించిన దశాబ్దాల కాలంలో వాటి పరిష్కారానికి చేసిన ప్రయత్నాలు? వాటి నికర ఫలితాలు? ఆ ఉద్యమం అణచివేతకు స్వయంగా తాము తీసుకున్న చర్యలు 'ఆపరేషన్ కగార్'కు ఏ విధంగా భిన్నమైనవి? నక్సలిజం సమస్య పరిష్కారానికి తమతో పాటు తమ 'ఇండియా' కూటమి మిత్రుల సమగ్రమైన విధానం ఏమిటి? దానిని తాము పాలిస్తున్న రాష్ట్రాలలో అమలుపరచగలరా? ఒకవేళ భవిష్యత్తులో కేంద్రంలో అధికారానికి వచ్చినట్టయితే ఆ విధానం కొనసాగించగలరా? ప్రస్తుతానికి మోదీ ప్రభుత్వానికి ఆ కోణం నుంచి చేయగల ప్రతిపాదనలేమిటి? అనేవి కూడా చర్చించి ఒక విధానం రూపొందించి, ఆదివాసీలకు, తక్కిన దేశానికి వివరించటం అవసరం. అప్పుడు, కాంగ్రెస్ పార్టీ వెనుకటి రికార్డు ఎట్లున్నా, భవిష్యత్తు గురించి, వారి విధానాలపై, నిజాయితీపై దేశం చర్చించి అర్థం చేసుకునేందుకు, వారిని నమ్మాలో లేదో తేల్చుకునేందుకు వీలు కలుగుతుంది. లేనట్టయితే, ఏఐసీసీ అధ్యక్షుడు అనేకానేక ఇతర విషయాలలో వలెనే ఈ కమిటీ అంశంలో నూ కేంద్ర ప్రభుత్వానికి ఒక మొక్కుబడి లేఖ రా సి చేతులు దులుపుకోవటం అవుతుంది. ఇంత కూ కమిటీ వారు ఆయనకు నేరుగా కాక బహిరంగ లేఖ రాసినందున, అది ఆయన పట్టించుకునేది లేనిదీ తెలియదు. లేక, కమిటీ వారు ఆ లేఖ ను తనకు నేరుగా కూడా పంపుతారేమో తెలియ దు. అదెట్లా జరిగినా, పైన అనుకున్నట్టు, కాంగ్రెస్ నాయకత్వం ప్రభుత్వ నాయకత్వానికి లేఖ రాస్తూనే, పైన పేర్కొన్న విధానపరమైన స్పష్టతలు ఇవ్వటం అవసరం. లేనట్టయితే, తాము రాష్ట్రాల లో, కేంద్రంలో పాలించిన ప్రతిసారీ ఆదివాసీల పీడన, అణచివేత కొనసాగినట్టు, ముమ్ముందు కూ డా ఆ పనిచేయబోరన్న కనీసపు ఆశాభావమైనా ఆదివాసీలకు, తక్కిన సమాజానికి కలుగబోదు. కాల్పుల విరమణ, శాంతి చర్చల ప్రయత్నాలలో కొట్టవచ్చినట్టు కనిపిస్తున్న కొరత ఒకటున్నది. ఇందులో స్వయంగా ఆదివాసీ సంఘాలు, ప్రజా ప్రతినిధులు, ఇతర ప్రముఖుల పేర్లు కనిపించటం లేదు. వారి కోసం కృషిచేసే మైదాన ప్రాంతాల వారు మాత్రం అనేకులున్నారు. ప్రస్తుత కో ఆర్డినేషన్ కమిటీ ఆదివాసీ గ్రూపులు, ఆదివాసీ నేతలు అంటూ మాట్లాడటం బాగున్నది గాని, ఆ లేఖ సంతకందార్లలో ఆదివాసీలు కనిపించరు. ఇతరత్రా స్వయంగా ఆదివాసీలు కొన్ని చిన్న బృందాలుగా ఏర్పడి ఈ చర్చలలో పాల్గొంటున్నారు. అది ఆహ్వానించదగినది. కానీ, అవి ప్రాచుర్యం లేని చిన్న గ్రూపులు అయినందున ఎవరి దృష్టికి రావటం లేదు. మావోయిస్టు పార్టీ తనదే సర్వాధిపత్యం అనుకుంటుంది గనుక, ఆదివాసీలను అనుచరులుగా మాత్రమే చూస్తుంది గనుక, తమ అనుబంధ పౌరహక్కుల సంస్థలలోనూ వారిని ముందుకు తీసుకురాకపోవటాన్ని అర్థం చేసుకోవచ్చు. కానీ, మైదాన ప్రాంత మేధావులు కూడా ప్రస్తుత కో ఆర్డినేషన్ కమిటీ తరహాలో వారికి చోటు కల్పించరు. కాల్పుల విరమణ, శాంతి చర్చల ప్రయత్నాలలో కొట్టవచ్చినట్టు కనిపిస్తున్న కొరత ఒకటున్నది. ఇందులో స్వయంగా ఆదివాసీ సంఘాలు, ప్రజా ప్రతినిధులు, ఇతర ప్రముఖుల పేర్లు కనిపించటం లేదు. మరొక స్థాయిలో మాట్లాడాలంటే, ఆదివాసీ సమాజాలకు చెందిన ప్రజాప్రతినిధులు, విద్యావంతులు, ఎంతో కొంత సంపన్నులు అయినవారి సంఖ్య తక్కువేమీ కాదు. నక్సలిజం, దాని అణచివేతలు మొదలై సాగుతున్న ఐదున్నర దశాబ్దాల కాలంలో తమ సమాజాన్ని కాపాడుకునేందుకు వారు చేసినదేమిటనేది వేరే విషాద చరిత్ర. అదే స్థితి 'ఆపరేషన్ కగార్' సందర్భంలోనూ కనిపిస్తున్నది. ఎప్పుడూ వినిపించని ఆదివాసుల గొంతు ఇప్పుడూ వినిపించటం లేదు. ఎవరూ వినిపించనివ్వటం లేదు. అందరికీ వారు ఒక ఇంధనం మాత్రమే. ఇంతకూ మావోయిస్టు పార్టీ కాల్పుల విరమణను కోరుతున్నది ఎందుకోసం? ప్రస్తుతం తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్నందున ఈ గండం గడిచి గట్టెక్కేందుకా లేక, ఒకవేళ మోదీ ప్రభుత్వం నిజంగానే కాల్పులు విరమించి చర్చలకు ఆహ్వానిస్తే భవిష్యత్తుకు సంబంధించి అజెండా ఏమైనా ఉన్నదా? తమ అజెండా రాజ్యాంగపరమైన పరిపాలన, సంస్కరణల పరిధిలో ఉండి అందుకు ప్రభుత్వం అంగీకరిస్తే ఉద్యమ విరమణగా ముగుస్తుందా? ఆయుధాలను వదలటమవుతుందా? ప్రజాస్వామ్య వ్యవస్థలో ఆయుధాలకు తావులేదన్న వాదన ప్రభుత్వం నుంచి వస్తే ఏం చేస్తారు? అట్లాగాక, తమ అజెండాలో ప్రస్తుత రాజ్యాంగాన్నీ, వ్యవస్తనూ అంగీకరించబోము, కనుక ఆయుధ విరమణ ఉండదు, కాల్పుల విరమణ మాత్రమే అన్నది అజెండా అవుతుందా? ప్రస్తుతం తమ వైపు నుంచి ఆరు నెలలు ప్రకటించింది కాల్పుల విరమణే గాని ఆయుధాలు పక్కనపెట్టడం కాదు, విసర్జించటమూ కాదు. అటువంటి స్థితిలో, ప్రస్తుతం పూర్తి పైచేయిగా ఉన్న ప్రభుత్వం కాల్పుల విరమణకు ఎందుకు అంగీకరిస్తుందసలు? పోరాట విరమణ జరుగదు, కాల్పుల విరమణ మాత్రమే అంటే అమిత్ షా ఒప్పుకొంటారా? రాజ్యాంగం, చట్టాల అమలు గురించి మాట్లాడటం ఒక పరిధి విషయం. అది ఎవరు ఎంతైనా మాట్లాడవచ్చు. కానీ రాజ్యాంగాన్ని, వ్యవస్థను నిరాకరించటమనే సిద్ధాంతం మౌలికంగా భిన్నమైనది. ఆ విషయమై ఏమి మాట్లాడుతారు? మేము నిరాకరిస్తాము, మీరు మాత్రం కట్టుబడండి అంటూ చేసే సూత్రీకరణలు మేధోపరంగా బాగానే ఉంటాయి. కాని వారే అనే 'బూర్జువా, దోపిడీ వ్యవస్థ' అందుకు అంగీకరిస్తుందనుకోవటం, ఆ ప్రకారం రకరకాల చతురమైన తార్కిక వాదనలు చేయటం పూర్తి అవాస్తవికమైన బలహీనత. ముందు కాల్పులు విరమించండి, రాజ్యాంగ విషయాలు, ఇతర విషయాలు తర్వాత కూర్చుని మాట్లాడుకోవచ్చుననటం తమ అమాయకత్వమైనా కావాలి, హోంమంత్రి అమిత్ షా అమాయకుడని భావించటమైనా కావాలి. పైగా ప్రభుత్వంతో తాము సమాన స్కంధ స్థితిలో ఉన్నామనే అవాస్తవిక, స్వీయ భ్రమాత్మక ధోరణి కూడా మావోయిస్టుల ప్రకటనలలో కనిపిస్తున్నది. అటువంటి టేబుల్ కేంద్రం- నాగాల చర్చల వంటి సందర్భాలలో చూశాం. రాజశేఖరరెడ్డి ప్రభుత్వ కాలంలో చూశాం. ప్రస్తుతం పరిస్థితి మోదీ పాలనలో పలు విధాలుగా మారింది. పార్టీ కూడా అనేక విధాలుగా బలహీనపడింది. కనుక సమాన స్కంధత లేదు. మరొకవైపు ఆదివాసీల సమస్య తీవ్రత మారలేదు. వారి సమస్యలు, పార్టీ వైఫల్యాలు, కేంద్రం తీవ్ర వైఖరి అనే మూడింటి మధ్య చిక్కుకొని ఆదివాసీలు అనునిత్యం



బలవుతున్నారు. వ్యవస్థకు బలి కావటం ఒకటైతే, కనీసం ఇటీవలి సంవత్సరాల విఫల ఉద్యమానికి బలి కావటం మరొకటిగా ఉంది. కో ఆర్డినేషన్ కమిటీ తన లేఖలో, ఆదివాసీలను చర్చల్లో భాగస్వాములు చేయాలనే ప్రతిపాదనను తెచ్చి మంచిపని చేసింది. కాల్పుల విరమణ ఒక కోణమైతే, అంతకన్న అనేక రెట్లు ముఖ్యంగా, ఆదివాసీలు సంఘాలు, ప్రజాప్రతినిధులు, ఇతర ముఖ్యులు, వారికోసం కృషిచేస్తున్న మైదాన ప్రాంతాల ప్రముఖులూ మావోయిస్టు పార్టీకి సమాంతరంగా సమస్యలపై విడిగా ఒక అజెండాను, ఒక ఉమ్మడి బలమైన వేదికను రూపొందించుకొని గరిష్ఠ స్థాయిలో సాధించుకునేందుకు ప్రయత్నించగలిగితే ఉపయోగం ఉండగలదు. నక్సలైట్ ఉద్యమం ఒక దశ వరకు తన పోరాటాల ఒత్తిడితో ప్రభుత్వాల నుంచి ప్రజల కోసం ప్రత్యక్షంగా, పరోక్షంగా తగినన్ని సాధించిన మాట నిజం. కానీ, వివిధ కారణాల వల్ల ఆ దశ గడిచిపోయిందని గుర్తించాలి.

# దశలవారీగా సింగల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలు

- : సింగల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలి

- : మన ఇల్లు, కార్యాలయాలు, పాఠశాలలు, గ్రామాలు, పట్టణాలు, ఆవరణలు ప్రతి ఒక్కటి స్వచ్ఛంగా పెట్టుకోవాలి

- : ఉపాధి హామీ పథకం పనుల్లో పురోగతి చూపించాలి

- : జి.ఎస్.డబ్ల్యు.ఎస్ అంశాలకు సంబంధించి పెండింగ్ వేగంగా పూర్తి చేయాలి

- : వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్






అనంతపురం,(**కదిలించే వార్త) మే 13:** జిల్లాలో దశలవారీగా సింగల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలు చేయడం జరుగుతోందని, ఈ విషయమై క్షేత్రస్థాయిలో ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి జి.ఎస్.డబ్ల్యు.ఎస్, ఉపాధి హామీ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్, తదితర అంశాలపై డీపీఓ, డ్వామా పిడి, జడ్పి సిఈఓ, ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్ లు, డివిల్డివోలు, డిఎల్పిఓలు, ఈఓఆర్డీలు, ఆర్డబ్ల్యూఎస్, పబ్లిక్ హెల్త్ ఇంజనీర్లు, తదితర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గత మూడు నెలల నుంచి స్వచ్ఛత కార్యక్రమాలు చేపడుతున్నామని, విలువైన పనులను ఈ కార్యక్రమాల కింద చేపట్టాలన్నారు. ప్రజల్లో మార్పు తీసుకురావాలని, స్వచ్ఛత అనేది మనం అనుకున్నట్లు జరగాలని, మన ఇల్లు, కార్యాలయాలు, పాఠశాలలు, గ్రామాలు, పట్టణాలు, ఆవరణలు ప్రతి ఒక్కటి స్వచ్ఛంగా పెట్టుకోవాలన్నారు. ఈనెల 17వ తేదీన బీట్ ద హీట్ అనే కార్యక్రమాన్ని నిర్వహించాలని, ఈ విషయమై డిపిఓ మానిటర్ చేయాలన్నారు. నగరపాలక సంస్థ, ఐదు మున్సిపాలిటీల పరిధిలో ప్రతిరోజు ఉదయం 6 గంటల నుంచి ఇంటింటి చెత్త సేకరణ జరగాలన్నారు. క్షేత్రస్థాయిలో చెత్త సేకరణ సరిగా చేయడం లేదని రకరకాల ఫిర్యాదులు వస్తున్నాయని, ఇందుకు సంబంధించి పట్టణ ప్రాంతాలలో వార్డు శానిటేషన్ సెక్రటరీ, గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ సెక్రటరీలు బాధ్యత వహించాలన్నారు. ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు ఇంటింటి చెత్త సేకరణ జరగాలని, ఇందుకు సరిపడా మనుషులు ఉండాలని, హౌస్ హోల్డ్ కి సరిపడా మనుషులు ఉన్నారా లేదా అనేది చూసుకోవాలని, సచివాలయం వారిగా చెత్త సేకరణకు సంబంధించి కార్యాచరణ ప్రణాళిక ఇవ్వాలని, చెత్తను తరలించేందుకు సరిపడా వాహనాలు కూడా ఉండాలని, గార్బేజ్ క్లియరెన్స్ చేయాలని ఆదేశించారు. సింగల్ యూజ్ ప్లాస్టిక్ ని నిషేధించడం జరిగిందని, దానిని దశలవారీగా అమలు చేయాలని, ప్రజల్లో అవగాహన కల్పించాలని, దుకాణాల వద్ద తడి, పొడి చెత్త డస్ట్ బిన్ లను పెట్టాలని, పెట్టని వారికి నోటీసులు ఇవ్వాలని, క్షేత్రస్థాయిలో తనిఖీలు చేసి జరిమానాలు వసూలు చేయాలన్నారు. పారిశుద్ధ్య సిబ్బందికి అవసరమైన సేఫ్టీ మెజర్స్, మెటీరియల్ ఇవ్వాలని సూచించారు. జి.ఎస్.డబ్ల్యు.ఎస్ అంశాలకు సంబంధించి పెండింగ్ వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. మనమిత్ర క్యాంపెయిన్ లక్ష్యం పూర్తి చేయాలని, సిటిజన్ ఈకేవైసీ, పీపుల్ వర్కింగ్ ఫ్రమ్ హోమ్, ఆధార్ సీడింగ్ ఫర్ వాహన్ డేటా, డెత్ మార్క్ సిటిజన్స్, మిస్సింగ్ సిటిజన్స్ ఇన్ హౌస్ హోల్డ్, ఏపీ సేవ, స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్స్, తదితర అంశాలకు సంబంధించి పెండింగ్ ను ఎప్పటికప్పుడు పూర్తి చేయడంపై దృష్టి పెట్టాలన్నారు. ఉపాధి హామీ పనులకు సంబంధించి వేసవి మంచి పనులు జరిగే కాలమని, ఉపాధి పనులను విరివిగా చేపట్టాలన్నారు. వ్యక్తిగత సోక్ పిట్లు, కమ్యూనిటీ సోక్ పిట్ లకి సంబంధించి పూర్తిస్థాయిలో గ్రౌండింగ్ చేసి పెండింగ్ ని త్వరితగతిన చేపట్టాలన్నారు. ఖాళీలు లేకుండా ఫీల్డ్ అసిస్టెంట్లను వెంటనే నియమించాలన్నారు. వాటర్ కన్జర్వేషన్ స్ట్రక్చర్స్ లో పురోగతి తీసుకురావాలని ఆదేశించారు. అన్ని మున్సిపాలిటీలలో వార్డులకనుగుణంగా అన్ని చోట్ల చలివేంద్రాలను ఖచ్చితంగా ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం వాట్సప్ మనమిత్ర, ప్రజల చేతిలో ప్రభుత్వం క్యూఆర్ కోడ్ స్టాండీస్ ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డిపిఓ నాగరాజు నాయుడు, జెడ్పి సీఈవో రామచంద్రారెడ్డి, డ్వామా పిడి సలీమ్ భాష, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్, డా.ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ డా.కిరణ్ కుమార్ రెడ్డి, పిజిఆర్ఎస్ తహసిల్దార్ వాణిశ్రీ, జి.ఎస్.డబ్ల్యు.ఎస్ కోఆర్డినేటర్ ధనుంజయ్, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ మునిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర గవర్నర్, కేంద్ర రైల్వే శాఖ మంత్రి, స్పీకర్, విద్యాశాఖ మంత్రి

# జిల్లా పర్యటన కోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

ప్రోటోకాల్ ఏర్పాట్లు జాగ్రత్తగా ఉండాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి



అనంతపురం, (**కదిలించే వార్త) మే 13:** రాష్ట్ర గవర్నర్, కేంద్ర రైల్వే శాఖ మంత్రి, శాసనసభ స్పీకర్, రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ మంత్రి, తదితరులు అనంతపురం జిల్లా పర్యటనకు రానున్నారని, ఇందుకోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ ఆదేశించారు. మంగళవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, కేంద్ర రైల్వే శాఖ మంత్రి సోమన్న, రాష్ట్ర శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ మరియు మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్, తదితరుల జిల్లా పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై ఆయా శాఖల జిల్లా అధికారులు, జేఎన్టీయూ విసి, ఇతర మండల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 17వ తేదీన రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ జేఎన్టీయూ స్నాతకోత్సవం కార్యక్రమంలో పాల్గొంటారని, ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేపట్టాలన్నారు. గవర్నర్ 17వ తేదీన ఉదయం రైలు ద్వారా అనంతపురం చేరుకుంటారని, అనంతరం జేఎన్టీయూ స్నాతకోత్సవం కార్యక్రమంలో పాల్గొని అదే రోజు సాయంత్రం గంటలకు రైలు ద్వారా బయలుదేరి వెళ్తారన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి ఓవరాల్ ఇన్చార్జిగా జాయింట్ కలెక్టర్ ఉంటారన్నారు. గవర్నర్ పర్యటన సందర్భంగా అధికారుల టీం, వాహనాలు, లైజెన్ అధికారులు ఉండాలని, వాహనాల కాన్వాయ్ లో అంబులెన్స్ ఉండాలని, భోజన ఏర్పాట్లు జాగ్రత్తగా చేయాలన్నారు. జేఎన్టీయూలో డయాస్ ప్రణాళిక ప్రకారం జరగాలని, 16వ తేదీన డ్రస్ రిహార్సల్స్ చేయాలని, అడ్వాన్సుడ్ సెక్యూరిటీ లైయిజన్ (ఏఎస్ఎల్) కార్యక్రమం నిర్వహించాలన్నారు. సెక్యూరిటీ ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఈనెల 15, 16, 17 వ తేదీలలో రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ మరియు మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ జిల్లాలో పర్యటించనున్నారని, ఇందుకోసం అన్ని ఏర్పాట్లను జాగ్రత్తగా చేపట్టాలన్నారు. 15వ తేదీన మధ్యాహ్నం హెలికాప్టర్ ద్వారా గుత్తి పట్టణంలో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్ కు మంత్రి చేరుకుంటారని, అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొని అదేరోజు రాత్రికి గుత్తి మండలం బేతపల్లి గ్రామంలో బస చేస్తారన్నారు. 16వ తేదీన ఉదయం 10 గంటలకు గుత్తి మండలం బేతపల్లి గ్రామం వద్ద రెన్యూ విండ్ ఎనర్జీ (జెఎఎంబి) ప్రైవేట్ లిమిటెడ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి పాల్గొని, అదే రోజు అనంతపురంలో ఒక వివాహ కార్యక్రమానికి హాజరవుతారన్నారు. మంత్రి పర్యటనకు సంబంధించి పోలీస్ బందోబస్తు పటిష్టంగా ఏర్పాటు చేయాలని, అన్ని చోట్ల పూర్తిస్థాయి ప్రణాళికతో ఏర్పాట్లు చేయాలని, అధికారుల మధ్య సమన్వయం, సమాచారం ఉండాలన్నారు. అలాగే 16వ తేదీన కేంద్ర రైల్వే శాఖ మంత్రి సోమన్న, రాష్ట్ర శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, తదితరులు జిల్లా పర్యటనకు రానున్నారని, ఈ కార్యక్రమాలకు సంబంధించి ప్రోటోకాల్ అరేంజ్మెంట్లు పటిష్టంగా చేయాలన్నారు. ఒక్కొక్కరికి ఒక టీం ఏర్పాటు చేయాలని, రాష్ట్ర గవర్నర్, విద్యాశాఖ మంత్రికి సంబంధించిన వాహనాలు ఏర్పాటు, విఐపి సెక్యూరిటీ ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని ఆదేశించారు. గుత్తిలో జరిగే కార్యక్రమానికి సంబంధించి గుంతకల్ ఆర్డీవో ఇన్చార్జిగా ఉంటారని, ఎమ్మెల్యే కూతురు వివాహానికి సంబంధించి అనంతపురం ఆర్డీవో ఇన్చార్జిగా ఉంటారని, జేఎన్టీయూ కార్యక్రమానికి సంబంధించి హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్డిసి మల్లికార్జునుడు ఇన్చార్జిగా ఉంటారని, ఆర్.అండ్.బి గెస్ట్ హౌస్ దగ్గర ఏర్పాట్లకు సంబంధించి హెచ్.ఎల్.సి ఎస్డిసి రామ్మోహన్ ఇన్చార్జిగా ఉంటారన్నారు. విఐపిల జిల్లా పర్యటనకు సంబంధించి అన్ని విధాల సిద్ధం కావాలని, ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డిఆర్ఓ ఏ.మాలోల, ఆర్డిఓ కేశవ నాయుడు, టౌన్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ శేషాద్రి శేఖర్, కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ యుగేశ్వరి దేవి, తహసీల్దార్ హరిప్రసాద్, నెడ్క్యాప్ డీఎం, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## వినాయక చవితి వేడుకల నిర్వహణకు

# ముందస్తు సన్నాహాలు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి..

ప్రశాంతంగా భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను నిర్వహించుకోవాలి

జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్



పుట్టపర్తి, (**కదిలించే వార్త) మే 13:** జిల్లాలోని వివిధ ప్రాంతాలలో రానున్న వినాయక చవితి ఉత్సవ వేడుకలను నిర్వహణకు సంబంధించి ముందస్తు సన్నాహాలు ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులను ఆదేశించారు. అలాగే జిల్లా ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో ఉత్సవాలనునిర్వహించుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో డిఆర్ఓ విజయ సారథి తో కలిసి కదిరి ప్రాంతానికి చెందిన గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో పలు శాఖ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి పలు ఆదేశాలు,సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాదిలో రానున్న వినాయక చవితి వేడుకలు ప్రస్తుతం దేశంలో ఉన్న పరిస్థితులను గుర్తించి సామరస్యంగా ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో గణేష్ ఉత్సవ పండుగను జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాల నిర్వహణలో భాగంగా ముందస్తు ప్రణాళికను రూపొందించుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు మరియు కదిరి గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులకు జాయింట్ కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా ప్రస్తుత తరుణంలో విగ్రహాలను తయారు చేయు సందర్భంగా తయారీదారులు రసాయనిక కార్బన్ రహిత విగ్రహాలను తయారు చేయాలని, విగ్రహాల ఎత్తును కూడా తగిన మోతాదులో చిన్నగా రూపొందించాలని సూచించారు. ఈ అంశంపై ప్రత్యేక పర్యవేక్షణ చేయాల్సి ఉంటుందన్నారు. కదిరి పట్టణంలో వినాయక చవితి పందిళ్లు ( మండపాలు ) వేసే ముందు మున్సిపల్, పోలీసు, అగ్ని మాపక శాఖ,అనుమతిని కచ్చితంగా తీసుకోవాలని అన్నారు. మరి ముఖ్యంగా శాంతి భద్రతలకు ఎలాంటి ఆటంకాలు ఇతర సమస్యలు లేకుండా పటిష్ట పోలీసు బందోబస్తు చేపట్టాలని దీనికై జిల్లాపోలీసు యంత్రాంగం మార్గదర్శకాలు రూపొందించి వాటిని కచ్చితంగా అమలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. కదిరి గణేష్ ఉత్సవ కమిటీ నిర్ణయం మేరకు నిమజ్జం చేసేలా అధికారులు ఆయా శాఖల ద్వారా సమన్వయ సహకారాలు అందించాలని ఆదేశించారు. వినాయకుని మట్టి విగ్రహం తక్కువ అడుగుల వరకు ఏర్పాటు చేసుకోవచ్చునని, అనువైన ప్రాంతాలలో నీటితో నిమజ్జనం చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వేడుకలలో పాల్గొనే ప్రజలు సురక్షితంగా మరియు సంతోషంగా పండుగ జరుపుకోవడానికి అన్ని జాగ్రత్త చర్యలు పాటించాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. వినాయక మందిరాలు ఏర్పాటు చేసే ప్రాంతాలలో నిరంతర విద్యుత్ సరఫరా, త్రాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్య పనులు, వైద్య సేవలు తదితర అంశాలపై దృష్టిని సారించాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. భక్త జనులు కూడా ఉత్సవాల సమయంలో ఎలాంటి గందరగోళానికి గురికాకుండా సమస్యలకు తావివ్వకుండా జిల్లా ప్రభుత్వ యంత్రాంగానికి మరియు పోలీసుల మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని తెలిపారు. పోలీసు యంత్రాంగం తరఫున రూట్ మ్యాప్ సిద్ధం చేసుకుని అదే దారిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ నియంత్రణ మెరుగ్గా చేయడానికి చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ప్రజలకు ఏదైనా సహాయం కోసం పోలీసులు అందుబాటులో ఉండే విధంగా సమాచార కేంద్రంతో పాటు ఒక టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చర్యలు తీసుకొని ప్రజలకు పత్రిక ప్రకటన ద్వారా తెలియజేయాలని సూచించారు. ప్రజలు గణేశుడిని పూజించడానికి వినాయక చవితి సమయంలో చాలామంది రద్దీగా వెళ్తుంటారని అలాంటి సమయంలో ఎలాంటి లోటుపాట్లకు తావివ్వకుండా గట్టి భద్రతా చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. ఆగస్టు మాసంలో జరగనున్న ఈ ఉత్సవ వేడుకలకు ఇప్పటినుండే ముందస్తు ప్రణాళిక ఏర్పాట్ల చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రధానంగా ఊరేగింపులలో బాణాసంచా, డీజే లకు అనుమతి మరియు నిమజ్జాల సమయంలో జాగ్రత్తలు, పర్యావరణ కాలుష్యం లేకుండా ప్రతి ఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలను ఏర్పాటు చేసుకోవాలనే అంశాలపై ప్రత్యేక చొరవ శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. గణేష్ ఉత్సవ వేడుకలలో శాఖా పరమైన విధులలోఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని అధికారులను ఆదేశించారు. వరుస క్రమంలో నిర్దేశించిన రూట్ వారీ గా హిందూపురం క్రాస్ నుంచి తూర్పు మాడ వీధుల మీదుగా తేరు బజారు వరకు జరిగే ఊరేగింపులో సాంప్రదాయ బద్ధంగా ప్రశాంత వాతావరణంలో ఆయా నీటి చెరువులు కెనాలలో నిమజ్జనం చేసుకోవాలని కదిరి గణేష్ ఉత్సవ కమిటీ సూచించిన అంశాలను సాఫీగా అమలయ్యే విధంగా ప్రభుత్వ శాఖ అధికారులు పనిచేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో కదిరి ఆర్డిఓ వి.వి. ఎస్. శర్మ, ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్. సి. సంపత్ కుమార్,మున్సిపల్ కమిషనర్ కదిరి తాసిల్దార్ మురళీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్, డిప్యూటీ డి ఎం హెచ్ ఓడా. నాగేంద్ర నాయక్ జిల్లా విపత్తు నివారణ శాఖ అధికారి హేమంత్ రెడ్డి, అడిషనల్ డీఎంహెచ్ ఓ డా. నాయక్, ఇరిగేషన్ ఏఈ సుధాకర్ రాజు, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ నరసింహారాజు, కదిరి ఉత్సవ కమిటీ చైర్మన్ నాగేంద్రప్రసాద్, సభ్యులు వేణుగోపాల్ రెడ్డి శేషగిరి చంద్రశేఖర్, జిల్లా పర్యాటక శాఖ మేనేజర్ ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దండకారణ్యంలో కార్పొరేట్ యుద్ధం

'మావోయిస్టులపై అంతిమ యుద్ధం' అంటూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 'ఆపరేషన్ కగార్'ను చేపట్టింది. అడవంతా పోలీసు క్యాంపులతో నింపేసింది. వేలాది పారామిలటరీ బలగాలు, గ్రేహౌండ్స్ దళాలతో దండకారణ్యాన్ని కొన్ని రోజులుగా జల్లెడ పడుతున్నది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఆయుధాలతో అడవి అణువణువునూ శోధిస్తున్నది. ఆదివాసీ గూడేలను తగలబెడుతున్నది. నిర్దాక్షిణ్యంగా ఎన్‌కౌంటర్ పేరిట పచ్చని అడవిలో నెత్తురుటేర్లను పారిస్తున్నది. మావోయిస్టులను.. అమాయక ఆదివాసీ తెగలను ఊచకోత కోస్తున్నది. మారణహోమాన్ని సృష్టిస్తున్నది. మానవహక్కుల హననానికి పాల్పడుతున్నది. హింసతో, అణచివేతతో అడవిలో కల్లోలం రేపుతున్న ˇతేడాది జనవరిలో ప్రారంభమైన ఆపరేషన్ కగార్‌లో అధికారిక లెక్కల ప్రకారమే దాదాపు 500 మందికి పైగా మావోయిస్టులు హతమయ్యారంటే ఎంతటి భీతావహ పరిస్థితి నెలకొన్నదో అర్థం చేసుకోవచ్చు. మానవ హక్కుల ఉల్లంఘన ఏ తీరుగా సాగుతున్నదో ఒక అంచనాకు రావచ్చు. మరోవైపు దండకారణ్యంలో శాంతియుత వాతావరణం నెలకొల్పాలని, ఆదివాసులపై జరుగుతున్న దాడిని నిలిపివేయాలని, మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరపాలని తెలంగాణ పౌరసమాజం నుంచి అంతే స్థాయిలో డిమాండ్ పెల్లుబుకుతున్నది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రజతోత్సవ సభలో లక్షలాది జనం సాక్షిగా వేదికపై నుంచి పిలుపునివ్వడంతో రాజకీయవర్గాల్లోనూ ఒక కదలిక ప్రారంభమైంది. కానీ, కేంద్రం మాత్రం మావోయిస్టు నిర్మూలనే కాదు, అడవిలో మానవ మాత్రుడు ఉండకూడదనే ధ్యేయంతోనే ముందుకు సాగుతున్నట్టుగా స్పష్టంగా తెలిసిపోతున్నది. ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతున్నది. మరింతకీ ఈ మావోయిస్టులు ఎవరు? ఎక్కడినుంచి వచ్చారు? అడవుల్లో ఎందుకు మగ్గుతున్నారు? ఆయుధాలు ఎందుకు చేపట్టారు? ఆదివాసులతో వారికి అనుబంధమెక్కడది? వారికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకున్న వైరమేమిటి? స్వజాతి జనులపై ఎందుకోసం.. ఎవరికోసం ఈ హింస? ఎవరి వికాసానికీ రక్తపాతం? ఆపరేషన్ కగార్ ఆంతర్యమేంటి? ఎవరికి లాభం? మరెవరికి నష్టం? అనే మౌలిక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వాటికి జవాబులు కూడా సుస్పష్టం. మావోయిస్టులు దిగంతాల నుంచి ఊడిపడలేదు. శత్రుదేశాల నుంచి వచ్చిన చొరబాటుదారులు కాదు. ఈ భారతావని బిడ్డలే. మన సోదరీ సోదరులే. ప్రభుత్వాలకు, వాళ్లకు, మనకు మధ్య ఉన్నది కేవలం సిద్ధాంత వైరుధ్యమే. అది శాంతిభద్రతల సమస్య కాదు. ఒక రాజకీయ ఉద్యమం. దశాబ్దాలుగా కొనసాగుతున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ వివక్షే దానికి కారణం. సూటిగా చెప్పాలంటే భారత రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల అమలు కోసం ఒక వర్గం తరాలుగా సాగిస్తున్న సాయుధ పోరాటం. బిర్సా ముండా, కుమ్రంభీమ్‌ల ఆశయాల ప్రతిరూపమే నూతన ప్రజాస్వామిక విప్లవం. మరెందుకు మావోయిస్టులపై ఈ ప్రభుత్వాల యుద్ధం అంటారా? దండకారణ్యం గర్భంలో దాగిన లక్షల కోట్ల విలువైన ఖనిజ సంపద కోసం. దశాబ్దాల కిందటనే మైనింగ్ మొదలైనా అదింకా దండకారణ్యమంతటికీ విస్తరించలేదు. అందుకు ప్రధాన కారణం దండకారణ్యాన్ని పొదివి పట్టుకున్న ఆదివాసీలు. ఆ అడవిబిడ్డలకు అండగా నిలుస్తున్న మావోయిస్టులు. అందుకే ఖనిజ సంపద దోపిడీకి ఏ అడ్డు లేకుండా చేసుకునేందుకు కార్పొరేట్‌శక్తులు, వాటి అడుగులకు మడుగులొత్తుతున్న కేంద్ర ప్రభుత్వ పాలకులు ఆ ఆదివాసీలను, మావోయిస్టుల ఏరివేతకే కుట్రపూరిత ప్రణాళికలను సైతం దశాబ్దాల కిందటే తెరలేపారు. ప్రపంచంలోనే అపారమైన, అత్యంత అరుదైన ఖనిజ నిల్వలున్న చిరునామా మన భారతదేశం. అందులోనూ ప్రధానంగా దండకారణ్య ప్రాంతం. మన దేశంలో అటవీ విస్తీర్ణం 2.29 మిలియన్ చ.కి.మీ. ఆ మొత్తం విస్తీర్ణంలో మధ్య భారతంలోని దండకారణ్యం 9.60 శాతం. ఇక ఆంధ్రప్రదేశ్, ఒడిశా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఝార?ండ్, పశ్చిమబెంగాల్ తదితర అతిపెద్ద రాష్ట్రాల్లో లక్షలాది చదరపు కిలోమీటర్ల పరిధిలో దండకారణ్యం విస్తరించి ఉన్నది. తెలంగాణ ప్రాంతంలో ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాలు, ఏపీలో తూర్పు గోదావరి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం ఆ పరిధిలోకి వస్తాయి. ఈ అటవీక్షేత్రం లక్షల కోట్ల విలువైన ఖనిజ నిక్షేపాల నిలయం. ఈ దేశ జాతి సంపద. దాని విలువ దశాబ్దకాలం కిందటనే రూ.9 వేల లక్షల కోట్లని ఒక ప్రాథమిక అంచనా. ఇప్పుడది అంతకు రెట్టింపు. ఆ ఖనిజ సంపదపై దశాబ్దాల కిందటనే సామ్రాజ్యవాదుల కన్ను పడింది. 1968లో జపాన్‌కు చెందిన బైలదిల్లా కంపెనీ మైనింగ్ ప్రారంభించి ఇనుప రజను కొల్లగొట్టడం మొదలుపెట్టింది. ఆ తర్వాత టాటా పోస్కో, ఎస్సార్ జిందాల్, రియో టింటో, బీహెచ్‌ఐ, మిట్టల్, వేదాంత రీసోర్సెస్ వంటి విదేశీ కార్పొరేట్ సంస్థలు జతకలిశాయి. ఇప్పుడు ఆ ఖనిజ సంపద దోపిడీకి అదానీ, అంబానీ తదితర దేశీయ కార్పొరేట్ శక్తులు క్యూ కట్టాయి. ఆయా కంపెనీలకు జాతి సంపదను గంపగుత్తగా దోచిపెట్టేందుకు ఢిల్లీ పెద్దలు ఒప్పందాలు చేసుకున్నారు, చేసుకుంటూనే ఉన్నారు. రాబోయే మూడు దశాబ్దాల్లోగా అక్కడి ఖనిజసంపద యావత్‌ను కొల్లగొట్టే లక్ష్యంతో బడా పారిశ్రామికవేత్తలు, వారి కనుసన్నల్లో నడుస్తున్న కేంద్రం ముందుకు సాగుతున్నట్టు స్పష్టంగా తెలిసిపోతున్నది. అదిప్పుడు మరింత విశ్వరూపం దాల్చింది. కాంగ్రెస్ హయాంలో 90వ దశకంలో జన జాగరణ్ పేరిట మొదలైన ఊచకోత ఆ తర్వాత 2005లో సల్వాజుడుంగా రూపాంతరం చెందింది. ఆపై గ్రీన్‌హంట్‌గా, ఆపరేషన్ సమాధాన్ పేరిట ముందుకువచ్చింది. ఇప్పుడు ఆపరేషన్ కగార్ పేరిట కేంద్రం ఏకంగా అంతిమయుద్ధం ప్రకటించింది. యుద్ధరీతులు మారాయేమో కానీ దమననీతి మాత్రం మారలేదు. రూపమేదైనా వాటి లక్ష్యం ఒక్కటే. మైనింగ్ విస్తరింత. అందుకే అడవి పొత్తిళ్ల నుంచి ఆదివాసీల తరిమివేత. మావోయిస్టుల ఏరివేత. అదిప్పుడు విశ్వరూపం దాల్చింది. కార్పొరేట్ శక్తుల కోసం సాగిస్తున్న ఆపరేషన్ కగార్‌ను ఆపాలని, శాంతిచర్చలకు తాము సిద్ధమని మావోయిస్టులు ఇప్పటికే ప్రకటించారు. ఆ శాంతి కోసం దేశ మేధావివర్గం కూడా గళం విప్పుతున్నది. తాజాగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రకటనతో రాజకీయవర్గాల్లోనూ కదలిక వచ్చింది. అయినప్పటికీ కేంద్రం మాత్రం శాంతిచర్చల ఊసే ఎత్తడం లేదు. ఈ నేపథ్యంలోనే దండకారణ్యంలో శాంతి కోసం ఇప్పుడు పౌర సమాజం కూడా డిమాండ్ చేయాలి. ఎందుకంటే ఆదివాసీల విస్థాపన తర్వాత.. మావోయిస్టులను ఏరివేశాక జరగబోయేది ప్రకృతి వినాశనమే. దండకారణ్యాన్ని ఛిద్రం చేయడమే. పోయేది అడవే కదా? అడవిబిడ్డలే కదా? అని అనుకుంటే అంతకంటే పొరపాటు మరొకటి ఉండదు. భారతదేశంలో ఎక్కడా లేని జీవ వైవిధ్యానికి ఆలవాలం దండకారణ్యం. అనేక నదుల జన్మస్థానం. విస్తారమైన వర్షపాతానికి మూలధారం. భూగర్భజలాల పెంపులోనూ ఈ పర్వతశ్రేణులే కీలకం. లక్షల ఏండ్ల పర్యావరణ సమతుల్యతకు కేంద్రం. మరి ఖనిజ వనరుల కోసం అడవిని నరికేసి, పర్వతాలను పిప్పిచేశాక మిగిలేదంతా క్షామం. అంతేనా మైనింగ్ వ్యర్థాలతో నీరు, గాలి కాలుష్యం. వెరసి అడవంచు గ్రామాల్లో మానవ మనుగడే ఒక ప్రశ్నార్థకం. ఇదేమీ ఊహాజనితం కాదు. అమెజాన్ అడవిని నాశనం చేసుకొని నేడు తీవ్ర కరువు, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్న బ్రెజిల్ దేశం ఓ సజీవ సాక్ష్యం. కరువు కాటకాలతో అల్లాడుతున్న ఆఫ్రికా ఖండంలో ఒక్కొక్క దేశం చరిత్ర చెప్తున్న సత్యం. మన దేశ నడిబొడ్డులో ఆ వినాశనం ఇప్పటికే మొదలైంది. అది క్రమంగా విశ్వరూపం దాల్చుతున్నది. అందుకే ఇప్పుడు శాంతికోసమే కాదు, భవిష్యత్తు తరాల భద్రత కోసమూ గళం విప్పాలి. కదం కదపాలి. అడవిని, ఆ అడవిని వెన్నంటి కాపాడుతున్న అడవి బిడ్డల పోరాటానికి బాసటగా నిలవాలి. అది అత్యావశ్యం. మరీ ముఖ్యంగా తెలంగాణ కర్తవ్యం. ఎందుకంటే రాష్ట్ర వరదాయినిగా నిలిచే గోదావరి జలాలకు ప్రాణాధారం. ప్రాణహిత జన్మస్థానం ఆ దండకారణ్యమే.

# మరో పోరాటానికి నాంది




ఉమ్మడి రాష్ట్ర పాలనలో తెలంగాణ సమాజం నాటి పాలకుల అలసత్వంతో అణచివేతకు గురైంది. కరువు– కాటకాలతో భూములు బీళ్లు వారడం, అతివృష్టి–అనావృష్టి, ఆకలి, అప్పులు, దారిద్ర్యం వెంటాడింది. మరోవైపు పంటకు కనీస గిట్టుబాటు ధర లేక రైతన్నలు ఆత్మహత్యలు చేసుకున్నారు. వందల మీటర్ల లోతు వరకు బోర్లు వేసినా, బావులు తవ్వినా నీటి చుక్క దొరకని దుస్థితి. తెలంగాణ ఎడారిని మరిపించింది. ఆంధ్రా వలసవాద పాలనలో మన బతుకులేమిటో, మన గమనం ఏమిటో తెలియని అయోమయ పరిస్థితి. ఈ నేపథ్యంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలను చూసి ఆవేదన చెంది ఒక వేగుచుక్కలాగా కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు వచ్చారు. తెలంగాణ భౌగోళిక, చారిత్రక, సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ అణచివేతలను వివిధ కోణాల్లో అధ్యయనం చేసి ఉద్యమ వ్యూహాలను రూపొందించుకోవడంలో ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపారు. చివరకు తన పదవులకు రాజీనామా చేసి 2001 ఏప్రిల్ 27న జలదృశ్యం వేదికగా టీఆర్ఎస్‌ను స్థాపించి, ప్రజలను ఉద్యమ పథంలో నడిపారు. చివరకు తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారు. తెలంగాణ ఏర్పాటు కోసం కేసీఆర్ ఎంత నిబద్ధతతో పని చేశారో.. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తెలంగాణ సమగ్ర అభివృద్ధి కోసం స్పష్టమైన ప్రణాళికతో అంతే నిబద్ధతతో కృషి చేశారు. ఒకనాడు ఆంధ్రా పాలకులు వ్యవసాయం దండగ అన్న చోటే వ్యవసాయాన్ని పండుగ చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిది. మిషన్ భగీరథ, 24 గంటల నాణ్యమైన నిరంతర విద్యుత్తు, ఐటీ, పారిశ్రామికరంగాల్లో వృద్ధి, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగాల కల్పన, కులవృత్తులకు చేయూత, ఆసరా పింఛన్లు అందజేశారు. దశాబ్దం పాటు కొనసాగిన కేసీఆర్ పాలనలో ప్రజల జీవన ప్రమాణాలు, తలసరి ఆదాయం గణనీయంగా పెరిగాయి. వినూత్న పథకాల ద్వారా ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పును తీసుకొచ్చారు. కానీ, గత దశాబ్ద కాలంగా జరిగిన అభివృద్ధి 16 నెలల కాంగ్రెస్ పాలనలో తిరోగమనం చెందడం బాధాకరం. శాంతియుతంగా సుదీర్ఘ కాలం పోరాటం చేసి, తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నమైన స్వరాష్ట్రాన్ని సాధించి, దశాబ్దం పాటు అధికారంలో ఉండి తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించిన బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవాలు జరుపుకొంటున్న వేళ దగాపడిన తెలంగాణ ప్రజలు మళ్లీ కేసీఆర్ వైపు ఆశగా ఎదురుచూస్తున్నారు. కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీల అమలు కోసం ఈ రజతోత్సవ సభ మరో పోరాటానికి నాంది పలుకనున్నది.

# పచ్చని పల్లెల్లో రాజకీయాల చిచ్చు



పల్లెటూరు అంటేనే ప్రకృతి సోయగాలు, అందమైన జీవితం, ఆనందాయక జీవనం, పరస్పర సహకారం, స్నేహబంధాలకు నిలయం. గడిచిన తరాల పల్లె ప్రజలు భేదాభిప్రాయాల కంటే బంధాలు, బంధుత్వాలకు ఎక్కువ విలువిచ్చేవారు. కానీ, రాను రాను కొన్ని పల్లెల్లో రాజకీయ పార్టీల జోక్యం ఎక్కువైంది. కొందరు నేతలు తమ స్వార్థం కోసం పల్లె ప్రజలను కులాలుగా, వర్గాలుగా విడగొడుతున్నారు. వారిలో వారికే చిచ్చుపెట్టి పగలు, ప్రతీకారాలతో కొట్టుకుచచ్చేలా చేస్తున్నారు. తద్వారా గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడేలా చేస్తున్నారు. పల్లె గడ్డపై రాజకీయ చిచ్చు నెమ్మదిగా వ్యాపించి, ఐక్యతను చీల్చే విషంలా మారి కల్మషమెరుగని మనుషుల మధ్య విద్వేషాన్ని పెంచుతున్నది. ప్రతి ఎన్నికతో పాటే పల్లెల్లో విభేదాలు, పగలు, ప్రతీకారాలు పెరుగుతున్నాయి. వర్గాలుగా విడిపోయిన ప్రజలు చిన్నచిన్న విషయాలపైనా గొడవ పడుతున్నారు. చివరికి ప్రాణాలు తీయటానికి కూడా వెనకాడని పరిస్థితికి వచ్చారు. ఒకే ఊరిలో రెండు వర్గాలు, రెండు ధ్వజాలు. ఒకే ఉత్సవానికి వేర్వేరు వేదికలు ఉండటం.. మిత్రులుగా ఉన్నవారు శత్రువులుగా, శత్రువులుగా ఉన్నవారు మిత్రులుగా మారడం చూస్తున్నాం. కొన్నిసార్లు బంధువులను కూడా బద్ధ శత్రువులుగా మారుస్తున్నాయి పల్లె రాజకీయాలు. చాలా చోట్ల గ్రామ పంచాయతీ సమావేశాలు అభివృద్ధి చర్చల కోసం కాకుండా పరస్పర ఆరోపణలకు అడ్డాగా మారుతున్నాయి. పంచాయతీ కార్యాలయం ఎదుట జరిగే సమావేశాల్లో అభివృద్ధి ప్రణాళికల గురించి కంటే పార్టీల గొడవలు, కార్యకర్తల కొట్లాటలు, ఎవరు ఏ పార్టీకి చెందినవారనే విషయాలే ప్రధానాంశాలు అవుతున్నాయి. పల్లెలో పార్టీకో పెద్ద రాజకీయ నాయకుడు, అతని కింద చిన్న నాయకులు.. వారి పంతమే నెగ్గాలనే ఆలోచనలు.. వెరసి గ్రామాభివృద్ధి కుంటుపడి రాజకీయ కక్షలు పెరుగుతున్నాయి. ఈ వర్గ విభేదాల కారణంగా గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం అందించే నిధులు, సంక్షేమ పథకాలు ప్రజలందరికీ, ముఖ్యంగా అర్హులైన వారికి చేరడం లేదు. నిత్యావసర సదుపాయాలు, ఉపాధి అవకాశాలు కొందరికే పరిమితమవుతున్నాయి. పథకాలు అర్హులైన, అవసరమైన వారి దరి చేరకుండా ఈ వర్గ రాజకీయాలు అడ్డుకుంటున్నాయి. చాలామంది వృద్ధులు, మహిళలు, పేదలు సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు. ఒకప్పుడు గ్రామాభివృద్ధి కోసం కలలు కన్న యువత రాజకీయ అసహనంతో అట్టుడుకుతున్నారు. వారి హృదయాల్లో నూతన ఆశలు మొలకెత్తాల్సిన సమయంలో నిరాశ, నిస్పృహలు అలుముకుంటున్నాయి. ఊరంతా కలిసికట్టుగా ఎదగాలనే కలలు.. 'మా వర్గమే గెలవాలనే కుటిల కాంక్షలో కనుమరుగైపోతున్నాయి. ఒక పార్టీ గెలిచి మరో పార్టీ ఓడినప్పుడు గ్రామం గెలవదు. గ్రామం గెలవడం అంటే ప్రతి ఇంట్లో వెలుగు నిండటం.. ప్రతి కుటుంబంలో సంపద పెరగడం.. గ్రామంలో పిల్లలకు మెరుగైన విద్య, వైద్య సేవలు అందడం.. వృద్ధులకు గౌరవం లభించడం.. ప్రభుత్వ పథకాలు బలహీనవర్గాలకు అందడం. ఒక్కమాటలో చెప్పాలంటే గెలుపంటే సామూహిక అభివృద్ధి. రాజకీయాలు చేయడం, పార్టీలకు మద్దతుగా నిలవడం తప్పు కాదు. ఎందుకంటే ప్రజాస్వామ్యంలో ఎన్నికల ద్వారానే తన భవిష్యత్తును నిర్ణయించే నాయకున్ని ఎన్నుకునే హక్కు ఓటరుకు ఉంది. కానీ, అది గ్రామస్థాయిలో వ్యక్తిగత పగ, ప్రతీకారాలకు సాధనంగా మారడం మాత్రం సరైనది కాదు. అందుకే పల్లె ప్రజలు విచక్షణతో మెలగాలి. పెద్ద పెద్ద నాయకులంతా బాగానే ఉంటారు. కానీ, గ్రామాల్లో సామాన్య కార్యకర్తలు మాత్రం కక్షలతో జీవిస్తుంటారు. ఇలా పగప్రతీకారాలు పెంచుకుంటూపోతే మనుషులు మాత్రమే కాదు, పల్లె కూడా నాశనమవుతుంది. వర్గ, కుల బలహీనతల్ని వదిలి, గ్రామాన్ని బతికించుకోవాలి. అభివృద్ధి పథంలో నడిపించుకోవాలి. వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాక, గ్రామ సమష్టి శ్రేయస్సు కోసం రాజకీయాలు చేయాలి. తాత్కాలికమైన వాటి కోసం బంధాలను, స్నేహాలను దూరం చేసుకోవడం సరికాదు. రాజకీయం ఎప్పుడూ అభివృద్ధి కోసం ఉండాలి. అంతేతప్ప వినాశనానికి కాదు. రానున్న రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే ఆస్కారం ఉంది. ఈ నేపథ్యంలో ఇప్పటికైనా ఈ రాజకీయ కక్షలను పక్కనపెట్టి.. పల్లెలో సౌభ్రాతృత్వాన్ని, సహకారాన్ని తిరిగి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మన పల్లెను మళ్లీ పచ్చగా, సస్యశ్యామలంగా మార్చాలి. అభివృద్ధి మార్గంలో అందరూ కలిసికట్టుగా సాగడమే ప్రజాస్వామ్యానికి నిజమైన విజయం.

# డీలిమిటేషన్‌పై గొంతెత్తాలి



సంఖ్యాబలంతో లోక్‌సభ, రాజ్యసభలో వక్ఫ్ సవరణ బిల్లు–2025ను ఎన్డీఏ ప్రభుత్వం ఆమోదింపజేసుకున్నది. జేడీయూ, టీడీపీ వంటి మిత్రపక్షాల సహకారం బీజేపీకి తోడైంది. ఆ తర్వాత రాష్ట్రపతి ఆమోదంతో ఈ బిల్లు చట్టరూపం దాల్చింది. అయితే వక్ఫ్ బిల్లు విషయంలో దూకుడుగా వెళ్లిన బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ.. డీలిమిటేషన్ విషయంలోనూ అలాగే వ్యవహరించే అవకాశమున్నది. ఎన్డీఏ, ఇండియా కూటములతో సంబంధం లేకుండా దక్షిణాది రాష్ట్రాలు కలిసికట్టుగా పోరాడకపోతే.. దక్షిణాది రాష్ట్రాలకు, ఇక్కడి ప్రజలకు తీరని నష్టం జరిగే ప్రమాదముంది. జనాభా లెక్కల ప్రకారం పునర్విభజన జరిగితే లోక్‌సభ స్థానాల సంఖ్య భారీగా పెరుగుతుంది. అదే జరిగితే ఉత్తరాది రాష్ట్రాలు భారీగా లబ్ధి పొందుతాయి. అదే సమయంలో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గి, భవిష్యత్తులో దక్షిణాది గళానికి విలువ లేకుండాపోతుంది. 1951–52లో దేశ జనాభా 36 కోట్లు కాగా, అప్పుడు లోక్‌సభ సీట్లు 489. పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన జరిగిన 1971లో దేశ జనాభా 54 కోట్లు. అప్పుడు సీట్ల సంఖ్యను 545కు పెంచారు. 1976లో కుటుంబ నియంత్రణ కార్యక్రమం జోరుగా సాగుతున్నది. తాము జనాభాను నియంత్రిస్తే లోక్‌సభ స్థానాల సంఖ్య తగ్గే ప్రమాదముందని అప్పట్లోనే దక్షిణాది రాష్ట్రాలు అనుమానం వ్యక్తం చేశాయి. దీంతో 1976లో లోక్‌సభ సీట్ల సంఖ్యకు మరో 25 ఏండ్లపాటు 1971 జనాభా లెక్కలనే పరిగణనలోకి తీసుకోవాలని 42వ రాజ్యాంగ సవరణ చేశారు. 2001లో నియోజకవర్గాల పునర్విభజన జరగాల్సి ఉన్నా.. అప్పటి ప్రధాని వాజపేయి 84వ రాజ్యాంగ సవరణ చేశారు. లోక్‌సభ సీట్ల సంఖ్య పెంపు అంశాన్ని 2026కి వాయిదా వేశారు. దీంతో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ 2026లో ఎలాగైనా నియోజకవర్గాలను పునర్విభజించాలని భావిస్తున్నది. జనగణనను పూర్తి చేసి నియోజకవర్గాలను పునర్విభజిస్తారా? లేదా 2011 డేటాను పరిగణనలోకి తీసుకొని పునర్విభజన చేస్తారా? అనేది కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉన్నది. ఉత్తరప్రదేశ్‌లో ప్రస్తుతం 80 లోక్‌సభ స్థానాలున్నాయి. పునర్విభజనతో ఆ రాష్ట్రంలో సీట్ల సంఖ్య 120కి చేరుకునే అవకాశం ఉంది. రాజస్థాన్, బీహార్, మధ్యప్రదేశ్ సహా ఇతర ఉత్తరాది రాష్ట్రాల్లో సీట్ల సంఖ్య గణనీయంగా పెరిగే ఆస్కారం ఉంది. 1952లో పార్లమెంట్ స్థానాల సంఖ్య 489 ఉన్నప్పుడు, అందులో దక్షిణాది వాటా 25.35 శాతం. 1967లో సీట్ల సంఖ్య 522కి కాగా, దక్షిణాది వాటా 24.13 శాతానికి పడిపోయింది. 1977లో సీట్ల సంఖ్య 545కు చేరగా, దక్షిణాది సీట్ల వాటా 23.85 శాతానికి పడిపోయింది. అయితే, ప్రస్తుతం డీలిమిటేషన్‌తో తెలంగాణలో లోక్‌సభ సీట్ల సంఖ్య 17 నుంచి 20కి మాత్రమే పెరుగుతాయి. ఏపీలో 25 నుంచి 28కి, తమిళనాడులో 39 నుంచి 41కి సీట్లు పెరిగే ఆస్కారం ఉంది. జనాభా ఆధారంగా డీలిమిటేషన్ జరిగితే ఉత్తరాదిలోని నాలుగైదు రాష్ట్రాల్లో సత్తా చాటే పార్టీ సులభంగా కేంద్రంలో అధికార పీఠాన్ని కైవసం చేసుకుంటుంది. దీంతో దక్షిణాది రాష్ట్రాలు తమ హక్కులను కోల్పోయే ప్రమాదముంది. ఇప్పటికే జాతీయ భాష అంటూ హిందీని రుద్దే ప్రయత్నం చేస్తున్నారు. నిధుల విషయంలోనూ మొదటి నుంచీ అన్యాయం జరుగుతున్నది. ఈ తరుణంలో పార్లమెంటులో ప్రాతినిధ్యం తగ్గితే దక్షిణాదిని కేంద్రం అస్సలు పట్టించుకోదు. డీలిమిటేషన్ వల్ల మనకు జరిగే అన్యాయంపై దక్షిణాదికి చెందిన మెజారిటీ రాజకీయ పార్టీలు ఏకమై జేఏసీగా ఏర్పడి పోరాటానికి సిద్ధమయ్యాయి. ఇప్పటికే తమిళనాడులో అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించారు. తెలంగాణ, కేరళ, పంజాబ్ ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, పినరయి విజయన్, భగవంత్ మాన్, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇందులో పాల్గొన్నారు. పలు తీర్మానాలను ఆమోదించి కేంద్రం ముందుంచారు. డీలిమిటేషన్‌ను మరో 25 ఏండ్లు వాయిదా వేయాలన్నది ఇందులో ముఖ్యమైనది.

# పారిశ్రామిక రంగ అభివృద్ధికి ప్రభుత్వం కృషి.

## జిల్లా కలెక్టర్ టి. ఎస్. చేతన్

## పరిశ్రమల స్థాపన తోనే జిల్లా అభివృద్ధి

## ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి...

పుట్టపర్తి, **(కదిలించే వార్త) మే 13:** రాష్ట్రంలో పారిశ్రామిక రంగాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని జిల్లా కలెక్టర్ టి. ఎస్. చేతన్ తెలిపారు. మంగళవారం సాయంత్రం పుట్టపర్తి మండలం కప్పల బండ సమీపంలో ఏపీఐఐసీ ఆధ్వర్యంలో సూక్ష్మ చిన్న మధ్యతర పారిశ్రామిక వాడ ను జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి మరియు మాజీ మంత్రి డా. పల్లె రఘునాథ్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తొలుత పారిశ్రామిక వాడలో జిల్లా కలెక్టర్ ఎమ్మెల్యే తదితరులు మొక్కలను నాటారు. అనంతరం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో పారిశ్రామిక వాడలు ఏర్పాటు, అలాగే మౌలిక సదుపాయ కల్పనకు సంబంధించి ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఒత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రభుత్వం అన్ని విధాల ప్రోత్సహిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. శ్రీ సత్య సాయి జిల్లా లో కూడా పారిశ్రామిక వాడల అభివృద్ధికి జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నేడు పుట్టపర్తి మండలం కప్పల బండ లో మౌలిక సదుపాయాల కల్పన కొరకు రూ. 11.71 కోట్లు రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల కార్పొరేషన్ ద్వారా సూక్ష్మ మరియు చిన్న సమస్యల క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమం కింద కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో వివిధ కంపెనీల స్థాపనకు ప్లాట్స్ అభివృద్ధి చేయడం జరుగుతున్నదని కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా రైతులు సహకారం అందిస్తే ఇంకా బాగా జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ముఖ్యంగా పరిశ్రమల ఏర్పాటుకు ఈ ప్రాంతం ఎంతో అనువుగా ఉందని అంతేగాక పరిశ్రమల ఏర్పాటు ద్వారా యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించవచ్చునని అన్నారు. 20 28 నాటికి రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాలలో ఎం ఎస్ ఎం ఏ పార్కులను ఏర్పాటు చేయడం ద్వారా ప్రతి ఇంట్లో కనీసం ఒక పారిశ్రామిక వేత్తను తయారు చేయడమే ప్రభుత్వ లక్ష్యంగా ఉందని అన్నారు. మొదటి దశలో 2000 కోట్ల పెట్టుబడి తో ఎం ఎస్ ఎం ఈ పార్కులో మరియు 20 27 28 నాటికి, 16000 ఎం ఎస్ ఎం ఈ యూనిట్ల స్థాపనకు ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. తద్వారా రెండు లక్షల ఉద్యోగాలు సృష్టించబడే అవకాశం



ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొదటి దశలో 11 ప్రారంభోత్సవాలు జరిగాయని అలాగే 39 దాకా శంకుస్థాపనలు అయినట్లు తెలిపారు. పరిశ్రమల స్థాపనతోనే యువతకు ఉపాధి కల్పించే విధంగా శ్రీ సత్య సాయి జిల్లాను ప్రథమ స్థానంలో నిలిచే విధంగా కృషి చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం కప్పల బండలో 192 ప్లాట్లు కాగా వీటిలో 34 ప్లాట్లు 14 యూనిట్లకు కేటాయించడం జరిగిందని, ఒక యూనిట్ పనిచేస్తుందని అలాగే నాలుగు అమలులో ఉన్నాయని మరియు తొమ్మిది యూనిట్లో ఇంకా అమలు కావాల్సి ఉందని కలెక్టర్ తెలిపారు. కొత్త దశ ఇప్పుడు ప్రారంభించబడితోందని ఇందులో 52.94 ఎకరాల విస్తీర్ణంలో 32 ప్లాట్లతో అభివృద్ధి చేయబడిందని తెలిపారు.

## అనంతరం పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె శ్రీమతి సింధూర రెడ్డి మాట్లాడుతూ



ఇంటికొక పారిశ్రామిక వేత్త తయారు కావాలని పిలుపునిచ్చారు. పరిశ్రమలతోనే ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. రాష్ట్రానికే పుట్టపర్తి పారిశ్రామికవాడ రోల్ మోడల్ గా



మార్చేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రస్తుతం పుట్టపర్తి సమీపంలోని కప్పలబండ పారిశ్రామికవాడలో 104 ఎకరాలలో రూ.154 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు తెలిపారు. పరిశ్రమలు ఏర్పాటు అయితే ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. పరిశ్రమలు రావడం వల్ల ఉద్యోగ అవకాశాలతో పాటు ఆదాయ రంగం పెరిగి ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. ఇక్కడ ఉన్న పారిశ్రామిక వేత్తలు చిన్న చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేస్తే ప్రభుత్వం ద్వారా సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ, 2014 నుంచి 2018 వరకు అప్పటి టిడిపి ప్రభుత్వం హయాంలో కప్పల బండ వద్ద 104 ఎకరాలు సేకరించి పారిశ్రామిక వార్డును ఏర్పాటు చేసి అభివృద్ధి చేయాలని ఆలోచనతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. 2019 నుంచి 2024 వరకు వైసీపీ పాలనలో పారిశ్రామిక అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న విధంగా తయారైంది అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో దూర దృష్టితో పారిశ్రామిక సంఘాన్ని అభివృద్ధి పరచాలనే ఉద్దేశంతో ఇంటికొక పారిశ్రామికవేత్తను తయారు చేయాలనే ఆలోచనతో ముందుకు వెళుతున్నారు.ప్రతి ఒక్కరు ఉత్పత్తిని రంగాన్ని ఏర్పాటు చేసుకొని ఆదాయ మార్గం వైపు పయనించాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ, పరిశ్రమలు వస్తే మన ప్రాంతం అభివృద్ధి చెంది ఆదాయం పెరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలు కూడా ఈ పారిశ్రామిక వేత్తలు కావాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేయాలనే ఆలోచనతో ముందుకు వెళుతున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ సువర్ణ ఏపీఐఐసీసీ జోనల్ మేనేజర్ సోనీ ఏపీఐఐసీ, డీఐసి అధికారులు ఎంపీపీ రమణారెడ్డి, టిడిపి కన్వీనర్ రామాంజనేయులు ,సామకోటి ఆదినారాయణ, మాజీ సర్పంచ్ చంద్రశేఖర్ , మాజీ ఎంపీపీ శ్రీరామ్ రెడ్డి , పాల్గొన్నారు.

Printed, Published, Owend by Neeruganti Shashikala& Printed at Sreenivasa Offset Printers D.No 12-73-A, Sai Nagar, Anantapur (Dt)APTEL/RNI NO/2021/81405 & Published at D. NO. 12-73-A, Sai Nagar. Anantapur . ANANTAPUR (Dt).(A.P) Editior Neeruganti Shashikala Cell : 6303427710